# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 3 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 96 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా




ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్‌గా నియమితులయ్యారు.

## జాబిలిని చూడాలనుందా!



అయితే, ఛలో బీజింగ్ మ్యూజియం

2



# బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలె

### మేం ఢిల్లీకి వచ్చేది లేదు... మోడీయే మా గల్లీకి రావాలె

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటు ఆమోదించాలె

జనగణనతో పాటు కులగణన చేయాలి

- మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా పెట్టాలి
- హస్తినలో బీసీ సంఘాల సభ
- అసదుద్దీన్ ఓవైసీ,ఎంపీలు కనిమొళి, సుప్రియా సూలే,తదితరుల సంఘీభావం



2

- బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఆమోదం తెలపండి
- లేదంటే ఎర్రకోటపై జెండా ఎగరేసి మేమే పెంచుకుంటం
- కమండల్ ప్రతినిధి మోడీ..
- బీసీలు పరేడ్ గ్రౌండ్‌లో ధర్మయుద్ధ సభ పెట్టాలి
- 42 శాతం రిజర్వేషన్లకై ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన బీసీ పోరుగర్జన సభలో సీఎం రేవంత్ రెడ్డి


హైదరాబాద్, మనం బ్యూరో: రిజర్వేషన్లు పెంచాలనే బలహీన వర్గాల కోరిక అసంబద్ధమైనది కాదు...ఆ కోరిక నెరవేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ముందుకు రావాలి. అలా రాకుంటే ఎర్రకోటపై జెండా ఎగురేసి మేమే రిజర్వేషన్లను పెంచుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్ల పెంపు అనే ధర్మమైన డిమాండ్ కోసం తాము హస్తినకు వచ్చామనీ, ఇకపై ఢిల్లీకి రాబోమని పేర్కొన్నారు. ఒకనాడు ధర్మయుద్ధ సభ పెట్టాలని మంద కృష్ణ మాదిగకు సూచించాననీ, అలా చేసి విజయం సాధించారనీ, పరేడ్ గ్రౌండ్‌లో బీసీలు ధర్మయుద్ధ సభ పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ బీసీ రిజర్వేషన్లు ఆమోదించకుంటే గద్దె దిగాలి, లేదంటే మేమే ఎర్రకోటపై జెండా ఎగురేసి రిజర్వేషన్లు సాధిస్తామని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాలతో పాటు చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిర్వహించిన బీసీల పోరు గర్జన సభలో సీఎం ప్రసంగించారు.

...మిగతా 2లో

## లోక్‌సభలో వక్ఫ్ బిల్లు

### ప్రవేశ పెట్టి చర్చను ప్రారంభించిన కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు

- వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటు లేదు: అమిత్ షా
- బిహార్ ఎన్నికల్లో లబ్ధి పొందేటందుకే ఈ బిల్లు అంటూ విపక్షాల ఆరోపణలు



ఢిల్లీ, ఏప్రిల్ 2: కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల

...మిగతా 2లో

## మంత్రివర్గ విస్తరణపై ప్రతిష్టంభన

### గ్రీన్ సిగ్నల్ ఇవ్వని కాంగ్రెస్ అధిష్టానం

- రాజగోపాల్ రెడ్డి, వివేక్‌కు మంత్రి పదవులపై భిన్నాభిప్రాయాలు
- కుదరని రాజకీయ, సామాజిక సమీకరణలు
- స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఇదే పరిస్థితి?

2

హైదరాబాద్, మనం బ్యూరో : తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. విస్తరణ రేపు...మాపంటూ ఎప్పటి నుంచో వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ గత నెల 24న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ అంశంపై చర్చించడానికి సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను ఢిల్లీకి పిలిపించింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితర కాంగ్రెస్ పెద్దలతో చర్చల అనంతరం ప్రస్తుతం క్యాబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీ ఉండగా, ప్రస్తుతానికి నాలుగింటిని

...మిగతా 2లో

## స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే? కోర్టులు చేతులు కట్టుకొని కూచోవాలా?

### పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్య



హైదరాబాద్, మనం ప్రతినిధి: బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టులో బుధవారంనాడు విచారణ జరిగింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేండ్లు స్పీకర్ చర్యలు తీసుకోకున్నా కోర్టులు చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంటూపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ నేత ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై వాదనలు కూడా ముగిశాయి. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవని

...మిగతా 2లో




## ఎల్‌ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

హైదరాబాద్, మనం ప్రతినిధి: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్ఎస్) రాయితీ గడువును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ రాయితీ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేండ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఎల్‌ఆర్ఎస్ రుసుమును 25 శాతం రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు మొదట గడువు ఇచ్చింది. తాజాగా ఈ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. రాయితీపై ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

## రిజర్వేషన్లను తప్పించుకునే ప్రయత్నమే


### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

హైదరాబాద్,మనం బ్యూరో: బీసీ రిజర్వేషన్ల పేరు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగడం 42 శాతం అమలు నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తున్న రేవంత్ రెడ్డికి ఎంత సేపూ వారిని వాడుకుని వదిలేయాలన్న ఆలోచన తప్ప రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఈమేరకు బుధవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేస్తున్నారనీ,

...మిగతా 2లో

## ఆ భూములపై నివేదిక ఇవ్వండి

### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రాష్ట్ర అటవీ శాఖకు కేంద్ర ప్రభుత్వ ఆదేశం



హైదరాబాద్, మనం బ్యూరో: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం తెలంగాణలో రాజకీయ దుమారం రేపుతున్న వేళ...ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ భూములపై నిజనిర్ధారణ నివేదిక పంపాలని రాష్ట్ర అటవీ శాఖను ఆదేశించింది. ఈమేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సమాచారం అందించింది. కోర్టు తీర్పులను పరిగణనలోనికి తీసుకుని ముందుకు వెళ్లాలనీ,

...మిగతా 2లో

## డీలిమిటేషన్‌పై ఆందోళన..

# ప్రధానితో భేటీకి సమయం కోరిన స్టాలిన్



9

## సీసీఐ ప్లాంటును తెరిపించాలె

### కేంద్ర మంత్రి కుమారస్వామితో తెలంగాణ ఎంపీల భేటీ

హైదరాబాద్, మనం ప్రతినిధి: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర,విప్ దీవకొండ దామోదర్ రావు,మాజీ మంత్రులు జోగు రామన్న, శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ప్రముఖులు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామితో భేటీ అయ్యారు. పార్లమెంట్ ప్రాంగణంలోని మంత్రి ఛాంబర్ లో బీఆర్ఎస్ ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావుల నాయకత్వాన మాజీ మంత్రి రామన్న ఆదిలాబాద్ వద్ద నెలకొన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్లాంటును తిరిగి తెరిపించాల్సిన అవసరం గురించి వివరించారు. బాగా వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా ను

## ఆకాశం నుంచి భూధృవాల వీక్షణం కోసం

# అంతరిక్ష యాత్ర చేస్తున్న నలుగురు



ఫ్లోరిడా(అమెరికా), (మనం న్యూస్): ఉత్తర, దక్షిణ ధ్రువాలను నింగి నుంచి సందర్శించడం కోసం నలుగురు వ్యక్తులు సోమవారం రాత్రి నింగిలోకి బయలు దేరి వెళ్లారు. ప్రస్తుతం మాల్టాలో నివసిస్తున్న చైనాలో జన్మించిన పారిశ్రామికవేత్త చున్ వాంగ్ తాను కొనుగోలు చేసిన ఫాల్కన్ రాకెట్‌లో మరో ముగ్గురితో కలిసి అంతరిక్షంలోకి దూసుకుపోయారు. మూడున్నర రోజుల ద్విధ్రువ సాహసయాత్ర కోసం ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ సంస్థ వద్ద ఫాల్కన్ రాకెట్‌ను కొనుగోలు చేశారు. ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి అంతరిక్షంలోకి పయనమయ్యారు. వారిలో నార్వేకు చెందిన ఫిల్మ్ మేకర్ జానిక్ మిక్కెల్సెన్, జర్మనీ రోబోటిక్ పరిశోధకులు రబియా రోగ్గే, ఆస్ట్రేలియా పోలార్ గైడ్

...మిగతా 2లో

## భూ విలయం..

# పెరుగుతున్న మృతుల సంఖ్య



- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్లు
- శిథిలాల కింద కొందరు సజీవంగా ఉండడంతో చిగురిస్తున్న ఆశలు
- భారత్ భారీ సాయం

ఢిల్లీ, ఏప్రిల్ 2: భారీ భూకంపంతో మయన్మార్, థాయ్‌లాండ్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. ప్రకృతి విపత్తు సంభవించిన ప్రాంతాల్లో ఎక్కడ చూసినా భవనాలు కూలిన శిథిలాలు కుప్పలే కనిపిస్తున్నాయి. ఈ శిథిలాల కింద చిక్కుకుపోయిన వేలాది మందిని రక్షించేందుకు సహాయక సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈక్రమంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన ఓ వ్యక్తిని సిబ్బంది రక్షించారు. అయిదు రోజులుగా ఆయన బతికి ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే, మొన్న కూడా ఒక గర్భిణిని సజీవంగా బయటకు తెచ్చారు. దీనితో శిథిలాల కింద బతికి ఉన్న వారెందరో ఉండొచ్చని ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఆ ఆశతోనే రెట్టించిన ఉత్సాహంతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈక్రమంలోనే మయన్మార్ రాజధాని నేపిడాలోని ఓ భవనం శిథిలాల కింద 26 ఏళ్ల

...మిగతా 2లో

# పెరుగుతున్న మృతుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిని గుర్తించారు. వెంటనే అతడిని రక్షించి, ఆస్పత్రికి తరలించారు. ఇటీవల రెస్క్యూ సిబ్బంది మాండలేలోని గ్రేట్వాల్ హోటల్ శిథిలాల నుంచి ఒక గర్భిణీని సజీవంగా బయటకు తీసిన సంగతి తెలిసిందే. ఇక, ఈ భూకంపం కారణంగా మధ్య, వాయువ్య మయన్మార్లో మొత్తం 10 వేల భవనాలు కులిపోవడం లేదా పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

నిమిషాల వ్యవధిలో వచ్చిన బలమైన ప్రకంపనల ధాటికి పలు నిర్మాణాలు, భవనాలు ఎక్కడికక్కడ పేకమేడల్లా కూలిపోయాయి. ప్రకృతి విపత్తు కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 2,719 మంది మృతిచెందగా.. 4,521 మంది గాయపడ్డారు. ఇంకా 441 మంది ఆచూకీ తెలియరావాల్సి ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సహాయక బృందాలు భూకంప తాకిడి ప్రాంతాలకు చేరుకోలేకపోతున్నాయి. రహదారులు ధ్వంసమవడం ఒక కారణమైతే.. ప్రభుత్వ, తిరుగుబాటు దళాల మధ్య ఘర్షణలు మరో ప్రధాన అవరోధంగా మారాయి. చాలాచోట్లకు ఆహారం, తాగునీరు, ఔషధాలు చేర్చలేకపోతున్నారు. థాయ్లాండ్ రాజధాని బ్యాంకాక్లో కుప్పకూలిన ఓ ఆకాశహర్మ్యం శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటివరకూ అక్కడ 13 మృతదేహాలు లభ్యమయ్యాయి.

**భారత్ సాయం..**
**625 మెట్రిక్ టన్నుల సామగ్రి**

విపత్కర సమయంలో పొరుగుదేశానికి అండగా నిలిచేందుకు 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట భారత్ పెద్దఎత్తున సహాయక సామగ్రిని చేరవేస్తోంది. 80 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యల్లో పాల్గొంటోంది. భారత్తో పాటు వివిధ దేశాలు కూడా మయన్మార్కు సాయాన్ని అందిస్తామని ప్రకటించాయి. ఇక, థాయ్లాండ్ రాజధాని బ్యాంకాక్లో ఇప్పటివరకు 13 మృతదేహాలు బయటపడ్డాయి. భూకంపం కారణంగా నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని మీడియా కథనాలు వెలువరిస్తున్నాయి.

# జాబిలిని చూడాలనుందా!

బీజింగ్, ఏప్రిల్ 2: చందమామ గురించి ఏ విషయమైనా మనకు ఆసక్తి కలిగిస్తుంది. ఏ సమాచారాన్నైనా మనం ఆసక్తిగా వింటాం, దృశ్యాలను ఆశ్చర్యంగా చూస్తుంటాం. అంతటి ఆసక్తి గల చందమామ గురించి మానవులు ఎన్నో ప్రయోగాలు చేశారు. ఎంతో సమాచారాన్ని సేకరించారు. చివరకు అక్కడ నివాసముండటానికి ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆది నుంచీ చంద్రునిపై మనుషులు చేస్తూ వస్తున్న ప్రయోగాలు.. పొందిన విజ్ఞానం, అక్కడ నుంచి తెచ్చిన మట్టి, చంద్రునిపైకి వెళ్లే రాకెట్లు, ఉపగ్రహాలు, అక్కడ పరిశోధించే విధానం..తదితరాంశాలన్నీ ప్రజలకు తెలియజేసేందుకు చైనాలో ఓ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో జాబిల్లిపై సేకరించిన నమూనాలను తొలిసారి సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఆ దేశ రాజధాని బీజింగ్లో చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ మ్యూజియం ఆఫ్ చైనా సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో చంద్రునిపై ఆ దేశం సాధించిన ఘనతలన్నీ ప్రదర్శనకుంచారు. నిర్వాహకులు ఊహించిన దాని కన్నా ఎక్కువగా దీనికి ప్రజల నుంచి స్పందన వస్తున్నట్టు సమాచారం.

# అంతరిక్ష యాత్ర చేస్తున్న నలుగురు

(మొదటి పేజీ తరువాయి)

ఎరిక్ ఫిలిప్స్ ఉన్నారు. 430 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లిన వారు తొలుత దక్షిణ ధ్రువానికి చేరుకున్నారు. ఇందుకోసం వారికి అరగంట సమయం పట్టింది. పూర్తిగా ఆటోమేటిక్ గా పనిచేసే ఈ క్యాప్సూల్ గంటన్నరలో భూమిని చుడుతుంది. ఇందులో ఒక ధ్రువం నుంచి మరో ధ్రువానికి ప్రయాణించిన 46 నిమిషాలు కలిసి ఉంది. గతంలోనే చున్ వాంగ్ ఉత్తర, దక్షిణ ధ్రువాలను సందర్శించారు. కానీ అంతరిక్షం నుంచి వాటిని చూడాలనేది ఆయన కోరిక. అందుకోసమే ఈ యాత్ర చేపట్టారు. 2002 నుంచి గగన యానం మొదలు పెట్టిన వాంగ్.. విమానాలు, హెలికాప్టర్లు, హాట్ ఎయిర్ బెలూన్లద్వారా ప్రపంచంలోని అన్ని దేశాలను చుట్టాలని భావిస్తున్నారు. ఇప్పటికి సగంకంటే ఎక్కువ పూర్తి చేశారు. ప్రస్తుతం స్పేస్ఎక్స్ రాకెట్తో తన 1,000వ వైమానిక ప్రయాణం పూర్తి చేయనున్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటు ఆమోదించాలె

హైదరాబాద్, మనం బ్యూరో : బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్మంతర్లో బీసీ సంఘాల ధర్నా జరిగింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును పార్లమెంట్లోనూ ఆమోదించి అమలు చేయాలని, దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేయాలని, 33శాతం మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎంపీలు కనిమొళి, సుప్రియా సూలే తదితరులు ఈ ధర్నాకుకు హాజరై సంఘీభావం తెలిపారు.

# బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలె

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండల్లో గడ్డకట్టే చలిలో రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర స్ఫూర్తి, ఆ సమయంలో ఆయన ఇచ్చిన హామీ మేరకే బలహీన వర్గాలకు రిజర్వేషన్లు పెంచుతూ తీర్మానం చేశామని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలన్నా స్థానిక సంస్థల్లో ఇప్పుడున్న రిజర్వేషన్లు కొనసాగాలన్నా జన గణనలో కుల గణన జరగాల్సిందేనని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా కుల గణన చేపడతామని విధానపరమైన నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు బీజేపీ నేతలు విధానపరంగా వ్యతిరేకులని సీఎం ఆరోపించారు. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ను నియమిస్తే వీపీ సింగ్ దాని దుమ్ము దులిపి ముందుకు తెచ్చారని గుర్తు చేశారు. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు అయిదు ఊళ్ల కోసం కృష్ణుడు రాయబారానికి వచ్చాడని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అయిననూ పోయి రావలె హస్తినకు అనే రీతిలో తాము హస్తినకు వచ్చామనీ, తెలంగాణలో ఆమోదించిన తీర్మానాలను పార్లమెంటులో ఆమోదిస్తే 10 లక్షల మందితో సభ పెట్టి ప్రధానమంత్రిని సన్మానిస్తామని అన్నారు. మాపై ఆధిపత్యం చెలాయించాలని అనుకున్న నిజాంలకు, గడీల దొరలకు ఏమైందో తెలుసుకోవాలని ప్రధానమంత్రికి సూచించారు. బుక్కెడు బువ్వ పెట్టినా, మంచినీళ్లు ఇచ్చినా మర్చిపోని బలహీనవర్గాలకు మీరెందుకు పట్టించుకోరని ప్రధాని మోడీని రేవంత్ ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్ల సాధనకై జంతర్ మంతర్లో 16 పార్టీలు ఏకమై మద్దతు ప్రకటించినప్పుడు మీరెందుకు స్పందించరని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బీసీల కోసం ప్రాణమిస్తానని అంటున్నాడు...ఆయన ప్రాణం మాకు వద్దు...ఆయన వందేళ్లు జీవించాలి రిజర్వేషన్లు పెంచితే మాకు చాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచుకునేందుకు ప్రధాని మోడీని అడిగామనీ, గుజరాత్ ఇతర రాష్ట్రాల్లో పెంచాలని అడగలేదని తెలంగాణలో రిజర్వేషన్లు పెంచితే మోడీకి వచ్చిన నష్టమేంటో చెప్పాలని ప్రధాని మోడీని డిమాండ్ చేశారు. చట్టసభలో మెజార్టీ లేకపోయినా ట్రిపుల్ తలాక్, 370 రద్దు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దేశ ప్రజలపై ప్రధాని రుద్దారనీ, తెలంగాణలోని అన్ని పార్టీలు సమర్థించిన తీర్మానాలకు ఎందుకు అనుకూలంగా ఉండరని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# రిజర్వేషన్లను తప్పించుకునే ప్రయత్నమే

(మొదటి పేజీ తరువాయి)

ఈ కారణంగానే విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. బీసీ ద్రోహులైన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కపట ప్రేమ కనబరుస్తూ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే రాజకీయ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సర్వేలో బీసీల జనాభా 46 శాతం అని చెప్పున్నారు, మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా ? సగానికి పైగా ఉన్న బీసీలకు మీరిచ్చిన మంత్రి పదవులు రెండంటే రెండే దీనిని బట్టే తెలుస్తుంది బీసీల మీద మీకు ఎంత ప్రేమ ఉందో ప్రత్యేక ఎంబీసీ మంత్రిత్వ శాఖ అన్నారు, అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర కావొస్తోంది. ఇంకెప్పుడు ప్రత్యేక ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

**42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే : బండి సంజయ్**

42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కదా అని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ చేతగానితనాన్ని కేంద్రంపై రుద్ది తప్పించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని మోదీ ప్రభుత్వాన్ని అడిగి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచారా ? మతపరమైన రిజర్వేషన్లకు మోడీ ప్రభుత్వం వ్యతిరేకమని మీకు తెలియదా అని ప్రశ్నించారు. 56 శాతమున్న బీసీలను 46 శాతానికి తగ్గించి మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అనీ, 42 శాతం బీసీ రిజర్వేషన్లలలో 10 శాతం ముస్లింలే లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయనీ, బీసీలకు అదనంగా ఒరిగేది 5 శాతమేనా అని ప్రశ్నించారు. బీసీలకే కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తుంటే బీసీ సంఘాలు ఎందుకు నోరెత్తడం లేదనీ, నిలదీయాల్సింది పోయి కాంగ్రెస్ను సంకనేసుకుని ఢిల్లీలో ధర్నా పేరుతో డ్రామాలాడుతారా ? అని ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రశ్నించారు.

## సీసీఐ ప్లాంటును తెరిపించాలె

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేసేందుకు గాను అప్పటి కేంద్ర ప్రభుత్వం సీసీఐను నెలకొల్పిందని చెప్పారు. కొన్నేళ్లుగా ఈ కర్మాగారాన్ని మూసివేయడంతో వందలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడంతో వారి కుటుంబాలతో పాటు వేలాది మంది ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావులు మంత్రి కుమారస్వామి దృష్టికి తెచ్చారు.

# మంత్రివర్గ విస్తరణపై ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

భర్తీ చేయడానికి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రి పదవులపై ఆశతో ఎదురుచూస్తున్న సుదర్శన్ రెడ్డి, వివేక్, రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరి పేర్లు ఖరారయ్యాయనీ, గత నెల 29 లేదా ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరిగింది. అయితే, ఆ తరువాత జరిగిన నాటకీయ పరిణామాల్లో భాగంగా రాజగోపాల్ రెడ్డి, వివేక్ను కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకోవడంపై రాహుల్ గాంధీ సుముఖత వ్యక్తం చేయలేదని తెలిసింది. రాజగోపాల్ రెడ్డి సోదరుడు వెంకట్రెడ్డి ఇప్పటికే మంత్రివర్గంలో ఉన్నారనీ ఇప్పుడు ఆయనకు ఇస్తే ఒకే కుటుంబం నుంచి రెండు మంత్రిపదవులు ఇచ్చినట్లవుతుందని అభిప్రాయపడినట్లు సమాచారం. ఇక వివేక్ బీజేపీ నుంచి కాంగ్రెస్లోకి వచ్చినందున ఎప్పటి నుంచి పార్టీలో ఉన్న ఆయన సోదరుడు వినోద్తో అసంతృప్తి ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నట్లు తెలిసింది. మరోవైపు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్న మల్రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్రెడ్డి తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని అధిష్టానం పెద్దలను కలిశారు. తాజాగా ఈ జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత జానారెడ్డి పార్టీ అధిష్టానానికి లేఖ రాశారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, స్కిల్ వర్సిటీ, డ్రోన్స్ హబ్లు రంగారెడ్డి జిల్లా పరిధిలో ఏర్పాటవుతున్నందున ఆ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పిస్తే ఆయా పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుందని విన్నవించారు. అలాగే, ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఎవరికైనా మంత్రి పదవి ఇవ్వాలని ఆ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తాత్కాలికంగా వాయిదా వేసిందనీ, మరికొద్ది రోజుల్లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల తరువాత ఈ విషయంపై ఆలోచించే అవకాశం ఉందని కాంగ్రెస్ పెద్దలు ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే? కోర్టులు చేతులు కట్టుకొని కూచోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

రోహత్గీ అన్నారు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుందని తెలిపారు. స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ఒక కాలపరిమితి విధించాలని కోర్టు చెప్పడం భావ్యం కాదని అన్నారు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా అనేది స్పీకర్ నిర్ణయమే అని తెలిపారు. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదని కోర్టుకు తెలిపారు. జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ, సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడం లేదా ఆదేశించడం చేయలేమా? అని ప్రశ్నించారు.ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్కు ఫిర్యాదు చేసిన వారంలోనే బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారని ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కనీసం ఆలోచించే సమయం కూడా ఇవ్వలేదని అన్నారు.

# ఆ భూములపై నివేదిక ఇవ్వండి



(మొదటి పేజీ తరువాయి)

అటవీ చట్టానికి లోబడి వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. వాస్తవ నివేదిక, తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర అటవీ శాఖను ఆదేశించింది.

**హెచ్సీయూలో తీవ్ర ఉద్రిక్తత**

కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్సీయూ) వద్ద విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ వారు నిరసనలు తెలుపుతున్నారు. అయితే, బుధవారం ఉదయం హెచ్సీయూ క్యాంపస్ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి, వర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా చేయడంతో పాటు విద్యార్థులను బయటకు పోనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్యాంపస్లో విద్యార్థులు, ప్రొఫెసర్లు నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై లాఠీఛార్జ్ చేశారు. దాంతో పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు, విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్సీయూ క్యాంపస్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

# లోక్సభలో వక్ఫ్ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు'' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. ''వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారు, వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోడీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం'' అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి.

అంతకు ముందు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గోగోయ్ మాట్లాడుతూ.. మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లుపై సభను తప్పు దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా.. ఈ బిల్లు సవరణలు సమర్పించడానికి ఒక ఏడాది ముందు, 2023లో నాలుగు పార్లమెంటరీ కమిటీ సమావేశాలు జరిగాయని.. వాటిలో దేనిలోనూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ బిల్లు గురించి ఎందుకు ప్రస్తావించలేదని సూటిగా ప్రశ్నించారు. దీనికి జవాబుగా మాట్లాడిన కిరణ్ రిజిజు.. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులున్నాయని, ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసిందన్నారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని కిరణ్ గుర్తు చేశారు. కానీ అప్పుడు యూపీఏ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని తెలిపారు. అయితే, ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్ సభలో ప్రవేశపెట్టకుంటే పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని అన్నారు. ఇలాంటి వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వారాలను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లెయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. వాస్తవాలిలా ఉండగా.. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ ప్రతిపక్షాలకు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని ఆరోపించారు.

వక్ఫ్ బోర్డు విషయంలోనూ తాము స్పష్టంగా ఉన్నామని ఆయన చెప్పారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయించామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోరుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు.

ఇదిలా ఉండగా.. ఈ ఏడాది చివర్లో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే ఎన్డీయే సర్కారు ఈ బిల్లును తెస్తుందని విపక్షాలు ఆరోపించాయి. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు ఉన్నాయని, అందుకోసమే ఈ బిల్లును వాడుకుంటారని చెబుతున్నాయి. నిరసనగా కోలకతాలో మార్చ్ జరిగింది.



**వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటు లేదు: అమిత్ షా**

బిల్లుపై బుధవారంనాడు చేపట్టిన చర్చ సందర్భంగా వక్ఫ్ సవరణ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని, ముస్లింల మతపరమైన వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం ఉండదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కేవలం ఓటు బ్యాంకు కోసమే ముస్లింల మతపరమైన వ్యవహారాల్లో, విరాళాలుగా వచ్చిన ఆస్తుల విషయంలో వక్ఫ్ బిల్లు జోక్యం చేసుకుంటుందనే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరలకు చోటు లేదని స్పష్టం చేశారు. 'వక్ఫ్ చట్టం, బోర్డు 1995లో అమల్లోకి వచ్చాయి. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేరుస్తామని, వక్ఫ్లో జోక్యం చేసుకుంటామని కొందరు వాదనలు చేస్తున్నారు. మొదటగా వక్ఫ్ బోర్డులో ఏ ముస్లిమేతరులు ఉండరని నేను చెప్పదలచుకున్నాను. అలాంటి ప్రొవిజన్ ఏదీ ఇందులో లేదు. అలా చేయాలని కూడా మేము కోరుకోవడం లేదు. ముస్లింల మత పరమైన కార్యక్రమాల్లో, వాళ్లు విరాళాలుగా ఇచ్చిన ఆస్తుల్లో జోక్యం చేసుకుంటామనేది కూడా పూర్తిగా అపోహే. కేవలం ముస్లింల ఓటు బ్యాంకు కోసమే ఇలాంటి తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి' అని అమిత్ షా పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సభలో జరుగుతున్న చర్చలను చాలా జాగ్రత్తగా వింటున్నానని, కొందరి సభ్యుల్లో తప్పుడు అపోహలు ఉన్నాయని, అవి సహజమైనవి కావచ్చు, రాజకీయమైనవి కూడా కావచ్చని అన్నారు. సభ ద్వారా తప్పుడు అపోహలు వ్యాప్తి చేసే ప్రయత్నం కూడా కావచ్చని అన్నారు. 2014 ఎన్నికలకు ముందు న్యూఢిల్లీలోని 123 వీఐపీ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డుకు డొనేట్ చేసిందని చెప్పారు. 2013లో కూడా వక్ఫ్ చట్టానికి సవరణలు చేయడం ద్వారా రైల్వే భూమిని వక్ఫ్ కు డొనేట్ చేసిందన్నారు. 2013లో వక్ఫ్ సవరణలు ప్రవేశపెట్టినప్పుడు లాలూ ప్రసాద్ యాదవ్ కఠినమైన చట్టాన్ని తాము కోరుకుంటున్నామని, దోపిడీలకు పాల్పడే వారికి జైలులో పెడతామని చెప్పారని, లాలూ ప్రసాద్ ఆకాంక్షలను ఇప్పుడు నరేంద్ర మోదీ నెరవేర్చనున్నారని చెప్పారు.

**దేనికోసమీ వక్ఫ్?**

ఇస్లాం సంప్రదాయంలో, ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానం లేదా విరాళాన్ని వక్ఫ్ అంటారు. వక్ఫ్ ఆస్తులన్నీ భగవంతుడికి చెందుతాయని భావించడం వల్ల వాటిని అమ్మడం లేదా ఇతర ప్రయోజనాలకు ఉపయోగించడం చేయకూడదు. విస్తృత సంఖ్యలో ఉన్న వక్ఫ్ భూములను మసీదులు, మదర్సాలు, శ్మశానాలు, అనాథాశ్రమాల నిర్మాణం కోసం ఉపయోగించారు. ఇంకా అనేక భూములను స్థానిక వక్ఫ్ బోర్డు సభ్యులతో కుమ్మక్కై చాలా భూముల్ని కబ్జాకోరులు కబ్జా చేసేశారు. కొంత మంది వక్ఫ్ బోర్డు సభ్యులు నిబంధనలను ఉల్లంఘించి కబ్జాదారులతో రాజీ పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని ముస్లిం సంఘాలు సైతం అంగీకరిస్తున్నాయి. ఈ ఆస్తులను ముస్లింలలో ఉన్నత వర్గాలు నిర్వహిస్తున్నాయని, అందుకే వక్ఫ్ చట్టానికి సవరణలు అవసరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు చెబుతున్నారు. ముస్లింల నుంచి వారి భూములను లాక్కునేందుకే ఇలాంటి మార్పులు చేస్తున్నారని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపిస్తున్నారు. 12వ శతాబ్దంలో మధ్య ఆసియా నుంచి వచ్చిన ముస్లిం పాలకులైన ఢిల్లీ సుల్తానుల పాలనతో భారత్ లో ఈ వక్ఫ్ ఆచారం మొదలైంది. అయితే, 1995లో చేసిన వక్ఫ్ చట్టం ప్రకారం ఈ ఆస్తులన్నింటినీ రాష్ట్ర స్థాయి వక్ఫ్ బోర్డులు నిర్వహించాలి. ఈ బోర్డులో ప్రభుత్వం నియమించే వ్యక్తులతో పాటు ముస్లిం ప్రజా ప్రతినిధులు, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు, ఇస్లామిక్ స్కాలర్లు, వక్ఫ్ ప్రాపర్టీస్ మేనేజర్లు ఉంటారు. కాగా, దేశంలో వక్ఫ్ బోర్డులే అతిపెద్ద భూస్వాములుగా ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దేశ వ్యాప్తంగా దాదాపు 8,72,351 వక్ఫ్ ఆస్తులు ఉన్నాయి. ఇవన్నీ 9లక్షల 40వేల ఎకరాల్లో ఉన్నాయని, వీటి విలువ 1.20 లక్షల కోట్లు ఉంటుందని ప్రాథమిక అంచనాగా చెబుతున్నారు.

కాగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దశాబ్దాల నాటి వక్ఫ్ చట్టాన్ని మార్చాలని భావిస్తోంది. కొత్తగా తెచ్చే బిల్లు వక్ఫ్ ఆస్తులను ఇంకా మెరుగ్గా వాడుకోవడానికి ఉపయోగపడుతుందని కేంద్రం అంటోంది. అయితే, సంస్కరణల పేరుతో వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం ప్రయత్నిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ బిల్లును గత ఏడాది ఆగస్టులో లోక్సభలో ప్రవేశపెట్టారు. కానీ విపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దీనిని వివిధ పార్టీలకు చెందిన దాదాపు 31 మంది ఎంపీలతో కూడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. ఇక, ఇవాళ వక్ఫ్ సవరణ బిల్లు 2024ను కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో ప్రవేశపెట్టింది.

**మరోసారి దేశవిభజన కానీయం: అనురాగ్ ఠాకూర్**

వక్ఫ్ సవరణ బిల్లు- 2024 కేవలం ఒక బిల్లు కాదని, సాధికారత, సామర్థ్యం అభివృద్ధిని ఉద్దేశించినదని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ అన్నారు. బిల్లుపై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలుసుతున్నారని అన్నారు. కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా, చర్చ్ ఆఫ్ భారత్, కేరళ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్, కేరళ కేథలిక్ బిషప్స్ కౌన్సిల్, ఆలిండియా సూఫీ కౌన్సిల్, ముస్లిం రాష్ట్రీయ మంచ్ మద్దతు ప్రకటించాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే వక్ఫ్ ఏర్పాటైందని, వక్ఫ్ ఏమి చేసినా సరైనదేనని ఆ పార్టీ భావిస్తూ వచ్చిందని, వక్ఫ్ భయాల నుంచి విముక్తి కలిగించేందుకు ఇదే సరైన తరుణమని అన్నారు. వక్ఫ్ ల్యాండ్ లో అవినీతికి పాల్పడినందు వల్లే వక్ఫ్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఘాటుగా విమర్శించారు. ఆ పార్టీ బుజ్జగింపు రాజకీయాలకు ఈ సవరణ చట్టం చరమగీతం పాడుతుందన్నారు. మతం ఆధారంగానే 1947లో దేశ విభజన జరిగిందని, మరోసారి మతం పేరుతో దేశ విభజన జరగనీయమని అనురాగ్ ఠాకూర్ అన్నారు. అప్పట్లో దేశవిభజనకు ఒక కుటుంబం, ఒక పార్టీ కారణమైందని విమర్శించారు. ఈ రోజు 'ల్యాండ్ జీహాద్' పేరుతో మరోసారి దేశ విభజనను జరగనీయమని అన్నారు. వక్ఫ్ బోర్డు భయాల నుంచి దేశానికి విముక్తి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

# డిసిసి బ్యాంక్‌కు 42.31 కోట్ల లాభాలు

### డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



నల్లగొండ,ఏప్రిల్ 2(మనం న్యూస్): 2024 25 ఆర్థిక సంవత్సరానికి గాను డిసిసి బ్యాంకు 2850. 81 కోట్ల వ్యాపారం చేసి 42.31 కోట్ల లాభాలను ఆర్జించినట్లు డిసిసి బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం డిసిసి బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 30 కోట్లు ఆర్జించగాఈ ఆర్థిక సంవత్సరం అదనంగా 12.31 కోట్ల లాభాలను సాధించినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 2300 కోట్ల వ్యాపారం చేయగా ఈ సంవత్సరం 550.81 కోట్లు అదనంగా కలుపుకొని 2850.81 రూపాయల వ్యాపారం చేసిలాభాలను ఆర్జించినట్లు తెలిపారు. అదే విధంగా ఎన్ పి ఏ ఒకటి.85% నుండి 1.38 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఆర్థిక సంవత్సరంలో అధిక లాభాలు వ్యాపార అభివృద్ధి సాధించడం బ్యాంకు ఉద్యోగుల సిబ్బంది కృషివలనని ఆయన వారిని అభినందించారు .అలాగే సహకార లక్ష్మి సహకార సమృద్ధి స్కీముల ద్వారా 100 కోట్ల డిపాజిట్లను సేకరించామని తెలిపారు. అలాగే క్రాప్ లోను లక్ష రూపాయల నుండి 1,50,000 కు పెంచి 614 కోట్ల రూపాయల పంట రుణాలు ఇచ్చామన్నారు. అలాగే బంగారు రుణాల పరిమితిని కూడా పెంచామని సుమారు 295. 56 కోట్ల నికర వ్యాపారం చేశామన్నారు .మార్ట్ గేజ్ ద్వారా 35 లక్షల వరకు భూతానకపై గ్రామీణ పట్టణ ప్రాంతాలలో నూతన ఇంటి నిర్మాణాలకు రుణాలు ఇచ్చామన్నారు. గొర్రెలు నాటు కోళ్లు పెంపకానికి సబ్సిడీ స్కీమ్ ఎన్ఎల్ఎం ప్రారంభించామని గోడౌన్ల నిర్మాణానికి స్టోరేజ్ ప్రాజెక్టు పథకాన్ని కూడా ప్రారంభించామని తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరం మిర్యాలగూడ టు శాలిగౌరారం,పెద్ద ఊర,మోతే, చిలుకూరు ,నాంపల్లి కొత్త బ్రాంచ్ల కొరకు ఆర్బిఐ కి పర్మిషన్ కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.గతంలో నష్టాల్లో ఉన్న సొసైటీలు ఇప్పుడు లాభాల బాటలోకి రావడం జరిగిందని, అదేవిధంగా సంఘాల ద్వారా అన్ని రకాల రుణాలు ఇవ్వడం ఎరువులు అమ్మడం వడ్ల కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందించడం జరిగిందన్నారు. అలాగే 2025 26 సంవత్సరానికి ఇంతకంటే ఎక్కువ వ్యాపారం చేసి అధిక లాభాలు తీసుకువచ్చి బ్యాంకును వాణిజ్య బ్యాంకుల కు దీటుగా ముందుకు నడుపుతామన్నారు ఈ సమావేశంలో సీఈవో శంకర్రావు, జనరల్ మేనేజర్ నర్మదా ,డీజిఎం ఉపేందర్ రావు, ఏజీఎంలు వెంకటేశ్వర్లు, ఉదయశ్రీ ,కృష్ణ లత ,డైరెక్టర్లు సైదులు, సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

## పటాన్చెరు బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్గా ఆదర్శ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 2(మనంన్యూస్): బుధవారం ఎర్రవల్లి ఫాంహౌస్లో ఉమ్మడి మెదక జిల్లా బీఅర్ఎస్ నేతలతో మాజీ ముఖ్య మంత్రి కేసీఅర్ సమావేశం అయ్యారు. ఏప్రిల్ 27న బి ఆర్ ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ లో ఏర్పాటు చేసే భారీ బహిరంగసభకు కే.సి.ఆర్ దిశనిర్దేశం చేశారు. పటాన్చెరు నియోజకవర్గం నుంచి బి.ఆర్.ఏస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ని కె సి ఆర్ పటాన్చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ గా నియమించారు. బి.ఆర్.ఏస్ పార్టీ ఆవిర్భావించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను జరిపేందుకు సన్నాహాలు పై చర్చించారు. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారిగా సన్నాహక సమావేశం పెట్టుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రతీ ఊరులో జెండా పండుగ నిర్వహించి జండా ఆవిష్కరించి, జనసమీకరణ చెయ్యాలని వరంగల్ సభ ను విజయవంతం చేయాలని కోరారు.

## ఢిల్లీలో బీసీ పోరు గర్జన మహాధర్నాలో కాంగ్రెస్ నాయకులు



రంగారెడ్డి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): బలహీన వర్గాలకు విద్య,ఉద్యోగ,రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ , మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , టి పీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీల పోరు గర్జన మహాధర్నాలో మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ ధనరాజు గౌడ్, పందుల వెంకటేష్ గౌడ్, మేదరి అజయ్ కుమార్,ఊట రాజు,రాఘవ, చేగురి రమేష్,శివ, తోట శ్రీనివాస్, మహేష్ యాదవ్, జితేందర్ గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

# గచ్చిబౌలి భూములపై బీజేపీ, బీఆర్ఎస్ రాద్ధాంతం తగదు

### టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 2(మనంన్యూస్): హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలో400 ఎకరాల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుల్లో కొట్లాడి సాధించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు అవి హెచ్.సి.యూ. భూములు అని రాద్ధాంతం చేయడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వాస్తవానికి ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 2003లో ఐఎంజీ అకాడమీస్ సంస్థకు కేటాయించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఐఎంజీ అకాడమీస్ సంస్థకు భూమిని కేటాయించిన ఉత్తర్వులను రద్దు చేసి, 2006 నవంబరులో ఏపీ యూత్ అడ్వాన్స్ మెంట్ టూరిజం, కల్చరల్ డిపార్టుమెంటుకు కేటాయించడం జరిగింది. అయితే, తమకు కేటాయించిన భూమి బదలాయింపు రద్దుపై ఐఎంజీ అకాడమీస్ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.అందులో ప్రతివాదులుగా న్యాయ, శాసన వ్యవహారాలశాఖ, యూత్, టూరిజం, కల్చరల్ డిపార్టుమెంట్, క్రీడాశాఖ వీసీ, ఎండీతోపాటు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి తహసీల్దార్, పైన అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలను చేర్చడం జరిగింది. ఈరోజు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నట్లుగా ఆ భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీవి అయితే హెచ్.సి.యూ అధికారులను కూడా కేసులో ప్రతివాదులుగా చేర్చేవారు కదా? దీన్నిబట్టి ఈ భూములు సెంట్రల్ యూనివర్సిటీవి కావని స్పష్టమవుతుందని బండి సుధాకర్ గౌడ్ వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే రాజకీయ కుట్రలు చేస్తూ, ప్రసార మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు చూస్తూ, విద్యార్థులను రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. ఐఎంజీ అకాడమీస్ సంస్థకు వ్యతిరేకంగా 2004లో హైకోర్టులో తీర్పు రావడంతో రావడంతో, ఆ సంస్థ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ 9265/ 2024 ద్వారా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయడం జరిగింద న్నారు. సుప్రీంకోర్టు కూడా ఈ భూములు ప్రభుత్వానివేనని తీర్పునివ్వడంతో సుదీర్ఘ పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వ వాదనను బలంగా వినిపించి అన్యాయం కానున్న భూములను రేవంత్ సర్కారు కాపాడిందన్నారు. ఇది చూసి ఓర్వలేని కుహనా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలతో అమాయక విద్యార్థులను రెచ్చగొడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. ఎవరు అవునన్నా, కాదన్నా.. కంచ గచ్చిబౌలి ప్రభుత్వ భూముల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐటీ అభివృద్ధి చేసి తీరుతుందన్నారు. వాస్తవాలను వక్రీకరించి, తప్పుడు ప్రచారాలతో విద్యార్థులను రెచ్చగొట్టే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## చలివేంద్రం ప్రారంభం



రంగారెడ్డి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఎంతగానో దోడద పడతాయని కాలనీ అద్యక్షుడు గండు ధనం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాలనీ అసోసియేషన్ అధ్వర్యంలో చలువేంద్రం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలువెంద్రలు చాలా ఉపయోగ పడతాయని తెలిపారు. బాట సారులు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకో వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు మరోజు శ్రీనివాస రావు, ప్రధాన 5కార్యదర్శి కనకరావు, కోశాధికారి సాయి కిరణ్, శాంతి ప్రసాద్, మాధవ రెడ్డి, బలరాజ్ గుప్తా, సుధాకర్, నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేత



ఆల్కపూర్ టౌమషిప్ రోడ్ నెంబర్ 4లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ ల్లో ఫ్రీ కోచింగ్ క్రికెట్ మరియు బాక్సింగ్ ఫ్రీ కోచింగ్ గురించి పర్మిషన్ తీసుకోడం, పరిశుభ్రంగా ఉంచుకోవడం కోసం శ్రీరేఖ ఆనంద్ రావు, హన్సరాజ్ కలిసి కమిషనర్కి వినతి పత్రం అందజేశారు.

- గండిపేట, మనంన్యూస్

## రబీ సీజన్లో సేకరించే ధాన్యాన్ని ప్రభుత్వమే భద్రపరచాలి

**మంత్రి సీతక్కకు వినతి పత్రం అందించిన ములుగు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్**



ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 2 ( మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు మధ్యతరగతి కుటుంబాలకు తినేందుకు గత ప్రభుత్వాలు అందించిన దొడ్డు రకం బియ్యం స్థానంలో సన్న బియ్యం అందించేందుకు ఉగాది నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని ములుగు జిల్లా మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. ఈ సందర్భంగా మిల్లర్లు ప్రస్తుతం రబీ సీజన్లో సేకరించాల్సిన ధాన్యం విషయంపై పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ములుగు జిల్లా మంత్రి అయిన సీతక్కకు బుధవారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ములుగు జిల్లా మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మంత్రి సీతక్కకు పలు సమస్యలను విన్నవించారు. వారు మాట్లాడుతూ, ప్రస్తుతం రబీ సీజన్లో సేకరించే ధాన్యం ఎక్కువ తేమ శాతం లేకపోవడంతో, వర్షాభావ కారణంగా అవి రా రైస్ గా మారిస్తే నూక శాతం ఎక్కువగా వస్తుందని తద్వారా అవి తినేందుకు పనికి రాకుండా పోతాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తూ అదేవిధంగా రైస్ మిల్లర్లు రబీ సీజన్లో సేకరించేదాన్ని బాయిల్ రైస్ గా మాత్రమే మార్చగలమని బాదం ప్రవీణ్ అన్నారు. అంతేకాకుండా, ధాన్యం రైస్ మిల్లర్లు సేకరణ చేపట్టాలంటే బాయిల్ బియ్యం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తేనే ధాన్యం సేకరణకు ముందుకు వస్తామని, లేని పక్షంలో రబీ సీజన్లో వచ్చేటువంటి ధాన్యాన్ని మిల్లర్లు సేకరించినట్లయితే ఆ ధాన్యాన్ని ఏం చేయాలో అర్థం కాక రైస్ మిల్లర్లు శాశ్వతంగా డీఫాల్టర్లుగా మారే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని రైస్ మిల్లర్ల యొక్క సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లాలో ఉన్న బాయిల్ రైస్ మిల్లులకు ఈ రబీ సీజన్లో సేకరించిన ధాన్యాన్ని అందించినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందని బాదం ప్రవీణ్ తెలిపారు. ధాన్యం కాటా 67 కిలోలు కాకుండా 64 కిలోలకు ప్రభుత్వా అవకాశం కల్పించాలన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

### రాజీవ్ యువ వికాస పథకం

## దరఖాస్తుల గడువు పొడిగింపు

### కమిషనర్ అమరేందర్ రెడ్డి



తుర్కయంజాల్, ఏప్రిల్ 2 (మనం న్యూస్): రాజీవ్ యువ వికాస పథకము ద్వార స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు గడువు ఏప్రిల్ 14వ తేదీ వరకు పొడిగించారని. తుర్కయంజాల మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ద్వార ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీలు,క్రిస్టియన్, ఎంబీసీ, ఈ బీసీ, కార్పోరేషన్, అండ్ ఫెడరేషన్స్ , అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 14 వతేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హతలు:వ్యవసాయ పథకాలకు 21-55 సంవత్సరాలు జూలై 1నాటికి వ్యవసాయ మరియు సంబంధిత రంగాలకు: 21 నుండి 60 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు.దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ , రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.2,00,000 మించకుండ ఉండాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత జారీ చేసిన కుల ధ్రువికరణ పత్రము కలిగి ఉండాలని,రవాణా పథకాలకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వ్యవసాయ పథకాలకు పట్టాదార్ పాస్ బుక్,దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం కలిగి ఉండాలని అన్నారు. మొత్తం లక్ష్యంలో మహిళలకు కనీసం 25 శాతం, అదేవిధంగా ఒంటరి వితంతువులు, వికలాంగులు కనీసం 5 శాతం అర్హులని తెలిపారు. తెలంగాణ ఉద్యమ వీరులు, ఎస్సీ ఉపవర్గ ఉద్యమాల్లో త్యాగం చేసిన వారి కుటుంబాలు, స్వయం ఉపాధిక లో నైపుణ్యం ఉన్నవారు. ఓబిఎంఎంఎస్ పోర్టల్లో నమోదు చేసుకొని అట్టి ఫారమ్ ను డౌన్లోడ్ చేసుకొని తెలుపబడిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మండల ప్రజా పరిషత్ కార్యాలయమునకు సమర్పించాలని, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు మున్సిపల్ కార్యాలయములో సమర్పించాలని తెలిపారు. ఒక కుటుంబానికి/రేషన్ కార్డు కి చెంది గత 5 సంవత్సరాల్లో ప్రభుత్వము నుండి లబ్ది (సబ్సిడీ) పొందిన వారు అనర్హులని తెలిపారు.ఆర్థికంగా సాధ్యమయ్యే స్వయం ఉపాధి కార్యకలాపాన్ని ఎంపిక చేసుకోవాలి మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు.

## రూ.151 చెల్లిస్తే భద్రాచల రాముల వారి కళ్యాణ తలంబ్రాలు ఇంటికి




రంగారెడ్డి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): రూ. 151 చెల్లిస్తే భద్రాచల రాముల వారి కళ్యాణ తలంబ్రాలు ఇంటికి పంపించే ఏర్పాట్లను టీజీ ఆర్టీసీ భక్తుల కోసం కల్పించింది. బుధవారం ఆర్కే పురం లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ రామభక్తుల కోసం రూ .151 చెల్లిస్తే మనం ఇచ్చిన చిరునామాకు భద్రాచల రాములవారి కల్యాణ తలంబ్రాలు ఇంటికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆలయ ప్రదాన అర్చకులు లక్ష్మణా చార్యులు, పూర్వ దేవాలయా చైర్మన్ జగిని రమేష్ గుప్తా, తలాటి రమేష్ నేత, జర్నలిస్ట్ నాయకుడు గుండ చంద్ర శేఖర్, ఆర్టీసీ సిబ్బంది బాలరాజు భక్తులు పాల్గొన్నారు.

## మానస లో ప్రపంచ అటిజం అవగాహన దినోత్సవం




రంగారెడ్డి, ఏప్రిల్ 2 (మనం న్యూస్): ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా 'ఆటిజం పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర, ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సెమినార్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి గా హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. ఎం. విజయ సారథి మాట్లాడుతూ శిశువులు సంపూర్ణ ఆరోగ్యంతో జన్మించాలంటే, గర్భస్థ సమయంలో మనఃస్థితి అలవాట్ల విషయంలో తల్లులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రామకృష్ణా మిషన్ వారు కాబోయే తల్లుల కోసం నిర్వహిస్తున్న ఆర్యజనని కార్యక్రమాన్ని కొనియాడారు. ఆటిజం ఉన్న పిల్లలను వికలాంగులుగా కాకుండా ప్రత్యేక అవసరాలు, ప్రత్యేక ప్రతిభలు కల పిల్లలుగా చూడాలన్నారు. సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. పావని కిరణ్మయి మాట్లాడుతూ శిశువుల రెండు మూడు నెలల వయస్సు ఉన్నప్పుడే వారు సరిగా నవ్వని పరిస్థితులలో ఆటిజం లక్షణాలు గుర్తించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానస సైకాలజీ డిపార్మెంట్ హెడ్ జకియా మస్రూర్, మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాలు అధ్యయన సంస్థ లో ఉపాధ్యాయులు, దివ్యాంగజన పిల్లల తల్లిదండ్రులు, థెరపిస్టులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పొడగింపు
- రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి



భువనగిరి, ఏప్రిల్ 2(మనం న్యూస్): రాజీవ్ యువ వికాస పథకం కింద దరఖాస్తు చేసుకునే తేదీని ఏప్రిల్ 14 వరకు పొడగించినందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. బుధవారం రోజు కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లాలోని అందరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవో లతో సమావేశము ఏర్పాటు చేసి రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయుటకు తగు సూచనలు జారీచేసినారు. నిరుద్యోగ ఎస్ సి, ఎస్ టి, బి సి, మైనారిటీ ,ఓ బి సి, ఈ బీసీ యువతకు అమలు పరుచబడు రాజీవ్ యువ వికాస్ పథకానికి మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ ప్రజా పాలన సేవా కేంద్రాలలో మాన్యువల్ గా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకుగాను ఏప్రిల్ 14 లోగా మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో మాన్యువల్ గా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద ఇప్పటి వరకు14,000 దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా స్వీకరించడం జరిగిందని తెలిపారు. కార్యాలయంలో ప్రత్యేకించి రాజీవ్ యువ వికాస పథకానికి సంబంధించి ప్రజాపాలన సేవా కేంద్రాన్ని, హెల్ప్ డిస్క్ ను ఏర్పాటు చేయాలన్నారు. మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించేందుకుగాను, అన్ని మండల ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు ఫారములను అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అన్ని దరఖాస్తుల ప్రింట్ కాపీలు తీసి ఉంచాలన్నారు. రాజీవ్ యువవికాసం కింద స్వయం ఉపాధి పొందేందుకు ఏప్రిల్ 14 లోగా దరఖాస్తు చేసుకునే విధంగా అన్ని గ్రామాలు, మండల, మున్సిపల్ కేంద్రాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు, అలాగే టామ్ టామ్ వేయించాలన్నారు. అధికారులందరు ఈ పథకంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అమలు చేయాలని, క్షేత్ర స్థాయి వరకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి పథకం విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. యువత వారి కాళ్లపై వారు నిలబడి స్వయం ఉపాధి పొందెందుకు ఇది చక్కటి అవకాశం అని తెలిపారు. మంజూరి అనంతరం లబ్దిదారులకు దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పనులు నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో వేగవంతంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, జిల్లా శిశు సంక్షేమ అధికారి నరసింహ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, హౌసింగ్ పి.డి విజయ సింగ్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీరాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కల్యాణోత్సవానికి ఆహ్వానం

లెక్చరర్స్ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమి సందర్భంగా జరిగే కళ్యాణోత్సవానికి హాజరు అవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ని దేవాలయ కమిటీ, లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు , కాలనీ సభ్యులు ఆహ్వానించడం జరిగింది.

- (రంగారెడ్డి మనం న్యూస్)



## ఒక పచ్చని చెట్టుండాలి

ఇంట్లో పచ్చని చెట్టుండాలి..
ఆకలి లేని ఆలోచనల ఫలాలనిచ్చి
ఋతువుల గమనాన్ని
సమయాన్ని గుర్తు చేస్తూ మన
బాధ్యతలకు అల్లారంలా..
ఇంట్లో ఒక పచ్చని చెట్టు ఉండాలి

అలసటలో అయోమయంలో
అసహనంలో నిశ్చల నిర్ణయాల గొడుగులా ...
అభివృద్ధి పథానికి ఆత్మబలాల
అభ్యుదయ అడుగులా...

ఒక పచ్చని చెట్టు ఉండాలి
సేదలనీడయ్యే వసంతాలు జోడయ్యే
మన ఇంట్లో ఒక పచ్చని చెట్టుండాలి.

ఎన్నో సుడిగాలులను వడగాలులను
వడగళ్లను కడగళ్ళను
తట్టుకొని నిట్టాడిగా నిలబడిన...
అనుభవాల మ్రాను ఒకటి కుర్చీలో బోసి
నవ్వులతో విరబూస్తూ... ఉండాలి
ఇంటింటా ఒక పచ్చని చెట్టు ఉండాలి

స్నేహాలు బంధాలు బంధువుల పోకడలను
ప్రోదిచేసి వడగట్టి మన జీవనసౌఖ్యానికి
వారధిగా నిలిచే ఎన్‌సైక్లోపీడియా లాంటి...
ప్రతి ఇంటా ఒక పచ్చని చెట్టు ఉండాలి

నెరసిన వయసులో..
వెలసిన రంగులో...
ముడతల తోలులో ఎన్ని సమస్యల
పరిష్కారాలున్నవో చేదుకో...

ఆ జ్ఞానవృక్షానికి కాసిన్ని
ఆత్మీయ మాటలు పోసి ఆ పెదాలపై కొన్ని
నవ్వులను చిలకరిస్తే..
వెన్నెల వసంతాలను కురిపించే ...
పచ్చని చెట్లు ప్రతి ఇంటా ఉండాలి

అలిసిన ఆ.. కాండము ఇంతకాలం
నిలబడిందంటే.. 'తోడు'గా దన్నుగా
మమతలసేవలై పాతుకు పోయిన 'తల్లి' వేర్లే...

లాలించే చేతులు వంగిన
వెన్నును దన్ను గా నిమరాలి...
తడబడే అడుగునకు ఆసరాగా
అనురాగాలను పరిస్తే...
తృప్తులను నరాల్లో పారించే
పచ్చని చెట్లు ప్రతి ఇంట్లో ఉండాలి

**- కొప్పోలు యాదయ్య**

# నిజాం నిరంకుశంపై నెత్తుటి చరిత్ర దొడ్డి కొమురయ్య



ఎండనక, వాననక కష్టించి సంపాదించిన సొమ్మును, ధాన్యాన్ని సంబంధం లేని వాడు హక్కుగా తీసుకుంటే ఆరుగారాలు శ్రమించిన వ్యక్తి పరిస్థితి ఎలా ఉంటుంది? భూమికి భుక్తికి దిక్కులేని రోజులు దశాబ్దాలుగా తెలంగాణ గడ్డపై ప్రజలు ఎదుర్కొన్న దుర్భరమైన రోజులు.. తల్లి అక్క చెల్లి అని తేడా లేకుండా మానప్రాణాలను హరించిన రోజులు.. అలాంటి రోజుల్లో భూమి కోసం భక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ఓ కుటుంబం ప్రాణాలర్పించింది. ఒకే కుటుంబంలో ముగ్గురు వీరమరణం పొందారు. ఆ కుటుంబమే దొడ్డి కొమరయ్య కుటుంబం. ఈరోజు ఆయన 98వ జయంతి సందర్భంగా ఆ మహావీరుని త్యాగాలను గురించి ఓసారి నెమరువేసుకుందాం. 1946 పూర్వం నల్లగొండ జిల్లా పరిధిలోని జనగామ ప్రాంతం అంతా అరవై కొమ్ముల, ఇరవై కోరల ఘోరక్రూర కర్కోటకుడు దేశముఖ్ విస్నూరు రామచంద్రారెడ్డి ఆగడాలతో అట్టుడుకింది. మెడలు వంచే పన్నులు, నడుములు వంచే వెట్టిచాకిరీ, నడ్డి విరిచే వడ్డీలు, చక్రవడ్డీల దోపిడీ కింద ప్రజలు ఈసూరుమన్నారు. ఏ ఊరు చూసినా ఏమున్నది గర్వకారణం? అంతా అరాచకమే. పేదలతో పరాచకమే. తాత ముత్తాతల కాలం నుంచి ఇదే వేదన. దొరల కాళ్ల దగ్గర ప్రజలు బానిసలుగా బతకాల్సిందే. ఎదురు తిరిగితే మరణమే. దేశముఖ్ దొరల ఆగడాలను ఎదిరించి బతికినవారే లేరు. దొర చెప్పిందే వేదం. దొర పలికిందే సత్యం. భూములన్నీ నిజాం ప్రభువులవే. దొరలు, జమీందార్లు పన్ను వసూలుదార్లే. పంటలో నాలుగో వంతు(చౌత్) వసూలు చేసే చౌదర్లు, సర్దేశ్ ముఖి (పంటలో పందో వంతు) వసూలు చేసే దేశ్‌ముఖ్‌లు నిజాంకు, రజాకార్లకు తొత్తులే. విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ కడవెండిని కేంద్రంగా చేసుకొని చుట్టు పక్కల గ్రామాల ప్రజలను హింసించేది. పేదల భూములను ఆక్రమించుకోవడం, కూలీలతో వెట్టిచాకిరి చేయించుకోవడం, ఎదురు తిరిగితే తుదముట్టించడం, మహిళలను అవమానించడం, పన్నుల పేరుతో దోచుకోవడం ఆమెకు నిత్యకృత్యం.

జానమ్మ ఆమె కొడుకు రామచంద్రారెడ్డి అరాచక పాలన నుంచి విముక్తి కోసం అణిచివేతకు గురైన వాళ్లంతా ఒక్కటయ్యారు. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం తిరుగుబాటు చేశారు. దొరల పెత్తనం సాగదని దిక్కులు పిక్కటిల్లేలా దిక్కులేని జనం నినదించారు. ఆ నినాదాల్లో నుంచి దిగంతాల దాకా మారుమోగిన గొంతే దొడ్డి కొమురయ్యది. జనమంతా విముక్తి కోసం పోరాడుతున్న క్రమంలో వేగుచుక్కలుగా దొడ్డి కొమురయ్య. ఆయన అన్న దొడ్డి మల్లయ్య నిలిచారు.ఈ దొడ్డి సోదరులు సాహసానికి మారు పేరుగా నిలిచి జట్టుకు నాయకత్వం వహించారు. గ్రామాల్లో సాగు భూములు, చెరువులు, బావులు అన్నీ దొరలవే. గ్రామం చుట్టూ ఉండే కంచెలు, పెరళ్లు అన్నీ దొరలవే. కదలడానికి, మెదలడానికి ప్రజలకు వీల్లేదు. దొరలకు, పటేలు, పట్వారీలకు, ఉద్యోగులకు రకరకాల వెట్టిచాకిరి చేయాలి. ఇది అన్ని కులాలకు వర్తిస్తుంది. చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, గొల్ల కురుమ, గౌండ్లు, ముదిరాజు, మాల మాదిగ, లంబాడ ఇలా అన్ని కులాలు వారి వారి వృత్తి ప్రకారం వెట్టి చేయాల్సిందే. ధనిక రైతులకు కూడా ఇది తప్పలేదు. ముందు దొరల భూములు సాగు చేసిన తర్వాతే స్వంత భూముల్లోకి వెళ్లాలి.

రకరకాల పన్నులతో పేద ప్రజలను పీడిస్తూ మరింత పేదలను చేసేవారు. కాన్పు అయితే పన్ను, సాన్పు సల్లితే పన్ను, నోరు మూసుకుంటే పన్ను, తెరిస్తే పన్ను, సముర్తాడితే పన్ను, పెండ్లికి పన్ను, తీర్థంబోతే పన్ను, రోలు పన్ను, రోకటిపన్ను, ఆఖరికి చస్తే కూడా పన్ను కట్టాల్సిందే. ఇట్లా పన్ను మీద పన్నుగా అనేక పన్నులను ప్రజల నుంచి జాగీర్దార్లు, దేశముఖులు, పెద్ద భూస్వాములు గుంజేవారు. పన్నులు లేదంటే తన్నులే. ఏదో నెపం పెట్టి ప్రజలను జలగల్లా పీల్చేవారు. దీనికి తోడు అడ్డూ అదుపూ లేకుండా వడ్డీలు, చక్రవడ్డీల దోపిడీ కొనసాగుతుండేది. ఈ పీడనకు వ్యతిరేకంగా పుట్టిందే ఆంధ్రమహాసభ. భువనగిరిలో 1943లో ఆంధ్రమహాసభ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో కడవెండిలో దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమురయ్య, నల్ల నర్సింహులు, దావిద్ రెడ్డి, వడ్డె నర్సయ్య లాంటి ఎందరో వీరులు చేయి చేయి కలిపారు. గుతుపల సంఘం ఏర్పాటు చేశారు. నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఊపిరి పోశారు.

కడవెండి పిలుపుతో గ్రామగ్రామాన గుతుపల సంఘాలు వెలిశాయి. వెట్టిచాకిరి, దోపిడీకి, నిర్బంధ వసూళ్లకు, అక్రమ బేదఖళ్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమైంది. జానకమ్మ దొరసాని దాష్టీకాలను అంతం చేసేందుకు పీడిత ప్రజలు



ఎర్రజెండా నీడలో ఏకమైనారు. ఆంధ్రమహాసభ స్ఫూర్తితో ఉద్యమ పాఠాలు నేర్చుకున్నారు, బరిసెలు చేతబట్టి దొరల గడీలను బద్దలు కొట్టారు. దొర ఆగడాలు చెల్లవంటూ విసూనూరు గడీపై దండయాత్ర చేశారు. దొర కిరాయి గూండాల దొంగచాటు దెబ్బకు పలువురు నేలకొరిగారు. అయినా ఎత్తిన జెండా, పట్టిన బరిసె దించలేదు. తల వంచలేదు. ఈ నేపథ్యంలోనే మొండ్రాయి గ్రామంలో లంబాడి రైతులు సాగు చేసుకుంటున్న భూమిని స్వాధీనం చేసుకోవడానికి నిజాం తొత్తులైన కటారి రామచందర్రావు సోదరులు రౌడీలతో దాడి చేశారు. ఆ దాడిని లంబాడీలంతా ఏకమై ప్రతిఘటించారు. గూండాలంతా ఒకవైపు నిల్చుంటే, లంబాడీ రైతులు కర్రలు, వడిసెలు, ఎర్రజెండాలు పట్టుకుని మరోవైపు నిలబడ్డారు. చివరికి పోలీసుల సహాయంతో భూమిని గుంజుకున్నారు. ఆ కొన్నాళ్లకే పాలకుర్తిలో మరో పోరాటం సాగింది.

అది 1946 జూలై 4. కడవెండిలో ఒక పెద్ద అలజడి. సంఘం నాయకుల ఇళ్లపై మద్యం మత్తులో గూండాలు రాళ్లు విసురుతూ రాక్షసంగా ప్రవర్తించారు. ఆగ్రహించిన ఆంధ్రమహాసభ కార్యకర్తలు విసునూరు కిరాయి మూకలపై తిరుగుబడ్డారు. బరిసెలు, గుతపలు అందుకుని దొరలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా కదిలారు.

దొడ్డి మల్లయ్య అప్పటికే సంఘంలో చురుకైన కార్యకర్త. అతని తమ్ముడు దొడ్డి కొమురయ్యకు జానమ్మ దొరసానిని చూస్తే రక్తం మరిగేది. జానమ్మ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమురయ్య ముందుండి గ్రామంలో ఊరేగింపు తీశారు. వారి నినాదాలు విని, జానమ్మ ఆమె గూండాల గుండెలు గుభేలుమన్నాయి. గడి నుంచి తన గుమాస్తా మిస్కిన్ అలీతో జానకమ్మ కాల్పులు జరిపించింది. ముందు వరుసలో ఉన్న దొడ్డి మల్లయ్య కాళ్ళకు తూటాలు తగిలి కూలబడ్డాడు. ఇది చూసి ఆగ్రహంతో ఊగిపోయిన కొమురయ్య గుతప తీసుకుని మిస్కిన్ మీదికి లంఘించాడు. మిస్కిన్ గూండాలు కాల్పుల్లో కొమురయ్య కడుపులో బుల్లెట్లు దిగాయి. పేగులు బయటకు వస్తుండగా ఎడమ చేతితో అదిమిపడుతూ ఆంధ్రమహసభకు జై అని కుడి చేతి పిడికిలి పైకెత్తి నినాదాలు చేస్తూ వీరుడు నేలకొరిగాడు. మరో బుల్లెట్ దొడ్డి మల్లయ్య మోకాలుకు తగిలి కింద పడిపోయారు. మంగలి కొండయ్య నుదుటికి దెబ్బ తగిలింది. అతని సోదరుడు నరసయ్య మోచెయ్యికి గాయం అయింది. దొడ్డి కుమురయ్య వీర మరణంతో ప్రజలు ఆగ్రహోదగ్రులయ్యారు. రక్తానికి రక్తం, ప్రాణానికి ప్రాణం అంటూ గడీని చుట్టుముట్టారు. అది చూసి పాకలో ఉన్న దొర గూండాలు కంపించిపోయారు. భయంతో గడీలోకి దూకారు. అప్పటికే ప్రజలంతా ఆ భవనాన్ని చుట్టుముట్టారు. కడవెండి ప్రజలకు తోడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జత కలిశారు. జమీందారు గడీకి నిప్పుబెట్టడానికి గడ్డిని పేర్చారు. మరికొంత మంది గుతపలు పట్టుకుని ఊరవతల కాపలా కాశారు. ధర్మపురం తండా నుంచి పెద్దసంఖ్యలో లంబాడా యోధులు ఊరేగింపుగా కడవెండి చేరుకున్నారు.

విసునూరు నుంచి రామచంద్రారెడ్డి కొడుకు బాబుదొర కత్తులు కటార్లు, తుపాకులతో రెండు వందల మంది గూండాలను వెంటేసుకొచ్చారు. గ్రామం వెలుపల కాపలా కాస్తున్న ప్రజలు మూకుమ్మడిగా వడిసెలతో రాళ్లు రువ్వారు. గ్రామం పొలిమేర నుంచే మూడు మైళ్లదూరం తరిమికొట్టారు. పాలకుర్తిలో సంఘం నాయకులను చిత్రహింసలు పెట్టిన అనుముల రామిరెడ్డిని దొరకబట్టి చితకదన్నారు. గూండాలపై చర్యలు తీసుకుంటామన్న పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేదు. ఏ కేసూ పెట్టలేదు. వారిని సురక్షితంగా తిరిగి జమీందారుకు అప్పగించారు. దొడ్డి కొమురయ్య భౌతికకాయానికి వేలాది ప్రజల ఊరేగింపు మధ్య అంత్యక్రియలు జరిపారు. ఆంధ్రమహాసభకు జై.. జోహార్లు దొడ్డి కొమురయ్య నినాదాలతో జనగామ తాలూకాలో ప్రతీగ్రామం మారుమోగింది. అమరవీరుడిపై పాటలు గట్టి ఊరూవాడా ఉద్యమం లేవదీశారు. కొమరయ్య అమరత్వం రైతాంగంలో నిద్రాణమైన ఆగ్రహాన్ని మేల్కొలిపింది. నల్లగొండ జిల్లా అన్ని తాలూకాల్లోనూ రైతాంగ ఉద్యమం దావానంలా వ్యాపించింది. గ్రామాల్లోని భూస్వాముల గడీల ముందు బహిరంగ సభలు జరిపారు. చివరికి దేశముఖ్ కూడా సంఘం ఉత్తర్వులు అమలు చేయవలసి వచ్చింది. లేదంటే సాంఘిక బహిష్కరణ చేసేవారు.

సంఘం నాయకులు, కార్యకర్తలు తమ చేతుల్లోని గుతపలను నేలపై బాదుతూ పెద్దపెట్టున నినాదాలు చేసేవారు. గుతపల సప్పుడుతో గ్రామం దద్దరిల్లేది. గుతపల సంఘం వచ్చిందంటేనే భూస్వాముల పంచెలు తడిసిపోయేవి. ఇండ్లల్లోకి దూరి గడియలు పెట్టుకునేవారు. విస్తృత ప్రజా ఉద్యమం వెల్లువతో నిర్బంధ ధాన్యం సేకరణ ఆగిపోయింది. వెట్టిచాకిరి దానంతట అదే అంతమయ్యింది. దేశముఖ్‌లు, జమీందార్లు, గ్రామాలు వదిలి వెళ్లాల్సి వచ్చింది. అయితే 1946లో దొడ్డి మల్లయ్యకు మొకాలిలో తూటా దూసుకెళ్లడంతో తీవ్ర గాయం కావడం, ఆ తర్వాత హాస్పిటల్లో చికిత్స జరిగింది. 1946 నుంచి తీవ్ర గాయాలు అనారోగ్యంతో బాధపడుతూ 1981లో దొడ్డి మల్లయ్య చనిపోయాడు. ఇక దొడ్డి మల్లయ్య కొడుకు దొడ్డి ఆగయ్యను 1947లో చింతచెట్టుకు కట్టేసి కాల్చారు, అలా ఒక్క కుటుంబం నుంచి ముగ్గురు సాయుధ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు కడవెండిలో మిగిలింది దొడ్డి బిక్షపతి కుటుంబం మాత్రమే.

నిజాం నిరంకుశ పాలన నుంచి పీడిత, తాడిత జనానికి విముక్తి కలిగించిన వీరులెందరో.. పోరాట క్రమంలో రజాకారులు, నిజాం పోలీసుల తూటాలకు బలై నేలకొరిగినా తెలంగాణా ప్రజల గుండెల్లో స్థూపాలుగా, దీపాలుగా చిరస్థాయిగా వెలుగుతూనే ఉన్నారు.

**- శ్రీనివాస్ గుండోజు**
9985188429

# ప్రపంచ దేశాలలో సమిష్టి డిమాండ్ ఎందుకు తగ్గుతోంది?




సాధారణంగా సమిష్టి డిమాండ్ (మొత్తం డిమాండ్) అంటే ఒక నిర్దిష్ట ధర వద్ద, ఒక నిర్దిష్ట కాలంలో వస్తువులు, సేవలకు మార్పిడి చేయబడిన మొత్తం ద్రవ్యంగా వ్యక్తీకరించబడుతుంది. మొత్తం డిమాండును సాధారణంగా వినియోగం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులు వంటి నాలుగు వనరుల మొత్తంగా వర్ణిస్తారు. ప్రపంచ సమిష్టి డిమాండ్ తగ్గడానికి దోహదపడే ప్రధాన అంశాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి వి ఉన్నాయి. ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, జీవన వ్యయ సంక్షోభం, ఇంధన ధరలు, వడ్డీ రేటు పెంపుదల, ప్రపంచ పరపతికరినత్వం, కోవిడ్ మహమ్మారి పరిణామాలు, లాజిస్టిక్స్ సవాళ్లు, ముడి పదార్థాల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, వాణిజ్య అనిశ్చితి మొదలైనవి మొత్తం డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. ఇవేకాక వినియోగదారుల విశ్వాసం తగ్గడం, రుణ స్థాయిలు పెరగడం, నిత్యావసర వస్తువులపై ఖర్చు తగ్గడం, ఉద్యోగ అభద్రత, వ్యాపార జాగ్రత్తలు, స్టాక్ మార్కెట్ అస్థిరత వంటి సెంటిమెంట్ కారకాలు, ఆటోమేషన్ డిజిటలైజేషన్ వంటి సాంకేతిక,వాతావరణ మార్పు వంటి పర్యావరణ అంశాలు సమిష్టి డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి.

సమిష్టి డిమాండ్ తగ్గడం వల్ల వాస్తవ స్థూల దేశీయోత్పత్తి, ఆర్థిక ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ప్రకారం 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచ వృద్ధి 3.3 శాతంగా అంచనా వేయబడింది, ఇది చారిత్రక (2000-19) సగటు 3.7 శాతం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మందగమనం ప్రపంచ డిమాండ్ బలహీనపడటానికి దోహదం చేస్తుంది. అమెరికా,యూరోపియన్ దేశాల నుండి చైనా, భారతదేశం బ్రెజిల్ వరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ద్రవ్యోల్బణం, వడ్డీ రేటు పెంపుదల, ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు,భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మిశ్రమం కారణంగా తగ్గుతున్న సమిష్టి డిమాండ్ సమస్యను ఎదుర్కొంటున్నాయి.

**దేశంలో తగ్గుతున్న మొత్తం డిమాండ్ ను ప్రభావితం చేసే అంశాలు**

అనేక ఇతర ఆర్థిక వ్యవస్థల మాదిరిగానే భారతదేశం కూడా తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా గణనీయంగా ప్రభావితమవుతుంది. భారతదేశంలో మొత్తం డిమాండ్ లో తగ్గుదల ప్రధానంగా తగ్గిన వినియోగం, తగ్గిన పెట్టుబడి, తగ్గుతున్న ప్రభుత్వ వ్యయం, బలహీనమైన నికర ఎగుమతుల నుండి వస్తుంది. ఏదేశమైనా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది, ఇది దాని స్థూల దేశీయోత్పత్తి లో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, డిమాండ్లో ఏదైనా మందగమనం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో భిన్నపరిణామా లను కలిగిస్తుంది. ఆర్థిక మాంద్యం, పేదరికం, అసమానత, రాజకీయ అస్థిరత, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంపై ప్రభావం, నిరర్థక ఆస్తులు వంటి విస్తృత ఆర్థిక పరిణామాల కారణంగా భారతదేశం తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈ ప్రభావాలు ఉపాధి నుండి



వ్యాపార పెట్టుబడి, ఎగుమతులు, ఆర్థిక ఆరోగ్యం వరకు వివిధ రంగాలలో అలలు రేపుతాయి.

భారతదేశంలో మొత్తం డిమాండును ప్రభావితం చేసే కీలక అంశాలు చూసినపుడు ద్రవ్యోల్బణ ఒత్తిడి ఫిబ్రవరి 2025లో 3.6%. ఇది కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, వినియోగాన్ని ప్రభావితం చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా వడ్డీ రేట్లను పెంచింది, ఇది ప్రైవేట్ పెట్టుబడి, వినియోగాన్ని తగ్గించవచ్చు, ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అమెరికా, చైనా మందగమనం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి వంటి ప్రపంచ అంశాలు భారతదేశ ఎగుమతులు, పెట్టుబడి రాకపోకలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ సంస్కరణలు వస్తువులు మరియు సేవల పన్ను, మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశీయ తయారీ, పెట్టుబడి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, వాటి పూర్తి ప్రభావాలు కార్యరూపం దాల్చడానికి సమయం పట్టవచ్చు.

డిసెంబర్ 2024లో, భారతదేశంలో ప్రైవేట్ వినియోగం స్థూల దేశీయోత్పత్తి లో 64.8% వాటాను కలిగి ఉంది. కోవిడ్ మహమ్మారి తర్వాత గ్రామీణ భారతదేశం గణనీయమైన కోలుకుంది, అయినప్పటికీ పట్టణ ప్రాంతాలు ఇప్పటికీ మొత్తం వినియోగంలో ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. అయితే, వ్యవసాయ ఇబ్బందులు, ఆదాయ అసమానత ఇతర నిర్మాణాత్మక సవాళ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి కొద్దిగా నెమ్మదిగా ఉంది. భారతదేశ రిటైల్ రంగం దేశ స్థూల దేశీయోత్పత్తికి దాదాపు 10% దోహదపడుతుంది వచ్చే దశాబ్దంలో దాదాపు 9-10% కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (ఇఅఎఖ) వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది, 2032 నాటికి దాదాపు 2 ట్రిలియన్ల విలువను చేరుకుంటుంది.భారతదేశ వినియోగదారుల విశ్వాసం హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు,అధిక ఇంధన ధరలు ఉపాధి ఆందోళనల కారణంగా 2024లో వినియోగదారుల ఆశావాదం తగ్గినట్లు నీల్సన్‌ఐక్యూ వినియోగదారుల విశ్వాస సూచిక చూపించింది.

సాంకేతికత, ఇ-కామర్స్ మరియు తయారీ వంటి రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవాహాలు బలంగా ఉన్నాయి. 2024లో, ఏప్రిల్-డిసెంబర్ కాలంలో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 27% పెరిగాయి. అయితే, అధిక నిష్క్రమణల కారణంగా నికర పెట్టుబడి తగ్గింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశ ప్రభుత్వ వ్యయం 48.21 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది, ఇది స్థూల దేశీయోత్పత్తి లో 19.4%.ఈ భాగాలలో ఏదైనా తగ్గుదల సమిష్టి డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది.

**సమిష్టి డిమాండ్ మెరుగుపరచడానికి చర్యలు**

ఒక దేశం యొక్క కేంద్ర బ్యాంకు నియంత్రణలో ఉన్న ద్రవ్య విధానం, రుణ వ్యయాలు, పెట్టుబడి, వినియోగదారుల ఖర్చులను ప్రభావితం చేయడం ద్వారా మొత్తం డిమాండ్ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణ కు అమెరికా లోని ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఉఇఆ) ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు వారి బెంచ్మార్క్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ గతంలో ప్రతికూల వడ్డీ రేట్లతో ప్రయోగాలు చేశాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ను ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి ప్రభుత్వాలు ఆర్థిక విధానాన్ని ఉపయోగించవచ్చు.

చైనా యొక్క బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, 2021 యొక్క అమెరికా ఇన్ఫ్రాస్ట్రక్చర్ బిల్లు వంటి పెద్ద-స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మొత్తం డిమాండ్ను పెంచే లక్ష్యంతో ఆర్థిక ఉద్దీపన ప్రకటించాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో అమెరికా నిరుద్యోగ భీమా ప్రయోజనాలు, అలాగే స్పెయిన్, ఫిన్లాండ్ వంటి దేశాలలో యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ చర్చలు ఇందుకు ఉదాహరణలు. ఇటీవల, చైనా యొక్క భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మొత్తం డిమాండును పెంచడానికి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడానికి ఒక ఉదాహరణ.

భారత ప్రభుత్వం మరియు భారత రిజర్వ్ బ్యాంక్ రెండూ భారతదేశంలో సమిష్టి డిమాండ్ను పెంచడానికి చర్యలు తీసుకోవాలి. నిర్దిష్ట ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ద్రవ్య, ఆర్థిక మరియు నిర్మాణాత్మక చర్యల కలయికను అమలు చేయాలి. వాణిజ్య సరళీకరణ, కరెన్సీ తరుగుదల, కార్పొరేట్ పన్ను రేట్లను తగ్గించడం వంటి సాధనాలు ఉన్నప్పటికీ నిర్మాణాత్మక సంస్కరణలు కార్మిక మార్కెట్ సర్దుబాట్లు, నియంత్రణ మార్పులు చాలా అవసరం. ప్రభుత్వం తన కొనుగోళ్లను పెంచి పన్నులను స్థిరంగా ఉంచితే, అది నేరుగా డిమాండ్ను పెంచుతుంది. ప్రభుత్వం పన్నులను తగ్గించినా లేదా బదిలీ చెల్లింపులను పెంచినా, గృహాల పునర్వినియోగపరచలేని ఆదాయం పెరుగుతుంది. వారు వినియోగంపై ఎక్కువ ఖర్చు చేస్తారు. ఈ వినియోగం పెరుగుదల సమిష్టి డిమాండ్ను పెంచుతుంది. ఈ ప్రభావాల తీవ్రత, సమిష్టి డిమాండ్ తగ్గుదల పరిమాణం విధాన రూపకర్తలు, ఇతర ఆర్థిక ఏజెంట్ల ప్రతిస్పందనలపై ఆధారపడి ఉంటుంది.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# ఐఐటీల్లో నియామకాలు తగ్గడం దేనికి సంకేతం!



భూటాన్, మాల్దీవ్స్ లాంటి సార్క్ దేశాలతో పోల్చితే భారత ప్రభుత్వం విద్యకు కేటాయిస్తున్న బడ్జెట్ చాలా తక్కువగా ఉందని ఇటీవల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన నివేదిక స్పష్టం చేస్తున్నది. దీనికి తోడుగా గత విద్యా సంవత్సరాలతో పోల్చితే 2023 - 24లో ఐఐటిలో బిటెక్ చేసిన విద్యార్థినీ విద్యార్థుల ప్రాంగణ నియామకాలు 10 శాతం వరకు తగ్గాయనే విషయాన్ని కూడా వెల్లడించడం విస్మయాన్ని కలిగిస్తున్నది. 2021-22లో భూటాన్‌లో విద్యకు 7.47 శాతం నిధులు, మాల్దీవుల్లో 4.67 శాతం కేటాయించగా భారత ప్రభుత్వ విద్య కేటాయింపులు 4.12 శాతం మాత్రమే. నూతన విద్య విధానం-2020 అమలు




సజావుగా, సత్ఫలితాల దిశగా పయనించడానికి కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందని కూడా సిఫార్సు చేయడం సముచితంగా ఉన్నది.

ఐఐఎం ప్రాంగణ నియామకాల్లో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ ప్రతిష్ఠాత్మక ఐఐటి, ఐఐఐటి సంస్థల్లో 2021 - 22తో పోల్చితే 2023-24లో ప్రాంగణ నియామకాలు 10 శాతం వరకు తగ్గాయని కమిటీ అధ్యయనంలో తేలింది. దేశవ్యాపంగా 23 ఐఐటీల్లో ఐఐటి-వారణాసి మినహా (2021-22లో 83.15 శాతం నుంచి 2023-24లో 88.04 శాతానికి పెరగడం గమనించారు) మిగిలిన 22 ఐఐటీల్లో బిటెక్ పూర్తి చేసిన యువత క్యాంపస్ ప్లేస్మెంట్లు తగ్గడం కొంత కలవరానికి కారణం అవుతున్నది. ఐఐటీ-మద్రాస్‌లో 2021-22లో 85.71 శాతం నుంచి 2023- 24లో 73.29 శాతానికి తగ్గడం గమనించారు. అదే విధంగా ఐఐటి-బాంబేలో 96.11 శాతం నుంచి 83.39 శాతానికి, ఐఐటి - కాన్పూర్లో 93.63 శాతం నుంచి 82.48 శాతానికి, ఐఐటి-ఢిల్లీలో 87.69 శాతం నుంచి 72.81 శాతానికి, ఐఐటి-గౌహతిలో 89.77 శాతం నుంచి 79.10 శాతానికి, ఐఐటి-రూర్కీలో 98.54 శాతం నుంచి 79.66 శాతానికి, ఐఐటీ - హైదరాబాద్లో 86.52 శాతం నుంచి 69.33 శాతానికి, ఐఐటి-ధార్వాడ్లో 90.20 శాతం నుంచి 65.56 శాతానికి, ఐఐటి-జమ్మూలో 92.08 శాతం నుంచి 70.25 శాతానికి ప్రాంగణ నియామకాలు తగ్గడం గమనించారు.


ఐఐటి, ఐఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రాంగణ నియామకాలు తగ్గడానికి యువత ఉన్నత విద్యకు మొగ్గు చూపడం, ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారడం, జాబ్ మార్కెట్లో వచ్చిన మార్పులు, ఆధునిక బోధనల్లో కొంత అలసత్వం లాంటివి ముఖ్య కారణాలుగా చెప్పబడ్డాయి. అదే విధంగా ఎంఎస్సీలు ప్రాంగణ నియామకాల్లో అందించే వార్షిక వేతనాలు లేదా ప్యాకేజీల్లో కోతలు కూడా గమనించబడినవి. ఆధునిక శాస్త్ర సాంకేతిక విద్యాబోధనల్లో మార్పులు రావాలని, అధ్యాపకులకు దశల వారీగా ఆధునిక టెక్నాలజీ రంగాల్లో శిక్షణలు ఇవ్వాలని, క్యాంపస్-పరిశ్రమల ధ్య అంతరాలను చెరిపి వేయాలని కూడా స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. ఎన్ఐటీల్లో వార్షిక వేతనాల ప్యాకేజీల సగటు కనిష్ఠంగా 5 లక్షల నుంచి అత్యధికంగా 15 లక్షల వరకు మాత్రమే అందించడం విచారకరం. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం-2020 అమలుకు సిద్ధంగా లేకపోవటంతో సర్వశిక్ష అభియాన్, పిఎం శ్రీ పథకాలకు దూరంగా ఉన్నాయనే కారణాలతో ఆయా రాష్ట్రాలకు విద్యా నిధుల విడుదలను ఆపి వేయడం జరిగిందని, ఇది మంచి పరిణామం కాదని కూడా కమిటీ అభిప్రాయపడింది. తమిళనాడుకు చెందిన దాదాపు 2,000 కోట్లు, కేరళకు చెందిన 1,000 కోట్లు, పశ్చిమ బెంగాల్కు చెందిన 860 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని తేలింది.

దేశం గర్వించదగిన అంతర్జాతీయ స్థాయి ఐఐటీల్లో సహితం ప్రాంగణ నియామకాలు తగ్గడం అనే అంశాన్ని తేలికగా తీసుకోకుండా సత్వరమే యువతలో అత్యాధునిక నైపుణ్యాల శిక్షణలు అమలు చేయడం మాత్రమే ఏకైక మార్గమని కమిటీ అభిప్రాయపడుతూ ఐఐటీలకు సూచనలు చేసింది. రానున్న రోజుల్లో ఐఐటీల్లో దాదాపు 100 శాతం వరకు ప్రాంగణ నియామకాలు సుసాధ్యం కావాలని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంతో పాటు ఐఐటీ యాజమాన్యాలు కూడా వడి వడిగా అడుగులు వేయాలని కోరుకుందాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## 'భూ'విలాపం

చెట్లను పీకుతున్నరు
రాళ్లను పాతుతున్నరు
మీ ఆలోచనలకు అగ్గిపుట్టా
వంపులు ఒడికలు పూడ్చి
వైనాల రోడ్లు ఏయవడితిరి
మీ జిత్తులమారి పనులకు జిట్టపుట్టా
పచ్చని పంట పొలాలు పాడుచేసి
పచ్చ నోట్ల కోసం ప్లాట్లు చేయబడితిరి
మీ హీనం చేతలు పాడుగాను
పశుపక్షాదులు తిరగకుండా
ఫ్రీకాస్ట్ లు, ఫెన్సింగ్ లు వేస్తుంటిరి
మీ స్వార్థము సర్వనాశనం గాను
ఆకలి తీర్చే అమ్మను చెరబట్టి
అభివృద్ధి అంటూ ఆగమైతుంటిరి



మీ పైస పిచ్చి పాడుగాను
బండి చెడగొట్టి బొంగరం చేస్తూ
బాగుపడుతున్నామని భ్రమపడవడితిరి
మీ సంబరం సొడుమన్నుగాను
ప్రకృతి ప్రకోపిస్తే పిడికెడు మెతుకులకు
పరాయి పంచన చేరాల్సివస్తది బిడ్డా
భవిష్యత్తును బలిపెట్టే
బతుకును కోరుకోకు కొడకా

**- డా. ఎడ్ల కల్లేశ్**
9866765126

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. - ఎడిటర్

## వైభవంగా శివపార్వతుల కల్యాణం



మెట్ పల్లి, ఏప్రిల్ (మనం న్యూస్)ః మెట్ పల్లి డివిజన్ మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో. బుధవారం శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ నిర్వహించిన. 41వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై స్వామి వారి కళ్యాణం జరిపించారు. అనంతరం మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మేడాలమ్మ, కేతమ్మ సహిత మల్లికార్జున ఆలయ. నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

## అంగన్వాడీ నమోదు శాతం పెంచాలి



రాయికల్, ఏప్రిల్ 2 (మనం న్యూస్)ః రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రం 5 లో సీడీపీవో మమత ఆధ్వర్యంలో రాయికల్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మమత మాట్లాడుతూ ఫ్రీ స్కూల్ నమోదు శాతం పెంచాలని, పిల్లల ఎదుగుదల ప్రతినెల పర్యవేక్షిస్తూ, తల్లులకు గృహ సందర్శన ద్వారా సలహాలు ,సూచనలు అందిస్తూ,తక్కువ బరువు ఉన్న పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలుపుతూ, అంగన్వాడి కేంద్రం నుండి అందించే సేవలు ప్రతి కుటుంబం అందుకోవాలని, ఎండాకాలం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాలని వారికి సరి అయిన పోషకాహారం అందించాలని తల్లులకు తెలపాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, రాయికల్ సెక్టర్ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## దేశాన్ని.. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



మంచిర్యాల, ఏప్రిల్ 2 ( మనం న్యూస్)ః ఏఐసీసీ పిలుపు మేరకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ల ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్షెట్టీపేట్, దండేపల్లి మండలాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేశారు . ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్, కార్యకర్తలు, మండలాల కోఆర్డినేటర్లు , మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం

- **చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



మల్యాల, ఏప్రిల్ 2 (మనం న్యూస్)ః తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం మల్యాల మండలంలో నూక పెల్లి గ్రామంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం మహత్తరమైన పథాకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. రాష్ట్రంలో దారిద్య రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని, ఈ పథకం పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అర్హులైన పేద ప్రజలందరికి రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని, దీంతో లబ్ధిదారులకు సుమారు నెలకు 15 వందల రూపాయల వరకు ఆదా అవుతుందని అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలాంటి ఆలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. అనంతరం పార్టీ నాయకుని ఇంట్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు శనగరపు తిరుపతి, మండల యూత్ ఉపాధ్యక్షుడు నాగుల పేట సంజీవ్, కొండబత్తిని అనిల్ కుమార్, మిస్త్రీ శీను, మ్యా క లక్ష్మణ్, జలంధర్ , మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మంగపేట గ్రామంలో..

గంగాధర, ఏప్రిల్ 2(మనం న్యూస్)ః గంగాధర మండలం మంగపేట గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత సన్న బియ్యం పథకం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి ఆర్డిఓ మహేశ్వర్, ఎమ్మార్వో అనుపమ రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా చేసిందని, మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ జరుగిందన్నారు. ప్రతి లబ్ధిదారుడు రేషన్



షాపుల్లో సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ నర్సింగరావు, డిటిసిఎస్ ఉషారాణి, కాంగ్రెస్ పార్టీ గంగాధర మండల శాఖ అధ్యక్షులు పురుమల్ల మనోహర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, కురిక్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వెలిచాల తిరుమల్ రావు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట సంధ్యారాణి కరుణాకర్, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, తాజా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, చౌక ధరల దుకాణం రాష్ట్ర కార్యదర్శి మామిడి అశోక్, మండల శాఖ అధ్యక్షుడు తాళ్ల నరేష్, మంగపేట రేషన్ డీలర్ గాలిపెల్లి రాజమణి - నర్సయ్యతో పాటు మండలంలోని రేషన్ డీలర్లు, దోమకొండ మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలి

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



జగిత్యాల, ఏప్రిల్ 2(మనంప్రతినిధి)ః రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో బుధవారం మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు దేశంలోని గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించి, ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో యూపీఏ హయాంలో చైర్పర్సన్ సోనియా గాంధీ నేతృత్వంలో ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రవేశపెట్టారన్నారువ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యత గా భావించి..యూపీఏ పాలనలో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకు వచ్చారన్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా పని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఉపాధి హామీ చట్టం, ఉపాధి పని దినాలు 100 రోజుల నుండి 150 పని దినాలకు పెంచాలని, రోజు వారి కూలీ రేటు 400 లకు పెంచాలని సోనియా గాంధీ కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిరుపేదలకు వరంగా మారిందన్నారు. కుల, మతాలకు అతీతంగా పని అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడమేగాకుండా, యూపీఏ పాలనలో ప్రాధాన్యత పథకంగా పరిగణించి, నిధులు కేటాయించారన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఉపాధి కూలీలకు రోజు వారు కూలీ రూ.400 చెల్లిస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రూ.300 చెల్లిస్తున్నారన్నారు. ఉపాధి హామీ కూలీలకు చెల్లిస్తున్న రోజు వారి కూలీ రేటు రూ.300లను ఈ ఏడాది నుండి మరో రూ.7లు పెంచి, రూ.307 చెల్లిస్తున్నప్పటికీ కూలీలకు గిట్టుబాటు కావడం లేదన్నారు. గతంలో ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యం మార్చి లో 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం చెల్లించారన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలీ రేటు రూ. 400 లకు పెంచడంతో పాటు ఎండ తీవ్రత దృష్ట్యా వేసవి భత్యం ఏప్రిల్, మే మాసాలకు గాను 30శాతం అదనంగా కల్పించుటకు కేంద్రానికి నివేదించాలని సీఎం కు విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ కులీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్రం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నెలకు రూ.1000 చొప్పున సంవత్సరానికి రూ.12000 చెల్లిస్తున్నదన్నారు. వ్యవసాయ పోలాలకు సాగు నీరు అందించే ఎస్సారెస్పీ కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి, మట్టి, చెత్త చెదారం పేరుకుపోవడంతో ఉపాధి హామీ పనుల్లో భాగంగా కాలువల మరమత్తుకు నిర్మాణాత్మక కార్యాచరణ రూపొందించి, వేసవిలో పనులు చేపట్టాలన్నారు కాలువ మరమత్తులు చేపట్టక పోవడంతో చివరి పొలాలకు నీరు అందక రైతులు విద్యుత్ అధికంగా వినియోగి స్తున్నారన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాలువల పూడిక తీసేందుకు ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టాలని కోరుతున్నారు. వ్యవసాయ కూలీల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం నా బాధ్యతగా భావించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి లేఖ రాస్తున్నాను అన్నారు. రాష్ట్రంలో నీటి సంఘాల అవశ్యకత ఉన్నది..ప్రభుత్వ ఆలోచన కూడా చేస్తున్నది. ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యం కల్పించేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కోరారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాల్పుల విరమణ ప్రకటించి

# శాంతి చర్చలు జరుపండి

**సీపీఐ మావోయిస్ట్ అధికార ప్రతినిధి అభయ్**

జగిత్యాల, ఏప్రిల్ 2 (మనం ప్రతినిధి) మధ్యభారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, భారత ప్రభుత్వం- సీపీఐ (మావోయిస్టు) బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని ' అనే అంశంపై మార్చి 24న హైదరాబాద్లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందని నేటి స్థితిలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, అది శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నాట్లు మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా, శాంతి చర్చల పట్ల మావోయిస్ట్ పార్టీ వైఖరిని తెలిపారు. 2024 జనవరిలో, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ కేంద్ర ప్రభుత్వం, విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కగార్ పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రతిఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయని,. ఆ సమయంలో ప్రజల్ని మోసగించడానికి ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి/హోంమంత్రి విజయ్ శర్మ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి సిద్ధమే, మావోయిస్టులు చర్చలకురావాలి' అని పదే పదే ప్రకటనలు చేసారని పేర్కొన్నారు. ఆ సందర్భంగా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ వికల్ప్ రెండు సార్లు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమేనని తెలియజేసారని,శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం, 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్ లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును నిలిపివేయాలని కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేసారని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటా, ముఖ్యంగా ఛత్తీస్ గఢ్ లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయని ఆరోపించారు.ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైబడిన సంఖ్యలో పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లను, సభ్యులను, సాధారణ ఆదివాసీ ప్రజానీకాన్ని హత్య చేసాయని ఆరోపించారు. ఇందులో 1/3 సంఖ్యలో సాధారణ ఆదివాసీ ప్రజలు హత్య చేయబడ్డారని,విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైళ్ల పాలు చేస్తున్నారని ఆరోపించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారమే సాధారణ ప్రజానీకాన్ని హత్య చేస్తున్నాయని, చుట్టివేసి చంపివేసే (కార్డన్ అండ్ కిల్) ఆపరేషన్లలో చిక్కుకుంటున్న మా పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు చెందిన నిరాయుధ సభ్యులను, గాయపడి శత్రు సాయుధ బలగాలకు చిక్కిన సభ్యులను అమానవీయ చిత్రహింసలకు గురిచేసి హత్య చేస్తున్నాయని, మహిళా కామ్రేడ్స్ ను సామూహిక అత్యాచారాలు చేసి హత్య చేస్తున్నాయని,అందుకే ఈ యుద్ధాన్ని సరసంహారం (జీనోసైడ్) అంటున్నామని పేర్కొన్నారు.

# పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ**

మంచిర్యాల, ఏప్రిల్ 2( మనం న్యూస్)ః రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో 51 మంది కానిస్టేబుళ్ళకు హెడ్ కానిస్టేబుల్ లుగా పదోన్నతి పొందిన అధికారులకు బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోరే ఝూ కమీషనర్ కార్యాలయంలో అభినందింఛి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నం ను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణా యుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని, ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, క్రమశిక్షణతో విధులు నిర్వహించారో, అదేవిధంగా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటామని, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎఓ శ్రీనివాస్ , ఆర్ ఐ శ్రీనివాస్, సూపరిండెంట్ లు సందీప్ ,మనోజ్ కుమార్ ,సిసి హరీష్ పాల్గొన్నారు.



# చట్ట విరుద్ధంగా పనిచేస్తే ఉపేక్షించేది లేదు

- **రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**
- **మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం**

మంచిర్యాల, ఏప్రిల్ 2 (మనం న్యూస్)ః చట్ట విరుద్ధంగా ఎవరు పనిచేసిన ఎవరిని వదిలి పెట్టేది, ఉపేక్షించేది లేదని,అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారిని తప్పకుండా జైలుకు పంపిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిలక్ నగర్లో పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పాల్గొన్నారు. సీపీ కాలనీ ప్రజలతో మాట్లాడి ఈ ప్రాంతంలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.ఏదైనా సమస్య విషయం లో డయల్ 100 కాల్ కు కాని,స్థానిక పోలీసు వారికి సమస్య తెలిపినప్పుడు, సమా చారం అందించినప్పుడు మంచిర్యాల పట్టణ పోలీసులు ఎలా ప్రతిస్పంది స్తున్నారని, భద్రత పరమైన విషయాలపై, పోలీసుల పనితీరుపై అక్కడి వారిని అడిగి తెలుసు కున్నారు. ఈ ప్రాంతంలోని రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీట్స్ లకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి ప్రస్తుత పరిస్థితి, జీవన విధానం ను అడిగి తెలుసుకుని ప్రజా జీవనానికి భంగం



కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా పై నిఘా, నియంత్రణలో భాగంగా తిలక్ నగర్ లోని అనుమానస్పద ప్రాంతాలను మరియు ఇండ్లను,ఇంటి పరిసరాలను నార్కోటిక్ డాగ్తో తనిఖీలు నిర్వహించారు. అలాగే వాహనాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా జీవించే ప్రజలకు పోలీస్ ఎప్పుడు అందు బాటులో ఉంటుంది. వారికీ సహాయ సహకారం అందిస్తామని, అండగా ఉంటామ న్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపీఎస్ మంచిర్యాల ఏ సి పి ఆర్ ప్రకాష్ మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్, మంచిర్యాల రూరల్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఐఎల్ చైర్మన్‌కు వినతి

మంచిర్యాల, ఏప్రిల్ 2(మనం న్యూస్)ః కోల్కతాలోని కోల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంఛి ఒక ప్రతినిధి బృందం బుధవారం కోల్కతాలోని కోల్ భవన్లోని సిఐఎల్ ఉన్నత కార్యాలయంలో సిఐఎల్ ఛైర్మన్ను కలిసి వినతి పత్రం ఇచ్చారు . బొగ్గు గని రిటైర్ ఉద్యోగులకు పెన్షన్ పెంపుదల, మెడికేర్ స్కీమ్ జీవిత కాల పరిమితి పెంపుదల వంటి తమమండుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని చైర్మన్ ను కోరారు .తాము సమర్పించిన మెమోరాండంలో పేర్కొన్న అంశాలు, ఇతర సంబంధిత అంశాలను చర్చించారని, సానుభూతితో పరిశీలిస్తామని సిఐఎల్ ఛైర్మన్,హామీ ఇచ్చారని, కోల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రబీర్ కె.ముఖర్జీ తెలిపారు.



# రామగుండంలో పోలీస్ యాక్ట్ అమలు

- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**

మంచిర్యాల,ఏప్రిల్ 2( మనం న్యూస్)ః సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని, మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమిౌచొాదని, మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయంతీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 1,ఏప్రిల్ ,2025 నుంఛి 1,మే,2025 వరకు కొనసాగు తాయని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందన్నారు. భారతియ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.



### డీజే,డ్రోన్ లపై నిషేధాజ్ఞలు పొడగింపు

చిన్నపిల్లలు వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ లతో కూడిన డిజె సౌండ్ వినియోగం పై రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించామని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని సిపీ అన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ల్ వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి ల అనుమతి పొందాలని, ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో ఉన్నాయని, ఈ నిషేధాజ్ఞలు 1,ఏప్రిల్,2025 నుంఛి 1,మే,2025 వరకు కొనసాగుతాయని, పరిస్థితుల ప్రభావం ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ల పరిధిలో రామగుండం పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (ఏ )నుండి ( ఎఫ్ ) మరియు 22 (2) (ఎ ) అండ్ ( బి ), అండ్ 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 నెం. 9 ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం ఈ నెల 1 న ఉదయం 6 నుంఛి 1,మే,2025 ఉదయం 6 గంటల వరకు ఆమలులో వుంటుందన్నారు రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపిన కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాల యాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## బెట్టింగులకు పాల్పడి నష్టపోవద్దు

### సైబర్ క్రైమ్ ఏసిపి శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 02, మనం న్యూస్: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట సైబర్ క్రైమ్ ఏసిపి శ్రీనివాస్ అన్నారు. సైబర్ జాగృక్ దివస్ సందర్భంగా సైబర్ నేరాలపై ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్లైన్ బెట్టింగ్ తదితర అంశాల గురించి అగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐపిఎల్ టికెట్ స్కామ్ లు, బెట్టింగ్ యాప్ లు, డిజిటల్ అరెస్ట్ వంటి వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని తెలియజేశారు. వ్యక్తిగత సమాచారం అపరిచిత వ్యక్తులకు ఇవ్వవద్దని సూచించారు. సోషల్ మీడియాకు వీలైనంత వరకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ షాబా, వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ వాసుదేవరావు, షీ టీమ్ సిబ్బంది లక్ష్మీనారాయణ, ప్రవీణ్, మమత తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట కమ్యూనికేషన్ ఇన్ స్పెక్టర్‌గా శ్యామ్ సుందర్



సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 02, మనం న్యూస్: సిద్దిపేట కమిషనరేట్ కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా జె. శ్యాంసుందర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బుధవారం రోజున సిద్దిపేట కమిషనరేట్ కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన జె. శ్యాంసుందర్ సీ.పీ. డా.బి. అనురాధను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీ.పీ. ఆయనను అభినందించి కమిషనరేట్ పరిధిలో కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని సూచించారు. నిరంతరం అందుబాటులో ఉండి పోలీస్ శాఖకు సేవలందించాలని అన్నారు.

## ఎన్.ఇ. స్కీంలో చేరడానికి మరికొన్నిరోజుల అవకాశం

### దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 15

మంచిర్యాల, ఏప్రిల్ 2( మనం న్యూస్)ః సింగరేణిలో పదవి విరమణ చేసిన మాజీ కార్మికులు మెడికల్ కార్డు ద్వారా వైద్య సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకునే మొన్నటి 31,మార్చి తో ముగిసింది . అయితే సభ్యులుగా చేరడానికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కలిపిస్తూ దరఖాస్తు చేసుకునే తేదీని సింగరేణి యాజమాన్యం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది . వివరాల ప్రకారం సింగరేణి మాజీ కార్మికులు వైద్య సౌకర్యం కోసం మెడి కేర్ స్కీం లో ( సిపిఆర్ఎంఎస్ ) లో సభ్యులుగా చేరి మెడికల్ కార్డు పొందటానికి సింగరేణి యాజమాన్యం తేదీన పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్ ఉద్యోగులు , భర్తలు స్కీం లో సభ్యులు కావడానికి మరొక సారి చివరి తేదీని ఏప్రిల్ 15 వరకు ప్రకటించడం జరిగిందని సింగరేణి జనరల్ మేనేజర్( పర్సనల్) అండ్ ఐఆర్ అండ్ పీఎం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ స్కీములో చేరడానికి మాజీ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి నుంచి మౌఖిక ప్రాతినిధ్యాల స్వీకరించబడుతున్నాయని, ఎక్కువమందికి అవకాశం కల్పించడానికి ఈ తేదీని మరొకసారి పొడిగించడం జరిగిందని జనరల్ మేనేజర్ (పర్సనల్) పేర్కొన్నారు. ఈ స్కీం లో సభ్యులు గా చేరడానికి 60 వేల రూపాయలు డిపాజిట్ కింద చెల్లించవలసి ఉంటుంది . స్కీం లో సభ్యులు అయిన వారికి రిటైర్మెంట్ కార్మికునికి ,అయన భార్యకు కలిపి 8 లక్షల వరకు ఈ మెడికల్ కార్డు ద్వారా వైద్య సౌకర్యం పొందవచ్చు .అలాగే తెలంగాణా రాష్ట్రము కూడా మెడికల్ కార్డు ద్వారా వైద్య సౌకర్యం కు ఉన్న 8 లక్షల పరిమితిని 10 లక్షలకు పెంచారు . అయితే ప్రభుత్వం ఇంత వరకు జి.ఓ ను విడుదల చేయలేదు .ప్రభుత్వ జి.ఓ . వస్తే మెడికల్ కార్డు ద్వారా వైద్య సౌకర్యం 10 లక్షల వరకు పెరుగుతుంది .

## సిద్దిపేట జిల్లా మిషన్ భగీరథ ఎస్.ఈ.గా వెంకట్ రెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 02, మనం న్యూస్ ప్రతినిధి: సిద్దిపేట జిల్లా నూతన మిషన్ భగీరథ సూపరిండెంట్ ఇంజినీర్ (ఎస్ ఈ) గా పి. వెంకట్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరిని బుధవారం మర్యాద పూర్వకంగా కలసీ మొక్కను అందజేశారు. ఈ ఈ సందర్భంగా వేసవి కాలంలో ఎక్కడా కూడా ప్రజలకు తాగు నీటి సమస్యలు తలెత్తకుండా పని చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఈ.కి సూచించారు. గతంలో మహబూబ్ నగర్ జిల్లా గ్రిడ్ ఈఈగా విధులు నిర్వహించి పదోన్నతి పొంది జిల్లాకు వెంకట్రెడ్డి విచ్చేశారు. ఎస్ఈ గా పనిచేసిన శ్రీనివాస్ చారి పదవి విరమణ పొందారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- 7న జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా
- రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు రాంలింగారెడ్డి




సిద్దిపేట, ఏప్రిల్ 02, మనం న్యూస్ ప్రతినిధి: అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మారెడ్డి రాంలింగారెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను రుణమాఫీ చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటికీ దాన్ని పూర్తిగా అమలు చేయకుండా ఆచరణలో విఫలమైందన్నారు. రైతు భరోసా కోసం రైతులు వేల కళ్లతో ఎదురు చూస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వానికి కనబడడం లేదన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఈనెల 7వ తేదీన జిల్లా కలెక్టరేట్ ముందు జిల్లా రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అయిలేని మల్లికార్జున రెడ్డి, నాయకులు సామల రాజేశం, మోతుకుల లక్ష్మణ్, యాదం రావు, తిరుపతి రెడ్డి, కొలనుపాక భూపతి రెడ్డి, పోతుగంటి వెంకట్, రాంరెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

### జిల్లా అదనపు(రెవెన్యు) కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి



మహబూబాబాద్, ఏప్రిల్ 2( మనం న్యూస్)ః తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి. జిల్లాలో ఈనెల 20-04-2025 నుండి 26-04-2025 తారీకు వరకు జరిగే థియరీ, అదేవిధంగా 26-04-2025 నుండి 03-05-2025 వరకు జరిగే ప్రాక్టికల్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యు అడిషనల్ కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారీ అన్నారు. బుధవారం ఐ.డి.ఓ.సి మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జరిగిన లైన్ డిపార్ట్మెంట్ అధికారుల సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలో ఓపెన్ ఎస్ఎస్సి పరీక్షల సెంటర్లు 1)ప్రభుత్వ ఉన్నత పాఠశాల. 2)జడ్పీహెచ్ఎస్ జమాండ్లపల్లి మరియు 3) తొర్రూరు పట్టణంలో జెడ్పిహెచ్ఎస్ తొర్రూర్ ఓపెన్ ఎస్ఎస్సి పరీక్షలు నిర్వహించబడునని అలాగే ఇంటర్మీడియట్ కు సంబంధించి మహబూబాబాద్ పట్టణంలో 1) టి ఎస్ ఎం ఎస్ అనంతారము నందు 2) జెడ్పిహెచ్ఎస్ ఉన్నత బాలికల పాఠశాల మహబూబాబాద్ 3) తొర్రూరు పట్టణంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ తొర్రూరు నందు పరీక్షలు నిర్వహించబడునని అన్నారు. ఈ పరీక్షా కేంద్రాలలో విద్యుత్, మంచినీటి సౌకర్యం ,సెంటర్ల విద్యార్థులకు అందుబాటులో ఆర్ టిసి బస్సులను. పరీక్షా సమయాల్లో కరెంటు నిరంతరాయంగా సరఫరా ఏర్పాట్లు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టి పరిక్షలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. పరిక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పరీక్షా సెంటర్లోకి సెల్ ఫోన్ గాని ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెస్ గాని అనుమతించకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రాతా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. సెంటర్లలో హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు తమ సిబ్బందితో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి మదార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ శివ ప్రసాద్, పోలీస్, పోస్టల్, విద్యుత్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలు



కొమురవెల్లి, ఏప్రిల్ 2, మనం న్యూస్ః మండల కేంద్రంలోని నూతన కమిటీ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజు గౌడ్ తో పాటు పలువురు గౌడ సంఘ సభ్యులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి రాజు గౌడ్ మాట్లాడుతూ 16వ శతాబ్దం నాటి బహుబలి విప్లవ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, సామాజిక హక్కుల కోసం పోరాడిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కే దక్కుతుందని అన్నారు. 400 వందల ఏళ్ళు దాటిన ఆయన పేరు తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని తెలంగాణ బహుజన ఆత్మగౌరవాన్ని ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని అన్నారు. పాపన్న ఆశయాలు కొనసాగిస్తూ గౌడ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు గౌడ్, గౌరవ అధ్యక్షులు బత్తిని యాదగిరి గౌడ్, దొడ్ల విష్ణుమూర్తి గౌడ్, ఉపాధ్యక్షులు ముత్యం, పరశురాములు గౌడ్, ప్రధాన కార్యదర్శి శివలింగు రమేష్ గౌడ్, ఇంచార్జ్ కోశాధికారి బత్తిని నర్సింలు గౌడ్, మండల యూత్ అధ్యక్షులు కొయ్యడ నరేష్ గౌడ్ దొడ్లే స్వామి గౌడ్ మండల ఉపాధ్యక్షులు తాళ్లపల్లి వెంకట్ గౌడ్, కోశాధికారి జనగాం శ్రీకాంత్ గౌడ్ బొంగోని నర్సింలు గౌడ్ ముత్యం కరుణాకర్ గౌడ్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ముత్యం వెంకటేష్ గౌడ్ దొమ్మట రమేష్ గౌడ్ బాలర్స్ గౌడ్ ముత్యం శేఖర్ గౌడ్, మంతపురి చంద్రం గౌడ్ బాలరాజ్ గౌడ్ ముత్యం స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 02, మనం న్యూస్: రజాకార్లను ఎదురించి విజయం సాధించిన సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగిద్దామని సిద్దిపేట మున్సిపల్ ఛైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు అన్నారు. సిద్దిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతిని పాపన్న చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి మున్సిపల్ ఛైర్మన్ మంజుల రాజనర్సు పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడుతూ పాపన్న గౌడ్ వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వం, అధికారులు నిర్వహించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని అందంగా అలంకరించి విగ్రహం వద్ద కార్యక్రమాన్ని చేపడితే ఇప్పటి ప్రభుత్వం పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని కేవలం కార్యాలయానికే పరిమితం చేసి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఎలాంటి కార్యక్రమాన్ని చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా పాపన్న సేవలను వారు కొనియాడారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. తెలంగాణలో మొగల్ సైన్యాన్ని, రజాకార్లను ఎదురించి గోల్కొండ కోటను ఏలిన స్వయం పాలకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనగోని వినోద్, వడ్లకొండ సాయి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లాల్, నేతలు మార్క శ్రీనివాస్, పల్లె సునీల్, గాదగోని సత్యం, పల్లె చంద్రశేఖర్, అన్నగోని నారాయణ, గుండు శ్రీను, గుర్రం బాల్ రాజు, ముంద్రాతి రాజు, బాలగోని నర్సింలు, గాదగోని రాజేశం, పుల్లూరి సత్యం, పల్లె హరి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్ సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి

- కేంద్ర మంత్రి కుమారస్వామికి ఎంపీలు రవిచంద్ర, సురేష్ రెడ్డి, దీవకొండ విజ్ఞప్తి



వరంగల్, ఏప్రిల్ 2(మనంబ్యూరో)ః బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర,విప్ దీవకొండ దామోదర్ రావు,మాజీ మంత్రులు జోగు రామన్న, శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ప్రముఖులు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామితో భేటీ అయ్యారు. మంత్రి ఛాంబర్ లో బీఆర్ఎస్ ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావుల నాయకత్వాన మాజీ మంత్రి రామన్న ఆదిలాబాద్ వద్ద నెలకొన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ప్లాంటును తిరిగి తెరిపించాల్సిన అవసరం గురించి వివరించారు.బాగా వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసేందుకు గాను అప్పటి కేంద్ర ప్రభుత్వం సీసీఐను నెలకొల్పిందని చెప్పారు. కొన్నేళ్లుగా ఈ కర్మాగారాన్ని మూసివేయడంతో వందలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడంతో వారి కుటుంబాలతో పాటు వేలాది మంది ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావులు మంత్రి కుమారస్వామి దృష్టికి తెచ్చారు.సీసీఐ ప్లాంటును పునరుద్ధరించా ల్సిందిగా డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి రామన్న ఆధ్వర్యాన ఢిల్లీకి వచ్చిన వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు ఆదిలాబాద్ లో కొనసాగుతున్న నిరసన కార్యక్రమాల గురించి కేంద్ర మంత్రికి వివరించారు.ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర దామోదర్ రావు, మాజీ మంత్రులు రామన్న, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ శ్రవణ్ కుమార్, నాయకులు అందజేసిన వినతిపత్రాన్ని సావధానంగా చదివిన మంత్రి కుమారస్వామి ప్రభుత్వం తప్పక పరిశీలిస్తుందని హామీనిచ్చారు.మంత్రి కుమారస్వామిని కలిసిన వారిలో బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,తుంగబాలు తదితరులు ఉన్నారు.

## మహనీయుల చరిత్రలను భావితరాలకు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, ఏప్రిల్ 2(మనంప్రతినిధి)ః బహుజనుల రాజ్యాధికారం కొరకు పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, మహనీయుల చరిత్రలను భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం, జిల్లా అధికారులతో హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బానిస ప్రజల సంక్షేమం కోసం, రాజ్యాధికారం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహానుభావుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, సాంఘిక సంక్షేమశాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలి

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి



తొగుట, ఏప్రిల్ 02, మనం న్యూస్: నేడు తొగుట మండల కేంద్రంలో ప్రారంభం కానున్న జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఉదయం 8 గంటలకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా దుబ్బాక నియోజకవర్గాలోని తొగుట మండల కేంద్రం నుండి కానుగల్ గ్రామం వరకు పాదయాత్ర చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని, మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, జిల్లా, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్, పార్టీకి సంబంధించిన అన్ని అనుభంద సంఘాల నాయకులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

## నిరుపేదలందరూ సన్నబియ్యం తినాలి




దౌల్తాబాద్, ఏప్రిల్ 02, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నిరుపేదలందరూ సన్న బియ్యం తినాలనే గొప్ప ఆలోచనతో రాష్ట్రమంతా సన్నబియ్యం పథకం పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పడాల రాములు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డ్ దారులకు ఒక్క కార్డుకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని అన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని,తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని, చరిత్రలో నిలిచిపోయే పథకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బండారు లాలు,పడాల మల్లేశం,సంపత్ రెడ్డి పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలను తనిఖీ చేసిన కలెక్టర్

మహబూబ్‌బాద్, ఏప్రిల్ 2(మనంన్యూస్)ః బుధవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ గార్ల మండలంలోని ఆశ్రమ హై స్కూల్, కె.జి.బి.వి, ఎస్.సి బాలికల, బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ స్టోర్ గదిని, డైనింగ్ హాలు, క్లాస్ రూంలు, పరిశీలించి అధికారులు, వంట వండే సిబ్బంది తో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. నాసిరకం, నాణ్యతాలేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చదువు కొనసాగించేలా అనుకూల పరిస్థితులు కల్పించాలని అధికారులు ఆదేశించారు. టాయి లెట్, బాత్రూం లను పరిశీలించి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. వేసవి దృష్ట్యా విద్యార్దులకు నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఇబ్బంది కలుగాకుండా చూడాలన్నారు విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక శిక్షణ, తరగతుల నిర్వహణ, ప్రశ్న, జవాబు పత్రాల నమూనాలపై అవగాహన, మధ్యాహ్న భోజనం, తదితర విషయాలపై విద్యార్థులను ఆరాతీశారు. విద్యార్దుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోధనా సిబ్బందికి సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత, పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలోని ఎస్.సి (ఎసి), ఎస్.టి పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ళను తనిఖీ చేసి విద్యార్థులతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం అందించే నాణ్యమైన భోజన వివరాలను అని అడిగి వంట పదార్థాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అధికారులతో అన్నారు. తనిఖీ లో వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్ర కమిటీ
పత్రికా ప్రకటన
తేది : 28.3.2025.
శాంతి చర్చల కమిటీకి, దేశ ప్రజలకు విజ్ఞప్తి.
'మధ్యభారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలి, భారత ప్రభుత్వం-సీపీఐ (మావోయిస్టు) బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలి' అనే అంశంపై మార్చి 24న హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. నేటి స్థితిలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, అది శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడాన్ని మేము స్వాగతిస్తున్నాం. ఈ సందర్భంగా, శాంతి చర్చల పట్ల మా పార్టీ వైఖరిని తెలియజేస్తున్నాం.

# శాంతి చర్చలకు సిద్ధం..

## కగార్ పేరుతో దాడులను నిలిపివేయాలి
## అంతర్గత భద్రత కోసం సైన్యం ఉపయోగిస్తారా ?
## హిందూ రాష్ట్ర ఏర్పాటు కోసమే ఈ నరమేధం
## మావోయిస్టు పార్టీ సంచలన ప్రకటన

**చర్ల, ఏప్రిల్ 2 (మనం న్యూస్) :** ప్రజల ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని, చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని కలుగ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మావోయిస్టు పార్టీ ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదలయింది. మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని భారత ప్రభుత్వం మావోయిస్టు పార్టీపై కాల్పులు విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే అంశంపై మార్చి 24వ తేదీన హైదరాబాదులో శాంతి చర్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించడాన్ని మావోయిస్టు పార్టీ స్వాగతించింది. ఈ సందర్భంగా శాంతి చర్చల పట్ల మావోయిస్ట్ పార్టీ వైఖరిని అధికార ప్రతినిధి అభయ్ లేఖ ద్వారా తెలియజేశారు. 2024 జనవరిలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కగార్ పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రత్యేక ప్రతిఘాతర యుద్ధాన్ని ప్రారంభించారని అభయ్ లేఖలో వెల్లడించారు. ప్రజల్ని మోసగించడానికి ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ముఖ్య ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి విజయ్ శర్మ తమ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపడానికి సిద్దమని, మావోయిస్టులు చర్చలకు రావాలని పదే పదే ప్రకటనలు చేశారని అభయ్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ రెండు సార్లు తాము చర్చలకు సిద్దిమేనని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కొరకు కగార్ పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని కోరారని తెలిపారు. బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలగాలను బేరక్ లకే ఫలితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదించారని తెలిపారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, కనీసం జవాబు కూడా ఇవ్వకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నంటూ ముఖ్యంగా ఛత్తీస్ గఢ్ లో ప్రతిఘాతక కగార్ యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ యుద్ధంలో దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు 400 మందికి పైగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయి కమాండర్లు, సభ్యులు, సాధారణ ఆదివాసి ప్రజానీకాన్ని హత్యలు చేశారని ఆరోపించారు. ఇందులో 1/3 వ వంతు సంఖ్యలో సాధారణ ఆదివాసి ప్రజలు హత్య చేయబడ్డారని తెలిపారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్ట్ చేసి అక్రమ కేసులు మోపి జైలుకు పంపారని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారమే సాధారణ ప్రజానీకాన్ని హత్య చేయిస్తున్నారని, కార్టిన్ అండ్ కిల్ ఆపరేషన్లో చిక్కుకుని గాయపడ్డ తమ పార్టీకి చెందిన పి ఎల్ జి ఏ సభ్యులను భద్రతా బలగాలు అవమానియంగా చిత్రహింసలకు గురిచేసి హత్య చేస్తున్నారని ఆరోపించారు. మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడి హత్య చేస్తున్నారన్నారు. అందుకే ఈ యుద్ధాన్ని నరసంహారం అంటున్నామని లేఖలో తెలియ చేశారు. కేంద్ర ప్రభుత్వం కమాండో బలగాల ముసుగులో భారత సైన్యాన్ని మొహరించిందని ఆరోపించారు. విప్లవ మధ్య ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించకుండానే అంతర్గత భద్రత కోసం సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి గాని, ప్రకటించకుండా గాని సొంత దేశ ప్రజలపై సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకమన్నారు.

సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదారులు, భూస్వాముల దోపిడిని సుస్థిరజ చేయడం కోసం, హిందూ రాష్ట్ర ఏర్పాటు కోసం బిజెపి పాలిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితులలో ప్రజల ప్రయోజనాల కోసం తాము శాంతి చర్చలకు సిద్ధమేనని స్పష్టం చేశారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదనలు చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్ గడ్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యాకాండలను, నరసంహారాన్ని నిలిపి వేయాలని విజ్ఞప్తి చేశారు. సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని ప్రతిపాదించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే తాము తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. తాము చేస్తున్న ఈ ప్రతిపాదన ఆధారంగా శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని శాంతి చర్చల కమిటీకి, దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు, ఆదివాసి, దళిత, విద్యార్థి, యువజన సంఘాల వారికి మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. శాంతి చర్చల కోసం కేంద్ర రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాలు, జిల్లా, తాలూకా కేంద్రాలు, యూనివర్సిటీలలో ప్రచార క్యాంపెయిన్ చేపట్టాలని అభయ్ కోరారు.

# హెచ్.సీ.యూ భూముల వేలం పాటను ఆపాలి

- అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం ర్యాలీ

**ఖమ్మం, ఏప్రిల్ 2 (బుధవారం):** హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ భూముల వేలం పాటను ఆపాలని, ప్రశ్నించిన విద్యార్థులు, సిపిఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఏత్తివేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు, విద్యార్థుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సరిత క్లినిక్ సెంటర్ వద్ద దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. అంతకు ముందు పార్టీ జిల్లా ఆఫీస్ సుందరయ్య భవన్ నుండి నిరసన ర్యాలీ ప్రాంభమై, సరిత క్లినిక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ గచ్చిబౌలిలోని 400 ఎకరాల యూనివర్సిటీకి సంబంధించిన భూముల ప్రభుత్వ వేలం పాటను తక్షణమే ఆపి విశ్వవిద్యాలయానికి భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. భూమిలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశిస్తే పర్యావరణం



దెబ్బతింటుందని, జీవ వైవిధ్యం నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నూతన భవనాలు, వసతి గృహాలు, కోర్సులు తదితర అనేక అవసరాలకు ఉపయోగపడే భూములను విశ్వవిద్యాలయానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, ప్రజల న్యాయమైన డిమాండ్లను ఆలోచన చేయకుండా ప్రశ్నించిన విద్యార్థులను, రాజకీయ పార్టీలను నిరంకుశంగా అణచివేస్తుందని విమర్శించారు. యూనివర్సిటీకి సంబంధించిన భూములపై ప్రభుత్వం అడుగుపెట్టే అర్హత లేదని అన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయాలను పరిశోధనా కేంద్రాలుగా మార్చి, అభివృద్ధి చేయడం మానేసి యూనివర్సిటీలలోకి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులను ప్రోత్సహించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని 400 ఎకరాల భూమి హెచ్.సీ.యూ.కు అప్పగించాలని, రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన సిపిఎం నాయకత్వాన్ని విడుదల చేసి విద్యార్థులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను కలుపుకొని దీర్ఘ కాల ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. యూనివర్సిటీ భూములు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, ఈ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి యూనివర్సిటీ మూలాలను దెబ్బతీయొద్దని, ప్రజాస్వామ్య పద్ధతులో శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని పోలీసులను ఉపయోగించి ఎందుకు నిర్బంధిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి నిర్బంధాల ద్వారా ఈ ఉద్యమాన్ని అణిచివేస్తామనుకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, బండి పద్మ , జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, ఎస్.నవీన్ రెడ్డి దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, ఎస్ కే బషీరుద్దీన్, పార్టీ వన్ టౌన్, టూ టౌన్, 3టౌన్ కార్యదర్శులు నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాస్, పార్టీ కార్పోరేటర్ వెల్లంపల్లి వెంకట్రావు, జిల్లా నాయకులు ఆర్. ప్రకాష్, ఎస్.కె.సైదులు, మాచర్ల గోపాల్ కె.అమరావతి, ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షులు పి. సుధాకర్, పాపారావు, ఎస్ కే ఇమామ్, గుమ్మడి బిక్షం, ఎస్కే అఫ్జల్, శ్రీమన్నారాయణ, మాచర్ల సైదులు, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్, భాగం అజిత, మెహరున్నీసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్ పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



**గార్ల, ఏప్రిల్ 2(మనం న్యూస్):** హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గార్ల కల్లుగీత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 365వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం కల్లుగీత కార్మికులు స్థానిక తాటివనంలో సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ బహుజనుల వీరుడు గోల్కొండ కోటను జయించిన యోధుడు గౌడ జాతి ముద్దుబిడ్డ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. మొఘల్ రాజుల చేస్తున్న అరాచకాలను బహుజన ప్రజలపై జరుగుతున్న దాడులను చూసి తట్టుకోలేక జనగామ కేంద్రంగా సామాన్య బడుగు బలహీన వర్గాల ప్రజలందరినీ కలుపుకొని ఒక సైన్యంలా తయారుచేసి గోల్కొండ కోటపై మెరుపు దాడి నిర్వహించి గోల్కొండ కోటను జయించిన గొప్ప యుద్ధ వీరుడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ అని,వారు ఆనాడు పేద దళిత ప్రజల కోసం చేసిన త్యాగాలను గుర్తించి నేటికీ లండన్ మ్యూజియంలో వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించటం గౌడ కులస్తులందరికీ గర్వకారణమని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పైన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌడ కులస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణా గౌడ్, కల్లు గీత సంఘం అద్యక్షుడు తొడీటి విజయ రాముడూ గౌడ్, తోడేటి శ్రీనివాస్ గౌడ్ , మండ రవి గౌడ్ ,నల్ల మాస వీరన్న, తోడేటి సత్యనారాయణ, కొత్త కొండ కుమార్, అంబటి సమ్మయ్య, కత్తి వెంకన్న, నల్ల మాస శ్రీను, గౌని వెంకన్న, ఉయ్యాల కృష్ణ, నల్ల మాస వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.90.50 లక్షలు



- మంత్రి పొంగులేటి చొరవతో సుడా నుంచి నిధులు మంజూరు

**ఖమ్మం, ఏప్రిల్ 2(మనం న్యూస్):** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో పాలేరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి సుడా నుంచి రూ.90.50లక్షల విడుదల అయ్యాయి. ఈ విషయాన్ని సంబంధిత మున్సిపల్ అధికారులు ధృవీకరించారు. ప్రధానంగా వేసవి అధికంగా ఉండటంతో దానిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు సమస్య తల్తెతకుండా వాటి పరిష్కారం కోసం రూ.50 లక్షలు, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పడిన డివిజన్ల సుందరీకరణలో భాగంగా డివైడర్ల మధ్య మొక్కల ఏర్పాటుకు రూ.15.50 లక్షలు, అదేవిధంగా ప్రజల ఆరోగ్యాన్ని, భద్రతను దృష్టిలో ఉంచుకుని శానిటేషన్, ఎల్ఈడీ వీధిలైట్ల ఏర్పాటుకు రూ. 25 లక్షల కేటాయింపు జరిగింది. ఇతర మున్సిపాలిటీలకు ధీటూగా ఏదులాపురం మున్సిపాలిటీని తీర్చిదిద్దేందుకు మంత్రి పొంగులేటి విశేష కృషి చేస్తున్నారని క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. నిధుల విడుదల పై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

**దమ్మపేట, ఏప్రిల్ 2(మనం న్యూస్):** మండలంలోని దురదపాడు గ్రామంలో కాసాని మంగేశ్వరావు, నాగప్రసాద్ బ్రదర్స్ నివాసం ఎదురుగా గల తాటివనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ వర్ధంతినిర్వహించారు. నాగుపల్లి, దమ్మపేట గ్రామాలకు చెందిన గౌడ బంధువులతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాసాని నాగప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవానికి, ధీరత్వానికి, ప్రతీక అని, తెలంగాణ బహుజన వీరుడని, రాజకీయ, సామాజిక



సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి ఎనలేనిది అని అన్నారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని చాటడానికి ప్రతి సంవత్సరం వారి వర్ధంతి, జయంతి రోజున ఆ మహనీయుని స్మరించుకొని, పాపన్న ను ఆదర్శంగా తీసుకొని సమాజంలోని సామాజిక వర్గాలతో కలిసిమెలిసి సంతోషంగా జీవించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు కాసాని మంగేశ్వరరావు, నాగప్రసాద్, వంగల రాంబాబు, జై గౌడ్ సేన రాష్ట్ర కమిటీ సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, తెలంగాణ ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జీ నాయుడు రాధాకృష్ణ, నాగుపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మారగాని నాగేశ్వరరావు, నాయుడు సతీష్, మిడత శ్రీను, అశ్వారావుపేట గౌడ సంఘం సభ్యులు కొనకళ్ళ శ్రీను, పర్సా రామేశ్వరరావు, మిద్దె లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- చలివేంద్రాల సమర్థ నిర్వహణకు చర్యలు
- ప్లాస్టిక్ నియంత్రణపై కలెక్టర్ సమీక్ష



**ఖమ్మం, ఏప్రిల్ 2(మనం న్యూస్):** ఏప్రిల్ నెలాఖరు నాటికి మండల కార్యాలయాలను ప్లాస్టిక్ రహితం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్లాస్టిక్ నియంత్రణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మండలాల్లో తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఏప్రిల్ తర్వాత మండల స్థాయి కార్యాలయాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వాడ వద్దని కలెక్టర్ తెలిపారు. మండలంలో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి రోజు త్రాగునీటి సరఫరా నాణ్యత తనిఖీ చేయాలని అన్నారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో బస్ స్టాప్, ఆటో స్టాండ్ ల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలతో ఇంటరాక్ట్ అయ్యే సమయంలో అధికారులు ఓపికతో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, బిసి సంక్షేమ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డిఎంఅండ్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి.రవి

**మహబూబాబాద్, ఏప్రిల్ 2 (మనం ప్రతినిధి):** జిల్లాకు నూతన వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.రవి బుధవారం బాధితులు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను ఐ.డి.ఓ.సి లోని కలెక్టర్ చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో ముందంజలో ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వీర బ్రహ్మచారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, మాస్ మీడియా సెక్షన్ అధికారులు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ ఆఫీస్ సిబ్బంది, ఎన్ హెచ్ ఎం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి,డాక్టర్ ప్రమీల,డాక్టర్ నాగేశ్వరరావు,డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్ కుమార్ డాక్టర్,శ్రవణ్ కుమార్, డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ , జిల్లా టీఎన్జీవోల అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి కొప్పు ప్రసాద్, కె.వి.రాజు,పురుషోత్తం హెల్త్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి




- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం, ఏప్రిల్ 02(మనం బ్యూరో):** రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్ లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని లేదా ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు సబ్సిడీ యూనిట్లు లభిస్తాయని అన్నారు. అభ్యర్థులకు వ్యవసాయేతర యూనిట్లకు 21 నుంచి 55 ఏళ్ళ వయస్సు ఉండాలని, వ్యవసాయ యూనిట్లకు 60 సంవత్సరాల వరకు సడలింపు ఉందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ లేదా ఆధాయ ధృవీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే 3 రోజులలో జారీ చేసేలా తహసీల్దార్ లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మండల జనాభా, గ్రామ జనాభా అనుగుణంగా కేటాయించిన లక్ష్యాల ప్రకారం యూనిట్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. స్క్రూటినీ యూనిట్ లో స్పెషలిస్ట్ అధికారులను సైతం ఉంచుతామని అన్నారు. సెక్టార్ వారీగా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని అన్నారు. డాక్యుమెంట్ కారణంగా ఎవరికి యూనిట్ ఆపడం జరగదని కలెక్టర్ తెలిపారు. బ్యాంక్ లింకేజీ రుణాలు కూడా తప్పనిసరిగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు అనవసరంగా తిరస్కరించడానికి వీలు లేదని అన్నారు. అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి రేషన్ షాపులో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. రేషన్ డీలర్ల ఓనర్ షిప్ రీ-వెరిఫికేషన్ చేస్తామని, సరిగ్గా పని చేయని రేషన్ డీలర్లపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. లబ్దిదారులకు ఎవరైనా సన్న బియ్యం కాకుండా నాణ్యత లేని బియ్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎన్ విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్):** ప్రభుత్వం చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని వీరన్న పేట, కిసాన్ నగర్, చౌకధర దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో గత ప్రభుత్వం పేదలకు నిత్యవసర సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయలేదని, చౌక ధర దుకాణాల్లో అన్ని సరుకులు పంపిణీ ఎత్తివేసి కేవలం దొడ్డు బియ్యానికి మాత్రమే పంపిణీ చేశారని ఆయన విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఎవ్వరికీ కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం మరికొన్ని సరుకులు పేదలకు అందించేలా ప్రయత్నిస్తోంది అని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఒక విప్లవాత్మక కార్యక్రమంగా నిర్వహిస్తుందని, ఎటువంటి అవకతవకలు జరగకుండా , ప్రజలకు సన్న బియ్యం పంపిణీ ఖచ్చితంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రైతులు సన్న వడ్లు పండించే విధంగా వారిని ఒప్పించి, కోట్ల రూపాయలు వారికి బోనస్ గా అందించి, ఈరోజు పేద ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, అలాగే మన పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ హాస్టల్స్ లో , పాఠశాల లో కూడా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం మొత్తం 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని, 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అంజయ్య, పద్మ, నాయకులు రఘు, నక్క శ్రీనివాస్, పార్వతి రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగ్ పెట్టరాదు

- జిల్లా ఎస్పీ డి. జానకి




**హైదరాబాద్, ఏప్రిల్ 2 (మనం న్యూస్):** అధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగ్ చేయరాదని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పిడి జానకి తెలిపారు.జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు ఏప్రిల్ 02 నుండి 30 వరకు, జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ జానకీ తెలిపారు. పోలీస్ఆక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని, నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన పోలీస్ఆక్ట్ కింద శిక్షార్హులు అవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ ద్వారా
# పేదలకు మరింత లబ్ధి



- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి):** సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు.జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రేషన్ దుకాణం (షాప్ నంబర్ 1), అలాగే జిల్లా కేంద్రంలోని గుల్లగడ్డలో గల రేషన్ దుకాణాలలో (షాప్ నంబర్ 9) ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరయ్యి,రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అలాగే లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ పథకం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువ గల పోషకాలు, విటమిన్లు కలిగి ఉంటాయని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ సన్న బియ్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, తహసీల్దార్ హుస్సేన్, ఇంఛార్జి డీసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, రేషన్ డీలర్లు ఎల్లయ్య, అబ్బాస్, డీటీ సీఎస్ శ్రీనివాస్, రేషన్ డీలర్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం సరఫరా

- త్వరలో కొత్త రేషన్ కార్డులు అందిస్తాం
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్/ఎలిగేడు ఏప్రిల్ 2 (మనం న్యూస్):** ఎలిగేడు మండల కేంద్రంలో అలాగే దూళికట్ట గ్రామాలల్లో రేషన్ దుకాణలల్లో బుధవారం అదనపు కలెక్టర్ వేణు,ఆర్డీఓ గంగయ్య తో కలిసిపెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 55 రేషన్ దుకాణాల ద్వారా డీలర్లు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఇప్పటికే సన్న బియ్యం సరఫరా చేశామని పేర్కొన్నారు. త్వరలో నియోజకవర్గంలో అదనంగా కొత్త రేషన్ షాపులు తీసుకువస్తామని చెప్పారు. గత ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తామని మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2700 కోట్ల అదనపు భారాన్ని భరించి ప్రజలకు రాష్ట్ర వ్యాప్తంగా సన్న బియ్యం ఇచ్చే నిర్ణయం దేశంలోనే చారిత్రాత్మకమైన కార్యక్రమంగా అభివర్ణించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల రేషన్ కార్డుల జారీ చేయబోతున్నామని ప్రకటించారు. గతంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు జారీ చేయలేదని విమర్శించారు. గతంలో రూ.3400 ఉన్న ఇసుక ధర ప్రస్తుతం రూ. 1400 కే ఇసుక ఇస్తున్నామని దీంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. మంచి చేస్తే అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. మాట తప్పకుండా గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు వేశామని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,దుగ్యాల సంతూష్ రావు, అర్షణపల్లి వెంకటేశ్వర్ రావు, బాల్సని పర్శరాములు, పుల్ల రావు, వామన్ రావు, భూమేష్, బుర్ళ్ల సత్యనారాయణ, నర్హరీ సుధాకర్ రెడ్డి, తిరుపతి గౌడ్, కార్యకర్తలు మరియు రేషన్ డీలర్లు, లబ్దిదారులు,మహిళలు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఆర్.ఎస్ రిబేటు సదుపాయం
# గడువు పొడిగింపు

- ఏప్రిల్ 30 వరకు చెల్లింపులకు అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని కోరిన జిల్లా కలెక్టర్

**నిజామాబాద్,ఏప్రిల్ 2(మనంప్రతినిధి):** అనధికార లే ఔట్ల క్రమబద్దీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మార్చి 31వ తేదీ నాటితో ఈ గడువు ముగియగా, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించిందని అన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని సూచించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఏప్రిల్ 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. వివిధ కారణాల వల్ల రెగ్యులరైజేషన్ చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పిస్తూ రాయితీ సదుపాయం గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించిందని అన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ సూచించారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని, దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఈ నెల 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం పొడిగించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవతి తరగతి పరీక్షలు



**భీంగల్, ఏప్రిల్ 2(మనంన్యూస్):** భీంగల్ మండలం లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (భీంగల్ ) ముచ్కూర్ స్కూల్ , పల్లికొండ స్కూల్ , గవర్నమెంట్ స్కూల్, ప్రభుత్వ కళాశాల లో ఏమీ ఆటంకాలు జరగకుండా, పోలీస్ బందోబస్తు పటిష్టంగా నిర్వహించడంతో, ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఎంఈఓ స్వామి తెలపడం జరిగింది .
ఈ కార్యక్రమం లో సిట్టింగ్ స్క్వార్డ్ పురస్తు నరేష్. ఇంఛార్జి మేడం అనురాధ ఇన్విజిలేటర్ లు , అధ్యాపకులు, తదితరులుపాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి అందరూ దరఖాస్తు చేసుకోవాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 02( మనం న్యూస్):** మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నవాబుపేట ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ,, మైనార్టీ వర్గాలు మరియు వివిధ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించింది. అర్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత నవాబుపేట మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ యువతి యువకులు ఓబి ఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పూరించిన దరఖాస్తు ఫారాన్ని డౌన్లోడ్ చేసుకుని, హార్డ్ కాపీ, అవసరమైన పత్రాలు జతపరిచి ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు.. అనంతరం మండల పరిధిలోని దయాపంతులపల్లి, అమ్మాపూర్, నర్సరీలను ఏపీవో జ్యోతి, పంచాయతీ కార్యదర్శి తో కలిసి సందర్శించారు, గురుకుంట గ్రామంలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను తనిఖీ చేశారు.




# ప్రతి ఉద్యోగి సేవలు అభినందనీయం



- ఉద్యోగంలో పదవి విరమణ సహజం
- నుడా చైర్మన్ కేశ వేణు

**నిజామాబాద్, ఏప్రిల్ 2(మనంన్యూస్):** నగర పాలక సంస్థలో పనిచేసి పదవి విరమణ చేస్తున్న అధికారుల సేవలు అభినందనీయమని నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ కేశ వేణు అన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిజామాబాద్ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ గంగిశెట్టి రాజేందర్ కుమార్,, నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, డిప్యూటీ సిటీ ప్లానర్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పాలకుర్తి శ్యాం కుమార్ ల పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగుల పనితీరును కొనియాడారు. ఉద్యోగంలో పదవి విరమణ అనేది సహజమని ప్రభుత్వానికి ప్రజలకు వారు చేసిన సేవలు అమోఘమని అన్నారు. నగరపాలక సంస్థలో అంచలంచెలుగా ఎదుగుతూ ఉన్నత స్థాయి అధికారిగా పదవి విరమణ పొందడం గర్వకారణం అని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోతాయని అయిన అన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువలు పూలమాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అధికారుల కుటుంబ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# హెచ్‌సియూ భూములను కాపాడాలి




**కామారెడ్డి, ఏప్రిల్ 2 ( మనంప్రతినిధి):** హెచ్. సి. యూ భూములను కాపాడాలని నిర్వహిస్తున్న ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జివిఎం విఠల్ కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారతీయ విద్యార్థి మోర్చా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ మాట్లాడుతూ హెచ్.సి.యు. భూములను పెట్టుబడిదారులకు అప్పగించే ఆలోచనలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విరమించుకోవాలి కోరారు. హెచ్.సి.యు. విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరించి అక్రమ లాఠీ చార్జి, అరెస్టులకు పాల్పడిన పోలీసుల తీరు విద్యార్థుల భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. అదేవిధంగా 1973 నుంచి హెచ్.సి.యు పరిధిలో ఉన్న భూమి రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా 2004 నుంచి ఒక్కసారిగా పాలకుల చేతుల్లోకి వెళ్ళిందన్నారు. ఇప్పుడు ఈ 400 ఎకరాల భూమిని ముఖ్యమంత్రి కార్పొరేట్ శక్తులకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ అధికారంలోకి వచ్చి ఆ ఇందిరమ్మ ఇచ్చిన భూమినే బహిరంగ మార్కెట్లో అమ్ముతానని ప్రకటించటం దారుణమైన విషయం, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తొలి తెలంగాణ ఉద్యమానికి ప్రతీక అయిన హెచ్.సి.యూ భూమిని యధాతథంగా ఉంచి పర్యావరణ రక్షణ, మూగజీవాల ప్రాణాలు కాపాడే విషయంలో నిజాయితీని, నిబద్ధతను, చాటుకోవాలి అనీ కోరారు. విద్యార్థుల జోలికి కానీ యూనివర్సిటీ ల జోలికి వస్తే విద్యార్థులు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గుణపాఠం తప్పదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అర్బస్ ఖాన్, నాయకులు పెరుమాండ్ల బుల్లెట్, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జీడబ్ల్యూఎంసీ పరిధిలోనూ ఇదే తరహా విధానం అమలుకు యోచన

- శుక్రవారం రాంపూర్ డంపింగ్ యార్డును పరిశీలించనున్న రాంకీ సంస్థ ప్రతినిధులు



**వరంగల్, ఏప్రిల్ 2(మనంబ్యూరో):** జిహెచ్ఎంసి పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డును వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. జీహెచ్ఎంసీలో అమలవుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతి, చెత్త నుంచి విద్యుత్తు తయారీ, చెత్త ట్రాన్స్ఫర్ తయారీ స్టేషన్లను వారు పరిశీలించారు. హైదరాబాద్ లోని వివిధ డివిజన్ల నుండి చెత్తను ఏ విధంగా తరలిస్తున్నారు, డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి పద్ధతులను అనుసరిస్తు న్నారు, చెత్తను ఏ విధంగా రీసైక్లింగ్ చేస్తున్నారనే విషయాలను క్షేత్రస్థాయిలో ఇరువురు కలెక్టర్లు, కమిషనర్ అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ చెత్తతో విద్యుత్తును ఉత్పత్తి చేయడం అద్భుతమని పేర్కొన్నారు. హైదరాబాద్లోని చెత్తను జవహర్నగర్ డంపింగ్ యార్డ్కు తరలించి ఆధునిక టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించడం అభినందనీయమని కలెక్టర్లు కొనియాడారు. జవహర్నగర్ డంపింగ్ యార్డులో చెత్త నుంచి కరెంట్, గ్యాస్ను తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించామని, ఇదే తరహాలో గ్రేటర్ వరంగల్ లో అభివృద్ధి చేస్తామని చెప్పారు.డంపింగ్యార్డ్లో కొత్త టెక్నాలజీతో చేస్తున్న అధ్యయనాలు బాగున్నాయని వారు ఈ సందర్భంగా కితాబిచ్చారు.సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్టడీ టూర్లో భాగంగా డంపింగ్యార్డ్ను సందర్శించిన కలెక్టర్లు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి వేరు చేయడానికి అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు, వ్యర్థ పదార్థాల ద్వారా వివిధ రకాల ఉత్పత్తి, నిర్వహణ గురించి కలెక్టర్లు, జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ లకు ఘన వ్యర్థాల నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంపూర్ డంపింగ్ యార్డు ను జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వద్ద సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న రాంకీ సంస్థ ప్రతినిధులు జిడబ్ల్యూఎంసీ కు శుక్రవారం సందర్శించి రాంపూర్ డంపింగ్ యార్డ్ వద్ద శాశ్విత ప్రతిపాదికన అనుసరించవలసిన పద్ధతులను, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూ ఎంసీ ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సంబంధిత అధికారులు, రాంకి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న బి.ఎస్.రావు ఫౌండేషన్



- కోమా లో ఉన్నరోగి కుటుంబానికి ఇరవై వేలు ఆర్థిక సాయం

**కొత్తపల్లి,ఏప్రిల్02 (మనంన్యూస్):** గత నెల మార్చి 2వ తేదీన ప్రమాదానికి గురై కోమాలో వున్న చట్ల సమ్మయ్య కు డాక్టర్ బి.ఎన్ రావు స్పందించి 20వేల ఆర్థిక సాయం అందించారు. చట్ల సమ్మయ్య నెల రోజులుగా కోమాలో ఉన్నాడు,హైదరాబాద్లో తలకి ఆపరేషన్ చేయించుకుని రెండు వారాల తర్వాత కరీంనగర్ ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడ ఒక వారం రోజులు ఉన్న తర్వాత రోగి ఆరోగ్యం కుదుట పడకపోవడంతో నగరంలోని ఒక రిహాబిడేషన్ సెంటర్లో వైద్యం పొందుతున్నాడు. నెల రోజులుగా వైద్య ఖర్చులు సుమారు పది లక్షల వరకు ఖర్చ ఖర్చు అయి దిక్కుతోచని స్థితిలో వున్న కడు నిరుపేద కుటుంబానికి డాక్టర్ బి. ఎన్ రావు తమ ఫౌండేషన్ ద్వారా ఇరవై వేలు ఆర్థిక సాయం చేసి వారి కుటుంబానికి అండగా నిలిచారు. అంతేకాకుండా ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి పేషెంట్ కి తగిన వైద్యం అందించాలని కోరారు.

# సన్న బియ్యం పంపిణీ సాఫీగా జరగాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**నిజామాబాద్, ఏప్రిల్ 2(మనంప్రతినిధి):** జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ లో గల 21వ నెంబర్ రేషన్ షాపును కలెక్టర్ బుధవారం సందర్శించి, లబ్దిదారులకు స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు. రేషన్ దుకాణానికి కేటాయించబడిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ ఉందా అని పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తన వెంట ఉన్న అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్కదుకాణంలోనూ సన్న బియ్యం నిల్వలు లేవు అనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు. జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,10,01 2 మంది సభ్యులకు ప్రతీ నెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మంగళవారం నుండి సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, బుధవారంమధ్యాహ్నం నాటికి 3183.095 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ పూర్తయ్యిందని, మొత్తం కోటాలో 38 శాతం పంపిణీ జరిగిందని కలెక్టర్ వివరించారు. కాగా, జాప్యానికి తావు లేకుండా సకాలంలో లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ జరిగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సహాయ అధికారి రవి రాథోడ్, రేషన్ డీలర్ హిమబిందు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి పార్థసారథి, నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి విక్కీ యాదవ్ తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ సమీక్షలో పాల్గొన్న నేతలు



**నిజామాబాద్, ఏప్రిల్ 2(మనంప్రతినిధి):** ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలతో అధినేత కే.చంద్రశేఖర్ రావు బుధవారం ఎర్రవెల్లి నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కె. ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నేతలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ బిగాల గుప్త, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- బీ.సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు



**నిజామాబాద్, ఏప్రిల్ 2( మనం న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి రాచరిక వ్యవస్థలోని దౌర్జన్యాలను ఎండగడుతూ, సర్వాయి పాపన్న గౌడ్ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నులు లేని వ్యవస్థను నెలకొల్పి గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులు ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, సి.గంగాధర్, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ గౌడ్, గౌడ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారయ్య గౌడ్, నాయకులు చెరకు లక్ష్మణ్ గౌడ్, రత్నాకర్ గౌడ్, తాళ్లపల్లి రాజా గౌడ్, సేపూరి సుమన్ గౌడ్, నాగరాజు గౌడ్ బండి సాయా గౌడ్ మాజీ కార్పొరేటర్ ఉమా శ్రీనివాస్ గౌడ్, అధిక సంఖ్యలో గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

# రేషన్ షాపులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**నిజామాబాద్, ఏప్రిల్ 2( మనం న్యూస్):** జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీలో గల పలు రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన నేపథ్యంలో, లబ్దిదారులకు సజావుగా బియ్యం పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. 23, 31 నెంబర్ రేషన్ షాపులను సందర్శించి, బియ్యం పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలలోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం నిల్వలు కేటాయించబడ్డాయా అని ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో బియ్యం పంపిణీ జరిగింది, ఇంకా ఎంత మందికి పంపిణీ చేయాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంతరాలు తావులేకుండా సజావుగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని రేషన్ డీలర్లు సంధ్యారాణి, గంగామణిలను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# చౌక ధరల దుకాణాల్లో సన్నపు బియ్యం పంపిణీ



**భీంగల్, ఏప్రిల్ 2(మనం న్యూస్):** భీంగల్ మండలంలోని దేవన్‌పల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన పేద ప్రజలకు సన్నపు బియ్యం పంపిణి చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజలకు చౌక ధరదుకాణాల ద్వారా సన్నపు బియ్యాన్ని పంపిణీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా గిరిజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.రాములు,గ్రామ వీడీసీ బొడ్డు చిన్న గంగారం గ్రామ యువ కాంగ్రెస్, నాయకులు ఎం. సంతోష్ నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కరిపే రమేష్, బొడ్డు సుదర్శన్, ఎం లింబాద్రి, లక్ష్మి, బుచ్చయ్య, రాజ గంగారం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# లక్ష మంది హసీనా కార్యకర్తలు భారత్‌కు పరారీ

- బంగ్లా అడ్వైజర్ సంచలన వ్యాఖ్యలు

ఢాకా, ఏప్రిల్ 2: అవామీ లీగ్ పార్టీకి చెందిన లక్ష మందికి పైగా కార్యకర్తలు భారత్‌లోకి పరారైనట్లు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ అడ్వైజర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ అడ్వైజర్ ఒకరు తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో కూర్చొని ఆమె తన సొంత దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని బంగ్లా ప్రభుత్వ



సమాచార సలహాదారు మహ్‌ఫుజ్ ఆలమ్ ఆరోపించారు. అంతేకాదు.. హసీనాతో పాటు ఆమె పార్టీ అవామీ లీగ్‌కు చెందిన దాదాపు లక్ష మంది కార్యకర్తలు భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు.

రంజాన్ సందర్భంగా ఢాకాలో ఓ కార్యక్రమం ఏర్పాటుచేశారు. హసీనా ప్రభుత్వ హయాంలో అదృశ్యమైన లేదా ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబసభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆలమ్.. మాజీ ప్రధానిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ''తన తల్లిదండ్రుల హత్యకు ప్రతీకారంగా హసీనా దేశంలో పలు అక్రమాలకు పాల్పడ్డారు. ఎదురుతిరిగిన వారి ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడలేదు. 2013-14 మధ్య ఓటు హక్కు కోసం ప్రజలు పోరాడుతున్న సమయంలో పెద్ద సంఖ్యలో మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. వారి ఆచూకీ ఇప్పటివరకు తెలియరాలేదు. ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ఆమె ఎన్నో దారుణాలు చేశారు'' అని ఆలమ్ మండిపడ్డారు.

''అవామీ లీగ్‌ను వ్యతిరేకించిన వారిని ఉగ్రవాదులు, మిలిటెంట్లుగా ముద్ర వేసి వారిని కన్పించకుండా చేశారు. ఇప్పుడు కూడా భారత్‌లో కూర్చుని బంగ్లాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారు. హసీనాతో పాటు దాదాపు లక్ష మందికి పైగా అవామీ లీగ్ కార్యకర్తలు ఆ దేశానికి పారిపోయారు. వారికి భారత్ ఆశ్రయం ఇవ్వడం దురదృష్టకరం'' అని ఆలమ్ ఆరోపించారు.

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. స్వదేశంలో హసీనాపై 100కు పైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది.

# విదేశీ విద్యార్థులపై అమెరికా ఏఐ నిఘా




- హమాస్ అనుకూల విద్యార్థులను పట్టుకోవడానికి సాంకేతికత

వాషింగ్టన్, ఏప్రిల్ 2: క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈ మెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ఓ కీలకమైన విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను గుర్తించడానికి.. వారిపై నిఘా పెట్టడానికి అమెరికా ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌ను ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాద అనుకూల పోస్టులు, స్టోరీలకు ఇన్‌స్టాలో లైక్ కొట్టినా దొరకబుచ్చుకునేలా ట్రంప్ యంత్రాంగం సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నాయి.

యూఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వంలో అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన నాటినుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేశారు, ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. నివేదికలోని వివరాల ప్రకారం.. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా ఏఐ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్లు ఉంటాయి.

బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో బహిష్కరణ వేటు పడినప్పటికీ యూఎస్‌లోనే ఉంటున్న అక్రమ వలస విద్యార్థులు గుర్తించడానికి కూడా ట్రంప్ యంత్రాంగం వీటిని ఉపయోగిస్తోంది. ఇందులోభాగంగా ఇప్పటివరకు లక్షకు పైగా విదేశీయుల ప్రొఫైల్లను ఫెడరల్ అధికారులు స్కాన్ చేశారు. ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం..2023-24 విద్యా సంవత్సరంలో అమెరికా రికార్డు స్థాయిలో 1.1 మిలియన్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో 3 లక్షలకు పైగా భారత్ నుంచి వచ్చారు.

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అన్ని విషయాలపై ఉక్కుపాదం మోపారు. ఇందులోభాగంగానే జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. ఈ మేరకు హెచ్చరిక సందేశాలు అందుకున్నవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.




# నగరంలో జోరుగా జై బాపు జై భీమ్ జై సవిధాన్ కార్యక్రమం

**నిజామాబాద్, ఏప్రిల్ 2(మనం ప్రతినిధి):** జై బాపు జై భీమ్ జై సవిధాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర సలహాదారు పెద్దలు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశానుసారం జై బాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోనీ డివిజన్ 23 50 లో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దలు ఉర్దు అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ , బింగి మధు, శేఖర్ గౌడ్ రత్నాకర్ , రామ కృష్ణ , వైసాక్షి సంతోష్ కుమార్, రాంభూపాల్ మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ట్రంప్‌నకు వ్యతిరేకంగా 25 గంటల పాటు ప్రసంగం

- డెమోక్రటిక్ సెనెటర్ కోరీ బుకర్ అరుదైన రికార్డ్



వాషింగ్టన్, ఏప్రిల్ 2: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ ఓ డెమోక్రటిక్ సెనెటర్ ఏకంగా 25 గంటలకు పైగా ప్రసంగించారు. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై స్వదేశంలో కొన్నివర్గాల నుంచి వ్యతిరేకత వస్తోంది. ముఖ్యంగా ఆయన వైఖరిని డెమోక్ర ట్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈక్రమంలోనే తాజాగా ఓ విపక్ష సెనెటర్ అరుదైన ఫీట్ చేశారు. అధ్యక్షుడి విధానాలను వ్యతిరేకిస్తూ 25 గంటల పాటు ప్రసంగించారు. దీంతో సెనెట్ చరిత్రలోనే సుదీర్ఘ ప్రసంగం చేసిన న్యూజెర్సీ సెనెటర్, డెమోక్రటిక్ నేత కోరీ బుకర్ అరుదైన రికార్డు సాధించారు. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం సెనెట్ ఫ్లోర్ ఎక్కి ప్రసంగం ప్రారంభించిన ఈ 55 ఏళ్ల నేత రాత్రంతా మాట్లాడుతూనే ఉన్నారు. మంగళవారం సాయంత్రం వరకు ఆయన ప్రసంగం సాగింది. మొత్తంగా 25 గంటల 5 నిమిషాల పాటు ఆయన మాట్లాడారు. ఛాంబర్ చరిత్రలోనే ఇదే అత్యంత సుదీర్ఘమైన ఉపన్యాసం . దీంతో 1957లో పౌరహక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ రిపబ్లికన్ నేత స్ట్రోమ్ థర్మోండ్ చేసిన ప్రసంగం రికార్డును కోరీ బద్దలు కొట్టారు.

కోరీ బుకర్ ప్రసంగిస్తుండగా.. తోటి డెమోక్రటిక్ సభ్యులు ఆయనకు సాయంగా నిలిచారు. మధ్యమధ్యలో ప్రశ్నలు వేస్తూ ఆయనలో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ''ప్రజలు చాలా శక్తిమంతమైనవారు అని చాటిచెప్పేందుకే నేను ఈ రోజు ఇక్కడ నిలబడ్డాను. ప్రస్తుతం మన దేశంలో నెలకొన్న పరిస్థితులు సాధారణంగా లేవు. అమెరికా ప్రజలకు, ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న ముప్పు తీవ్రంగా ఉంది. అందుకే ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా నిలబడాల్సిన సమయం వచ్చింది'' అని బుకర్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ట్రంప్ ఆర్థిక, వాణిజ్య విధానాలను ఆయన తప్పుబట్టారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం విధిస్తున్న కోతలను ఖండించారు. బుకర్ ప్రసంగిస్తున్న సమయంలో ఆయన కుటుంబసభ్యులు ఛాంబర్ గ్యాలరీలో కూర్చుని వీక్షించారు. కాగా.. 2013లో అప్పటి టెక్సాస్ రిపబ్లికన్ సెనెటర్ టెడ్ క్రూజ్ సెనెట్లో 21 గంటల 19 నిమిషాల పాటు ప్రసంగించారు. అంతకుముందు 1957లో స్ట్రోమ్ థర్మోండ్ 24 గంటల 18 నిమిషాల పాటు సభలో మాట్లాడారు. ఇప్పుడు ఈ రికార్డ్‌ను బుకర్ అధిగమించారు.

# ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ కీలకం - రాజ్యసభ ఛైర్మన్ ధన్ఖడ్

ఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యంలో పాలన అనేది కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారా మాత్రమే సాగుతుందని, న్యాయస్థానాల వల్ల కాదని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ప్రభుత్వమే అంతిమమైందని ఆయన పేర్కొన్నారు. 'నీట్' కేంద్రీకరణపై గతంలో సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రస్తావించిన సమయంలో రాజ్యసభ ఛైర్మన్ ఈ విధంగా స్పందించారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే సభ్యురాలు కనిమొళి ఎన్వీఎన్ సోమూ మాట్లాడుతూ.. జాతీయ అర్హత పరీక్ష 'నీట్'ను వికేంద్రీకరించాలని డిమాండు చేశారు. దీనిని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తోసిపుచ్చారు. గతంలో దీనిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన ఆయన, కేంద్రీకృత విధానాన్ని న్యాయస్థానం కూడా సమర్థించిందన్నారు. ఈ క్రమంలోనే జోక్యం చేసుకున్న ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రజాస్వామ్యంలో పాలన కేవలం కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారానే సాగుతుందన్నారు. ఎందుకంటే.. ఎగ్జిక్యూటివ్ అనేది పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటుందన్న ఆయన.. ఇది ఇతర ఏజెన్సీల ద్వారా ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు.



# ప్రజారక్షణకై... నూతన వరవడికి శ్రీకారం

- జన రక్షణ భద్రత కోసం పోలీసు భరోసా
- సమస్యాత్మక గ్రామాలు వార్డుల్లో మొదటి విడత అవగాహన
- ఫిర్యాదు చేసే బాధితులు ధైర్యంగా ముందుకు రావాలి
- అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా
- గాంజా డ్రగ్స్ పై ఉక్కు పాదం
- మీడియా చిట్ చాట్ లో జిల్లా ఎస్పీ కె నరసింహ




సూర్యాపేట ఏప్రిల్ 02 (మనం ప్రతినిధి)॰ పట్టణ గ్రామంలో ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు అదుపులో ఉంటే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయని గ్రామ పట్టణాల్లో క్రైమ్ రేట్ తగ్గించడమే కాకుండా పూర్తిస్థాయిలో నేరాలకు పాల్పడే వ్యక్తులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రజారక్షణకై నూతన వరవడి కి శ్రీకారం చుట్టామని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో వర్గాలుగా ఏర్పడి ఎప్పుడు గొడవలు పడుతూ ఉంటే గ్రామం అభివృద్ధి లో వెనక పడుతుందని గ్రామ వాతావరణం మన ముందు తరం పిల్లల, యువత భవిష్యత్తును ప్రభావితం చూపుతుందనితెలిపారు. దీనిని అరికట్టేందుకు విలేజ్ పోలీస్ ఏర్పాటు చేయడమైందని చెప్పుకొచ్చారు సమస్యాత్మక గ్రామంగా పోలీసు రికార్డ్ లలో ఒకసారి నమోదైతే పేరు 30 ఏళ్ల వరకు నిలిచి నిలిచిపోతుందని దీంతో కేసు నమోదైన వ్యక్తి కి భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఉత్పంధం అవుతాయని వెల్లడించారు. పలుమార్లు అవగాహన కల్పించిన వినకుండా నేరాలకు పాల్పడితే జైలుకు పంపడం జరుగుతుందని అంతేకాకుండా జిల్లా బహిష్కరణ సైతం చేసేందుకు వెనకాడ బొమ్మని ఎస్పీ తేల్చి చెప్పారు.నేటి ఆధునిక సమాజంలో పెద్దలను చూసి యువత అదే మార్గంలో ప్రయాణం చేస్తుందని దీంతో సమస్యలు సృష్టించడం గొడవలు పాల్పడటం ఒక వ్యక్తిపై రౌడీ పీటర్, సస్పెక్ట్ షీటర్ గా పోలీసు రికార్డ్ లో నమోదైతే జీవితకాలం ముద్ర అలాగే ఉండిపోతుందని దీనిని గ్రామ పట్టణంలో అవగాహన కల్పించేందుకు ప్రతి బుధవారం ఒక సిఐ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామం వార్డుని ఎన్నుకొని స్థానికంగా ఆ ప్రాంత స్థితిగతులు తెలుసుకొని గొడవలకు కారణం అయ్యే వారిని గుర్తించి డీఎస్పీ సీఐ స్థాయిలో పర్యవేక్షణ చేసి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని దీన్ని రాష్ట్రవ్యాప్తంగా సూర్యాపేట జిల్లానుండే మొదలు పెడుతున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి అల్లర్లు జరిగిన, ఎన్నికల సమయం వచ్చిన సమస్యలు సృష్టించే వ్యక్తిని ప్రతి సారి బైండోవర్ చేస్తాము.మీ ఇంటికి ఎన్నికల సమయంలో, ఇతర అత్యవసర సమయంలో పోలీసు వారు వచ్చి దర్యాప్తు చేస్తున్నారు అంటే మీకు చెడు పేరు వచ్చే అవకాశం లేకపోలేదని యువత ఒక్కసారి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందే సమయం విదేశాలకు వెళ్లే విషయంలో, పాస్ పోర్ట్, వీసా పొందే సందర్భాల్లో పోలీసు అనుమతులు ఇవ్వబడవు, సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనిని ముఖ్యంగా యువత గుర్తుంచుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా మహిళలను గౌరవించి మహిళా రక్షణలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయి, మహిళలను, పిల్లలను వేదిస్తే కేసులు నమోదు చేసి జీవితకాలం శిక్షలు పడేలా పోలీసు దర్యాప్తు ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.ఉచిత భాహుమతులు, తక్కువ రేటుకు వస్తువులు వస్తాయి, లాటరీ వచ్చినది, తక్కువ వడ్డీ లోన్ లు ఇస్తాము, డబ్బులు కడితే ఉద్యోగం ఇస్తాము, తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభం వస్తుంది ఇలాంటివి ఎవరైనా అపరిచితులు ఫోన్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా, మెసేజ్ ల ద్వారా తెలిపితే నమ్మి అత్యాశకు పోయి సైబర్ మోసాల బాలిన పడి డబ్బులు పోగొట్టుకోవద్దని ముఖ్యంగా డబ్బులు తక్కువ సమయంలో సంపాదించాలని అత్యాశకు గురై కేసుల పాలు కావద్దని సూచించారు. బెట్టింగ్ ప్రకటనలు నమ్మి డబ్బులు బెట్టింగ్ పెట్టి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయని ఎట్టి పరిస్థితులను ప్రజలు బెట్టింగ్ వల్ల లో పడద్దని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రయాణ సమయంలో జాగ్రత్తగా పాటిస్తూ మద్యం తాగి వాహనాలు నడపవద్దు, పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని ఆ దిశగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాలు గ్రామంలోకి రానివ్వద్దు, ఎవరైనా డ్రగ్స్ కు అలవాటు పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గ్రామంలో ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేయవద్దు. పిడిఎస్. బియ్యంతో అక్రమ వ్యాపారం చేస్తే ఎంతటి వారి పైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటితోపాటు పేకాట, బెట్టింగ్ లాంటి, బహిరంగంగా మద్యం తాగడం లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడవద్దు. ఇటీవల గ్రామాల్లో సైతం గంజా డ్రగ్స్ కు యువత అలవాటు పడుతున్నారని దీనిని రవాణా చేసిన కాంజా డ్రగ్స్ అలవాటు పడ్డ పసిగట్టి పోలీస్ శాఖ ఉక్కు పాదం మోపుతుందని ఈ గాంజా డ్రగ్స్ పై పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని ఇలాంటి దృష్టికి వస్తే వెంటనే సమాచారం అందజేయాలని తెలియజేశారు.

# శ్రీరాముడు హిందువుల ఆరాధ్య దైవం బిజెపి సొంతం కాదు

## సన్నబియ్యం పంపిణీ పై బిజెపి రాజకీయాలు చేయడం దౌర్భాగ్యం



- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్
- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి

నేరేడుచర్ల ఏప్రిల్ 2 మనం న్యూస్॰ శ్రీరాముడు హిందువుల ఆరాధ్య దైవం అని బిజెపి సొంతం కాదు అని ఇకనైనా బిజెపి మత రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి హితవు పలికారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హుజూర్ నగర్ వేదికగా పేద ప్రజలకు ఉగాది కానుకగా ప్రజా పంపిణీ లో సన్నబియ్యం పథకం ప్రారంభించి లేదా మధ్యతరగతి వర్గాలలో ఆనందం వెల్లి విరుస్తుంటేచూసి తట్టుకోలేని బిజెపి పార్టీ సన్న బియ్యాన్ని సైతం రాజకీయం చేయడం ఆ పార్టీ దౌర్భాగ్య స్థితికి నిదర్శమని ఆరోపించారు. దేశంలో 20 రాష్ట్రాలలో అధికారం ఉన్న బిజెపి పార్టీ ఏ ఒక్క రాష్ట్రంలో నైనా సన్న బియ్యం ఇవ్వలేకపోయిందని తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకం చూసి గగ్గోలు పెడుతుంది అన్నారు. గత పది సంవత్సరాలు తెలంగాణ ను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలో దింపిందని అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ లను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం గ్యాస్ సబ్సిడీ 200 లోపు విద్యుత్ సబ్సిడీ, రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ ఎకరానికి ఆరువేల రైతు భరోసా కల్పించిందని, రైతుకు 500 బోనస్ సైతం అందించి ప్రజలలో సుస్థిర స్థానం సంపాదించింది అన్నారు. సమగ్ర కుల సర్వే నిర్వహించి అసెంబ్లీలో తీర్మానం చేసిందని గర్వంగా చెప్పుకున్నారు. సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనతం చిన్న వెంకటరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ రణపంగ నాగయ్య, కుంకు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్లంశెట్ల రమేష్ బాబు, ఆకారపు వెంకటేశ్వర్లు, పాల్వాయి కృష్ణమూర్తి, మలిగిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చింతమల్ల సైదులు,జంగిలి వెంకటేశ్వర్లు, మండల ఎస్టి సెల్అధ్యక్షులు పాండు నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు కత్తి శ్రీనివాస్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇష్తియాక్, కాంగ్రెస్ నాయకులు కర్రీ సూరిబాబు, గుంటూరు శ్రీనివాస్, గజ్జల కోటేశ్వరరావు,గంట సైదులు, మచ్చ రవి, మారయ్య గౌడ్, డీసీఎం నాగరాజు, ఊట్కూర్ నటరాజ్, సిద్ధపంగు రామకృష్ణ, వీర బాబు,సాయి, సతీష్, వినోద్, మచ్చ రవీంద్ర కుమార్, పాల్వాయి గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, ఉప్పల పుల్లయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిచడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం



- సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ ,ఏప్రిల్ 02,(మనం న్యూస్): ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిచడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని 13వ వార్డు, 01వార్డులో సన్న బియ్యం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరుపున సన్న బియ్యం తీసుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.రేషన్ కార్డు ఉన్న ఒక్క మనిషికి ఆరు కిలోల సన్న బియ్యం యివ్వడం జరుగుతుంది కావున ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు.త్వరలో 30 లక్షల రేషన్ కార్డులు ఇస్తాం అని,ఆహర భద్రత చట్టం తీసుకవచ్చింది ఇందిరగాంధీ అని గుర్తుచేశారు.ఇప్పటికే 500 వందలకు గ్యాస్ సీలిండర్, ఉచ్చిత బస్సు,200 యునిట్ కరెంట్,మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నాం అన్నారు.మీ సమస్యలు పరిష్కారం చేయడానికి ఎల్లపుడు సిద్దం గా ఉంటాం అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డిసిఎమ్ ఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత - శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల-మాధవ్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, అధికారులు, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు




తిరుమలగిరి, ఏప్రిల్ 2(మనంన్యూస్)॰ రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకమై పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకొని హక్కులను కాపాడుకోవాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. బుధవారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన ప్రసంగించారు. ఆనాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరచిన ప్రకారం బడుగు బలహీన వర్గాల తో పాటు దళిత గిరిజనులకు రిజర్వేషన్లతో పాటు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో సమాన వాటా కల్పించాలని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కూడా ఆనాడు ఇందిరాగాంధీ హయాంలోనే పొందుపరిచారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ఈ దేశంలో రాష్ట్రంలో పేద ప్రజలకు దళిత గిరిజనులకు న్యాయం జరుగుతుందని అని చెప్పారు. రాజ్యాంగం రక్షణ కోసం గ్రామస్థాయి నుండి యువకులు ప్రజలు చైతన్యం కావాలని ఆయన కోరారు. ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టారని నేడు ఆ పథకం దేశవ్యాప్తంగా కోట్లాదిమందికి ఉపాధి హామీ కల్పిస్తుందని చెప్పారు. భారతదేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటుందని, గత పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ఆ ప్రజాస్వామ్య పాలన సాగిస్తున్నది రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీసుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తున్నది అన్నారు దేశ ప్రజలకు సమనహకులు సమాన న్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్న నేటి బిజెపి పాలకుల తీరు తీవ్ర ఆక్షేపనియంగా ఉంది అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను కాలరాస్తూ కట్టు, బొట్టు, తిండి, పూజ అన్నిటి పైన ఆంక్షలు పెడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడి పైన ఉన్నదని అన్నారు. అలాగే దేశంలో ఉన్న ప్రధాని మోడీ రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దళిత గిరిజనులకు తీరని అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఎంతోమంది ఆదివాసులను మోడీ ప్రభుత్వం పిట్టలను కాల్చినట్టు కాల్చివేస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సహకార సంస్థ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జై బాబు జై భీమ్ జై సంవిదాన్ కన్వీనర్ దరావత్ జుమ్మి లాల్ నాయక్, పిఎసిఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్,జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్,మీడియా ఇంచార్జి కందుకూరి లక్ష్మయ్య, తొండ గ్రామ శాఖ అధ్యక్షులు ఎల్లంల నాగరాజు, నాయిని కృష్ణ, కిష్టు నాయక్, ఎస్టి సెల్ అధ్యక్షులు ప్రేమ్ ప్రసాద్, దూపటి మల్లయ్య,రామోజీ నాయక్, భాస్కర్ నాయక్, యువజన నాయకులు బోండ్ల వంశీ, కన్వీనర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



భువనగిరి, ఏప్రిల్ 2(మనం న్యూస్): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీతా కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహాయోధుడని అన్నారు. ఎటువంటి అండదండలు లేకుండా బడుగు బలహీన వర్గాల కులాలను ఏకం చేసి భూస్వాముల నుండి శిస్తుల రూపంలో పన్నుల వసూల్ల పేరుతో ప్రజలను పీడిస్తున్న క్రమంలో వారికి అండగా నిలిచి పోరాటం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, ఎస్సీ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వసంత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, కుల సంఘ నాయకులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



నాగార్జునసాగర్ ఏప్రిల్ 2 మనం న్యూస్ : మార్చి 21 నుండి ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 2తో ముగిశాయి. చివరి పరీక్ష వ్రాసిన అనంతరం విద్యార్థులు ఆనందంతో వెను తిరిగారు. మొత్తం 317 మంది విద్యార్థులకు గాను స్థానిక నందికొండ మున్సిపాలిటీ పరిధిలో రెండు పరీక్షా కేంద్రాలను అధికా రులు ఏర్పాటుచేయగా అందులో స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలలో 200 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 117 మంది విద్యార్థులు పరీక్ష వ్రాసారు. రెండు పరీక్షా కేంద్రాలలో కలిపి పూర్తి స్థాయిలో 317 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. సైన్స్ పేపరు మినహా మిగతా పరీక్షలన్నీ ఉదయం 9.30 నిముషాలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు కొనసాగింది. వార్షిక పరీక్షలు ప్రారంభం నుంచి చివరి వరకు మొత్తం రెండు పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అటుపోట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించామని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

# తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు సన్న బియ్యం పొందాలి

- 1.24 లక్షల లబ్దిదారులకి 2500 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణి
- చౌక దుకాణాల్లో సన్నబియ్యం పంపిణి ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



సూర్యాపేట, ఏప్రిల్ 2 (మనం ప్రతినిధి)॰ తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడు సన్న బియ్యం తీసుకోవాలని ప్రతి ఒక్కరు రోజు సన్నబియ్యం తినాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ అన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో పలుచౌక దుకాణాల్లో పంపిణీ తీరును పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి ఒక్కరికి 6 కేజీల ఉచితంగా సన్నబియ్యం పంపిణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 610 రేషన్ దుకాణాలలో రెండు రోజులలో 1.24 లక్షల మంది లబ్ధిదారులకి 2500 మెట్రిక్ టన్నుల పంపిణి చేయటం జరిగిందని పేర్కొన్నారు. రేషన్ షాప్ నెం :14 ని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో బియ్యం నాణ్యత బాగుందా అని అడగగా గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం తినేవిధంగాలేవని ఇప్పుడు ఇస్తున్న సన్నబియ్యం నాణ్యతతోపాటు ప్రతి ఒక్కరు తినేలా చాలా బాగున్నాయని కలెక్టర్ తో సంతోషం గా చెప్పారు. అనంతరం రేషన్ షాప్ లో ఉన్న స్టాక్, బియ్యం నాణ్యత అలాగే ఈ పాస్ మిషన్ లో జరుగుతున్న లావాదేవీలు పరిశీలించారు.ఈ కార్యక్రమం లో డి టి నాగలక్ష్మి, రేషన్ డీలర్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తి

సమాజంలోని అన్యాయాలపై ధైర్య సాహసాలతో విరోచిత పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్నని జీవితాన్ని నేటి యువత స్ఫూర్తి గా తీసుకోవాలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ పిలుపునిచ్చారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఫొటోకి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న సాహసాలు, మొఘల్ పాలకులతో చేసిన పోరాటాలు , పోరాటం ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ఇప్పటికీ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు.అప్పటి రోజుల్లో రాజ్యం స్థాపించేవారు సమాజం లోని అన్యాయాలను, అణచివేతను తొలగించి, సమాజం లో అందరికి సమన్యాయం చేస్తానని ప్రజలలో నమ్మకం కల్పించేవారని అలాంటి నమ్మకం ప్రజలలో సర్దార్ సర్వాయి పాపన్న కల్పించి రాజ్యంలను స్థాపించి సమ సమాజ స్థాపన కోసం కృషి చేసారని, మొఘల్ రాజైనా ఔరాంగజేబ్ కి వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న విరోచితంగా పోరాడి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ 10 మందికి సహాయం చేయాలని సమాజం లోని పేదరికం నిర్మూలించుటకై,సమాజం లో ప్రతి ఒక్కరికి సమానత్వం కల్పించుటకు అలాగే ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కల్పించాలని అన్నారు.ప్రస్తుత సమాజం లో పోటీ పడే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకి నైపుణ్యం తో కూడిన విద్యను భోధించి ఉపాధి కల్పించే విధంగా కృషి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ.... 4 శతబ్దాల క్రితమే మొగులులకి వ్యతిరేకంగా బహుజన సమాజం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ డి ఓ పిడి వివి అప్పారావు,జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్,లత, జగదీశ్వర్ రెడ్డి, కుల సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు స్ఫూర్తిదాయకం

## మొగలాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు



తుంగతుర్తి, ఏప్రిల్ 2(మనం న్యూస్)॰ తెలంగాణ తొలి రాజు, బహుజన రాజ్యాధికారం పోరాట యోధుడు బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు నిరంకుశ పోకడలకు సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యమ ధీరుడు బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటను జయించిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తుంగతుర్తి మండల కేంద్రంలో బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గ315 వ వర్ధంతి సందర్భంగా 365 వ జాతీయ రహదారి పక్కన పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన సామాజిక న్యాయం కోసం కృషి చేసిన వ్యక్తి, దళిత బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన గొప్ప మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన్ని స్మరించుకున్నారు. తెలంగాణ తొలి రాజు బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు మొగలాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన ధీరుడు పాపన్న గౌడ్ అన్నారు తెలంగాణ వీరత్వానికి పరాక్రమానికి ప్రతీక బహుజనుల హక్కుల కోసం పోరాడిన ధీరుడు అన్నారు రాజరికపోకలకు వ్యతిరేకంగా సబండ వర్గాలను ఏకం చేసిన ఉద్యమ వీరుడు అన్నారు ఆ మహనీయునికి నివాళులర్పించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న(అూ), జిల్లా కాంగ్రెస్ నాయకులు పెద్ద బోయిన అజయ్ కుమార్, దాసరి శ్రీను, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పల రాంబాబు, సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండారాజు, నూతనకల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ యాదవ్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తప్పట్ల శంకర్, వైస్ ప్రెసిడెంట్ మాచర్ల అనిల్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎండి అబ్దుల్, కటకం వెంకటేశ్వర్లు, వంశీ యాదవ్, కటకం సూరయ్య, బొంకూరి నాగయ్య, శ్రీ సిద్ధిక్, బొంకూరి రంజిత్, మంగళపల్లి నాగరాజు, కొండ పరశురాం, కొమ్ము జనార్ధన్, మరికంటి అశోక్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల సేవలను మరిచిపోవద్దు

## వారి ఆశయాలను కొనసాగించాలి

## మంత్రి సీతక్క



ములుగు ఏప్రిల్ 2(మనం ప్రతినిధి): దేశం కోసం పేద పీడిత వర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుల సేవలను మర్చిపోవద్దని, వారి ఆశయ సాధనను కొనసాగించాలని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లోని సంక్షేమ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న 315 వ వర్ధంతి కార్యక్రమమునకు రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ పేద పీడిత అన్ని వర్గాల పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన మహా గొప్ప వ్యక్తి సర్దార్ పాపన్న అని కొనియాడారు. మహనీయుల చరిత్రను భావితరాల వారికి అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహనీయులను ఆదర్శంగా తీసుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రాజకీయ, ఉద్యోగలలో రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. మొగులు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో సర్దార్ పాపన్న ముందుండి పోరాటం చేశారని, పోరాటాలు చేసిన మహనీయులను నేటి యువతరం మర్చిపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పాపన్న ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, గౌడ సంఘం సభ్యులు రాజేందర్ గౌడ్, ముజ్యాల భిక్షపతి, గౌడ కుల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీని కలిసిన ఇస్సాక్



ములుగు, ఏప్రిల్ 2( మనం ప్రతినిధి): ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిస్‌ను ములుగు జిల్లా మనం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎండి ఇసాక్ బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ఎస్పీ మనం స్టాఫ్ రిపోర్టర్ ఇస్సాకును అభినందించారు. మనం పేపర్లో వాస్తవ కథనాలు ప్రచురిస్తూ ప్రజల ఆధార అభిమానులు అందుకుంటుందని, భవిష్యత్తులో కూడా మనం పేపర్ నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మనం స్టాప్ రిపోర్టు ఎండి ఇస్సాక్ మాట్లాడుతూ, శాంతి భద్రత, ప్రజల రక్షణ విషయంలో ములుగు జిల్లా పోలీసులు చాలా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.మంగపేట మనం రిపోర్టర్ రహేమతుల్ల,వెంకటాపురం మనం రిపోర్టర్ షబ్బీర్,పాల్గొన్నారు.

## చలి వేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### మంత్రి సీతక్క




ములుగు, ఏప్రిల్ 2,మనం ప్రతినిధి: బుధవారం ములుగు మండలం లోని జంగాలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు.

# కేంద్రమంత్రితో బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీ

- మామూనూరు విమానాశ్రయన్ని త్వరితగతిన పూర్తి చేయండి
- ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి



వరంగల్ , ఏప్రిల్ 2 (మనంబ్యూరో): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర,విప్ దీవకొండ దామోదర్ రావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధి రెడ్డిలు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడుతో భేటీ అయ్యారు.పార్లమెంట్ ప్రాంగణంలోని మంత్రి ఛాంబర్‌లో ఎంపీలు ఆయనతో సమావేశమై తెలంగాణలో విమానశ్రయాల ఏర్పాటుపై చర్చించారు.మామూనూర్ (వరంగల్) విమానాశ్రయం పనులు మొదలు పెట్టి త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా కోరారు.నిజాం కాలంలో నిర్మించిన మామూనూర్ నుంచి గతంలో విమాన సర్వీసులు నడిచాయని,ఇక్కడ నుండి తిరిగి విమానాలు ప్రారంభిస్తే వరంగల్, దాని పరిసర జిల్లాలకు చెందిన ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డిలు మంత్రి రాంమోహన్ నాయుడుకు వివరించారు.అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపాన ప్రతిపాదిత విమానశ్రయం ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిందిగా వారు మంత్రిని కోరారు.సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నవభారత్,ఐటీసీ, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ సహా పలు పరిశ్రమలు నెలకొన్నాయని,దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చేపోయే భక్తులకు ఇక్కడ ఏర్పాటు చేసే విమానాశ్రయం సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి నాయుడుకు బీఆర్ఎస్ ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డిలు వివరించారు.అదేవిధంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల సమీపాన ప్రతిపాదిత విమానశ్రయాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిందిగా ఎంపీలు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

# దివ్యాంగులకు యూడీఐడీ స్మార్ట్ కార్డులు

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్, ఏప్రిల్ 2 మనం న్యూస్: దివ్యాంగులకు ప్రస్తుతం వారి వైకల్య ధ్రువపత్రాన్ని సదరం శిబిరంలో కాగితం రూపంలో ఇస్తున్నారని దానికి కూడా కాల పరిమితి ఉండేదని ఈ సమస్యలేవీ లేకుండా యూడీఐడీ(యూనిక్ డిసెబిలిటీ ఐడీ) నంబరును కేటాయించి స్మార్ట్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించి దివ్యాంగులే నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని, సమగ్ర వివరాలతో పాటు పాస్పోర్టు సైజు ఫొటో, సంతకం లేదా ఆధార్ కార్డు తదితర గుర్తింపు కార్డులను పోర్టల్లో అప్లోడ్ చేసి సదరం శిబిరం నిర్వహించే కేంద్రాల్లో దగ్గర ఉండేదాన్ని ఎంచుకోవాలన్నారు. అక్కడ ఏరోజు సదరం శిబిరం నిర్వహిస్తారో చరవాణికి సందేశం పంపిస్తారని అక్కడికి వెళ్తే వైద్య నిపుణులు వైకల్యాన్ని నిర్ధారించి శాతాన్ని పోర్టల్లో నమోదు చేస్తారని, కొత్త వారితో పాటు ఇప్పటికే సదరం ధ్రువపత్రం ఉన్న వారికి కూడా స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్నారని, స్మార్ట్కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం శిబిరానికి హాజరుకావాలన్నారు. వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయని వైద్యులు నిర్ధారించగానే స్మార్ట్కార్డు మంజూరవుతుందని, డిజిటల్ సంతకంతో స్మార్ట్కార్డు తపాలా ద్వారా దివ్యాంగుడి ఇంటి చిరునామాకు పంపిస్తారని, కార్డులో ఐడీ నంబరు, దివ్యాంగుడి పేరు, వైకల్య రకం, శాతం తదితర వివరాలు ఉంటాయన్నారు. ఈ కార్డులతో రైళ్లు, బస్సు టికెట్లపై రాయితీలు, పింఛను తదితర ప్రయోజనాలు పొందొచ్చని దేశంలో ఎక్కడైనా వాడుకోవచ్చునని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ హెచ్ సీయు భూములను పరిరక్షించండి



- పార్లమెంట్ ప్రసంగంలో విజ్ఞప్తి చేసిన ఎంపీ రవిచంద్ర

వరంగల్, ఏప్రిల్ 2(మనంబ్యూరో): విలువైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.హైదరాబాద్ గచ్చిబౌలిలో నెలకొన్న సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని రాజ్యసభలో మంగళవారం సాయంత్రం మాట్లాడుతూ ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ భూముల్లో చెరువులతో పాటు అరుదైన వక్ష సంపదతో పాటు పెద్ద సంఖ్యలో జింకలు,నెమళ్లు,పక్షులు ఉన్నాయని,ఇది జీవవైవిధ్యానికి నెలవుగా ఉందని ఎంపీ వద్దిరాజు వివరించారు.అత్యంత విలువైన ఈ భూముల్ని వేలం వేయవద్దంటూ విద్యార్థులు,అన్ని వర్గాల ప్రజలు అభ్యర్థిస్తున్నారని, వీటిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, మనందరిపై ఉందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.

# ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగ కుండా చర్యలు చేపట్టండి

- నగర మేయర్ గుండు సుధారాణి



వరంగల్, ఏప్రిల్ 2(మనంప్రతినిధి): ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగ కుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరం లో నీటి సరఫరా తీరును పరిశీలించే క్రమం లో మేయర్ బుధవారం నగర పరిధి లోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ తో పాటు ధర్మ సాగర్ నుండి 1000 ఏం ఎల్ డి డయా పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా జరిగే వాల్వ్ ను కడిపికొండ రాజీవ్ గృహ కల్ప ప్రాంతం లో మేయర్ ఆకస్మికం గా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ రాంపూర్ ఖిలా వరంగల్ ప్రాంతం లో నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడినట్లు తన దృష్టికి రావడం జరిగిన నేపథ్యం లో కడిపికొండ ప్రాంతం లో వాల్వ్ ను పరిశీలించడం జరిగిందని నీటి సరఫరా లో ఏర్పడ్డ అవాంతరాలకు గల కారణాలను అధికారులను మేయర్ అడిగి తెలుసుకొని మాట్లాడుతూ హన్మకొండ వరంగల్ ప్రాంతాలకు నీటి సరఫరా లో ఇబ్బందులు లేకుండా ఇరు ప్రాంతాలకు సమానం గా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని లీకేజీల ద్వారా నీటి వృథా జరిగే అవకాశం ఉన్నందున ఎప్పటికపుడు అరికట్టి నీటి సరఫరా సక్రమం గా జరిగేలా ఏ ఈ లు నిత్యం క్షేత్ర స్థాయి లో పర్యటిస్తూ నీటి సరఫరా లో ఏర్పడే సమస్యలను పరిష్కరించాలని డి ఈ లు వారి పని తీరును పర్యవేక్షించాలని మేయర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ ఈ లు శ్రీనివాస్ రవికుమార్ సంతోష్ బాబు మహేందర్ మాధవి లత డిఈ లు సారంగం కార్తీక్ రెడ్డి ఏ ఈ లు రామన్న మొజామిల్ మేనక హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# సెర్ప్‌కు సంబంధించిన పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్, ఏప్రిల్2(మనంప్రతినిధి): బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్స్ , మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిపిఎంలు, ఏపీఓలు, తదితర అధికారులతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకం అమలు, త్రాగునీరు సరఫర, ఎన్ఆర్ఈఆర్జిఎస్, పెన్షన్స్, సేర్ఫ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో నిరుద్యోగులైన యువతీ, యువకుల కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి అందరికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, ప్రదేశాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు.మండల స్థాయిలో సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.దరఖాస్తుదారులకు పూర్తి గైడ్ చేయుటకు సిబ్బంది నియమించాలని సూచించారు. జిల్లా ప్రత్యేక అధికారులు ఉదయం,సాయంత్రం రాజీవ్ యువ వికాసం పై నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం, ఈ సంవత్సరం వేసవికాలం యాక్షన్ ప్లాన్ ప్రకారం మున్సిపల్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎంపీడీవోలు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రజలకు త్రాగునీరు అందించుటకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్రాగునీరు సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థానిక సోర్స్ ద్వారా సరఫరా చేయాలని అన్నారు. రానున్న ఒకటి రెండు మాసాలలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, సెర్ఫ్ పెన్షన్, సదరం, యూడిఐడి పోర్టల్ ద్వారా సర్టిఫికెట్లు తదితర అంశాలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు వేగంగా సేవలను అందించాలన్నారు. జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు రేపటినుండి ప్రత్యేక కార్యచరణ ప్రకారము రాజీవ్ యువ వికాసం పథకం, త్రాగునీరు సరఫర, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి ఉదయం సాయంత్రం నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, (రెవెన్యూ),లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీర బ్రహ్మచారి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈఓ పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాస్, దేశి రామ్, మండల ప్రత్యేక అధికారులు మరియన్న, సురేష్, శ్రీమన్నారాయణ, విజయనిర్మల, ఇరిగేషన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కడుపునిండా తిండి పెట్టడమే ప్రభుత్వ ధ్యేయం

- అన్నమో రామచంద్ర అనే కాలం పోయింది
- దేశంలోనే సన్నబియ్యం పథకం చారిత్రాత్మకం
- పేదలకు సన్న బియ్యం అందించడమే లక్ష్యం
- ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం
- మంత్రి సీతక్క





ములుగుప్రతినిధి/గోవిందరావుపేట, ఏప్రిల్ 2(మనంన్యూస్): ప్రతి నిరుపేద కుటుంబానికి సన్నబియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నామని, రానున్న రోజులలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. పేదలకు కడుపునిండా తిండి పెట్టాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని, 2013 సంవత్సరంలో ఆహార భద్రత చట్టం తెచ్చిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. బుధవారం మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్, గోవిందరావు పేట , మండలంలలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, అదనపు కలెక్టర్ మహేందర్ జిలతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్నమో రామచంద్ర అనే కాలం పోయిందని, ధనవంతుడు ఎలాంటి అన్నం తింటున్నాడో పేదవాడు సైతం అదే అన్నం తినాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఆహార భద్రత చట్టం తెచ్చి ప్రతి ఒక్కరికి బియ్యం పంపిణీ చేయాలన్న తరహాలోనే ప్రతి వ్యక్తికి పని కల్పించాలని ఉద్దేశంతో పని కోసం హక్కు చట్టం తెచ్చిందని వివరించారు. బ్రిటిష్ వారు మన దేశాన్ని విడిచి వెళుతున్న సమయంలో దేశవ్యాప్తంగా మూడు కోట్ల ఎకరాల్లోనే వరి పంట పండిందని, ఆ సమయంలో తిండి దొరకక గడక, గంజి తాగి జీవించేవారమని అన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ కాలంలో దేశంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో అనేక ప్రాజెక్టులను ఏర్పాటు చేశారని, వారు ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల నీటితోనే రాష్ట్రంలోని రైతులు రికార్డు స్థాయిలో వరి పంట పండిస్తున్నారని అన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ కాలంలో గరిబి హటావో అనే నినాదంతో ప్రతి పేదవాడికి గూడు, గుడ్డతో పాటు బియ్యాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టారని, వారిని ఆదర్శంగా తీసుకొని నేటి ప్రజా ప్రభుత్వం పాలను కొనసాగిస్తుందని అన్నారు. గతంలో ఇతర దేశాల నుండి మన దేశానికి బియ్యం దిగుమతి చేసుకునే వారమని, నేడు రికార్డు స్థాయిలో పంట పండడం వలన మనమే ఇతర దేశాలకు బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లు పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ అందించడం జరిగిందని, జిల్లాలో ఒక్క రైతుకు కూడా బోనస్ డబ్బులు బాకీ లేమని అన్నారు. గత పాలకులు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్నప్పటికీ ఒకవైపు అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళా గ్రూపులకు ఇచ్చిన హామీ మేరకు వడ్డీ రూపాయలను బ్యాంకులలో జమ చేశామని వివరించారు. ఉచిత సన్న బియ్యం పంపిణి కోసం ప్రభుత్వం కిలోకు రూ.40 వరకు ఖర్చు చేసింది. ధనవంతులు తినే సన్న బియ్యం ఇక పై పేదలు కూడా తినే రోజులు వచ్చాయని అన్నారు. దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మక మని, ముఖ్యమంత్రి పేదల కోసం మహత్తరమైన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా తినదగిన బియ్యం సరఫరా చేస్తామని, ఈ పథకం పేదల గుండెల్లో నిలిచే పథకమని మంత్రి పేర్కొన్నారు. ఈ పథకాన్ని పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని మంత్రి వెల్లడించారు. సన్న బియ్యాన్ని పక్కదోవ పట్టించేందుకు డీలర్లు ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని మంత్రి హెచ్చరించారు.

### కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

బుదవారం ములుగు జిల్లా కేంద్రం లో రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబం కడుపు నిండా సన్న బియ్యంతో భోజనం చేయడం లక్ష్యంగా చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌లతో కలసి ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాది ముభారాక్ లబ్ధిదారులకు 20 మందికి చెక్కులను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ షా ఫైజల్ హుస్సేని, డి ఎం డి సి ఎస్ ఓ రాంపతి, తహసిల్దార్ విజయ భాస్కర్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికి సన్నబియ్యం పంపిణీ: కలెక్టర్ దివాకర్ టి.ఎస్.


తెల్ల రేషన్ కార్డు కలిగిన పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడమే కాకుండా గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సైతం సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వలన ప్రజలు తిండి తినలేకపోయారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రతి ఒక్కరు వాడకం చేసుకోవాలని, వాటిని అమ్ముకోకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ధనవంతుడు ఎలాంటి ఆహారం తీసుకుంటున్నారో అలాంటి ఆహారమే పేద ప్రజలకు అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని, ప్రభుత్వం అందిస్తున్న బియ్యంతో ఆహారం తీసుకొని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డిసిఎస్ఓ షా ఫైజల్ హుస్సేని, డిసిఎస్ఓ డిఎం రాంపతి, తహసిల్దారులు విజయ భాస్కర్, గిరిబాబు, సృజన కుమార్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




# ముంబయి జట్టులో నా పాత్ర మాత్రమే మారింది.. మైండ్సెట్ కాదు: రోహిత్



ముంబయి ఇండియన్స్ కు ఐదు ఐపీఎల్ టైటిళ్లను అందించిన కెప్టెన్. కానీ, గతేడాది అతడిని సారథ్య బాధ్యతల నుంచి మేనేజ్ మెంట్ పక్కన పెట్టింది. హార్దిక్ పాండ్యకు అప్పగించింది. ఆ తర్వాతే టీమ్ఇండియాకు రెండు ఐసీసీ ట్రోఫీలను అందించడం గమనార్హం. ఈసారి ఐపీఎల్ లో మూడో మ్యాచ్ లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో బోణీ కొట్టింది. ఆరంభం బాగా లేకపోయినా మళ్లీ పుంజుకుంటామనే దానికి ఈ మ్యాచ్ ఫలితం నిదర్శనమని రోహిత్ వ్యాఖ్యానించాడు. ''నేను కెరీర్ ను ప్రారంభించినప్పటి నుంచి చాలా మార్పులు చేసుకుంటూ వచ్చా. మొదట్లో మిడిలార్డర్ లో ఆడా. ఇప్పుడు ఓపెనర్ గా వస్తున్నా. ముంబయి జట్టుకు కెప్టెన్ గా పనిచేశా. ఇప్పుడు కాదు. నాతోపాటు ఛాంపియన్ గా నిలిచిన జట్టు సభ్యుల్లో కొందరు ఇప్పుడు కోచ్లుగా ఉన్నారు. కాబట్టి, పాత్రలు మారుతూ ఉంటాయి. కానీ, నా మైండ్ సెట్ మాత్రం కాదు. జట్టు కోసం నేనేం చేయాలనుకుంటున్నానో అది మాత్రం మారలేదు. మ్యాచుల్లో గెలవాలి. ట్రోఫీలను సొంతం చేసుకోవాలి. ముంబయి ఇండియన్స్ కు ఇదంతా తెలుసు. గత కొన్నేళ్లలో మేం ట్రోఫీలను గెలుచుకున్నాం. ఎవరూ నమ్మనివిధంగా పుంజుకొని విజేతలుగా నిలిచాం'' అని రోహిత్ వెల్లడించాడు.



## స్నేహిత్ @89

భారత యువ టేబుల్ టెన్నిస్ ఆటగాడు ఫిదెల్ స్నేహిత్ టాప్-100లో చోటు దక్కించుకున్నాడు. తాజా ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్ లో అతడు 89వ స్థానంలో నిలిచాడు. ఇటీవల డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నమెంట్లో అదిరే ప్రదర్శన చేసిన స్నేహిత్.. 34 స్థానాలు మెరుగయ్యాడు. టోర్నీ రెండో రౌండ్లో ప్రపంచ 29వ ర్యాంకర్ యుకియా ఉడాను కంగుతినిపించిన స్నేహిత్.. ప్రిక్వార్టర్స్ లో భారత దిగ్గజ ఆటగాడు ఆచంట శరత్ కమల్ ను ఓడించాడు. స్నేహిత్ క్వార్టర్స్ లో పరాజయం పాలయ్యాడు. డబుల్స్ లో శరత్ కమల్ తో జత కట్టి సెమీఫైనల్ వరకు వెళ్లాడు. ''టాప్-100 ర్యాంకింగ్స్ లో చోటు దక్కించుకోవడం చాలా సంతోషంగా అనిపిస్తోంది. ఈ ఏడాది నా తొలి లక్ష్యాన్ని అందుకున్నా. ఇక టాప్-50పై దృష్టి పెడతా'' అని స్నేహిత్ తెలిపాడు. భారత్ తరఫున స్నేహిత్ కాకుండా మానవ్ థక్కర్ (47వ ర్యాంకు), హర్మీత్ దేశాయ్ (68), మనుష్ షా (73), శరత్ కమల్ (80) టాప్-100లో ఉన్నారు.

## ముంబయికి బ్యాడ్ న్యూస్.. బుమ్రా రాక మరింత ఆలస్యం!



స్టార్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా రాక కోసం ముంబయి ఇండియన్స్ టీమ్ చాలా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. కానీ వారికో చేదువార్త. బుమ్రా ఇప్పుడప్పుడే టీమ్ లోకి వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. ఈ బౌలర్ కైన గాయం కాస్త తీవ్రమైనదే అన్నట్లు సమాచారం. వైద్యబృందం అతణ్ని నిశితంగా పరిశీలిస్తోంది. పూర్తి ఫిట్ నెస్ సాధించకుండా మైదానంలోకి దిగితే సమస్య పెద్దదయ్యే అవకాశమున్నట్లు వారు చెబుతున్నారు. ప్రస్తుతానికి బుమ్రా సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ లో బౌలింగ్ ప్రాక్టీస్ అయితే చేస్తున్నాడు కానీ... అతడి శరీరం ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం కాలేదు. అతడు కచ్చితంగా ఎప్పుడు టీమ్ లోకి వస్తాడో ఇప్పుడప్పుడే చెప్పలేని పరిస్థితి. కానీ ఏప్రిల్ మధ్యలో అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లు సమాచారం. బుమ్రా ఐపీఎల్ లో ఆడాలంటే సెంట్రల్ఆఫ్ ఎక్సలెన్స్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పట్లో ఆ పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. ఐపీఎల్ 2025లో వరుసగా రెండు ఓటముల తర్వాత కోల్ కతా నైట్ రైడర్స్తో జరిగిన మ్యాచ్ లో ముంబయి ఇండియన్స్ తన తొలి గెలుపును నమోదు చేసుకుంది. టీమ్ లో బుమ్రా లేకపోవడం నిజంగా వారికి పెద్ద లోటే.

# హాకీకి వందన వీడ్కోలు

భారత మహిళల హాకీ వెటరన్ ప్లేయర్ వందన కటారియా ఆటకు వీడ్కోలు పలికింది. 15 ఏళ్ల సుదీర్ఘ కెరీర్ లో ఈ స్ట్రైకర్.. 320 మ్యాచ్ లు ఆడి 158 గోల్స్ కొట్టింది. 2020 టోక్యో ఒలింపిక్స్ లో త్రుటిలో కాంస్య పతకం చేజార్చుకున్న భారత జట్టులో 32 ఏళ్ల వందన కూడా సభ్యురాలు. ''భారమైన హృదయంతో ఆటకు వీడ్కోలు పలుకుతున్నా. ఫామ్ లో ఉండగానే ఆటకు దూరం కావాలని అనుకున్నా. ఎంతో కష్టపడి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగా. భారత జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. సుదీర్ఘ కాలం దేశానికి ఆడా. ముఖ్యంగా టోక్యో ఒలింపిక్స్ ను ఎప్పటికీ మరిచిపోలేను. దక్షిణాఫ్రికాపై హ్యాట్రిక్ చేయడం మధుర స్మృతి. కానీ ఒలింపిక్ పతకం సాధించకపోవడం పెద్ద వెలితి. అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలికినా హాకీ ఇండియా లీగ్ లో ఆడతా'' అని వందన తెలిపింది. హరిద్వార్ కు చెందిన వందన 2009లో అరంగేట్రం చేసి.. తక్కువ కాలంలోనే జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగింది. టోక్యో ఒలింపిక్స్లో హ్యాట్రిక్ చేసిన ఆమె.. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా ప్లేయర్ గా నిలిచింది. ''ఎటాకింగ్ లో వందనదే కీలకపాత్ర. ఆమె ముందుండి జట్టును నడిపించేది. గోల్స్ కొట్టి అందరికి స్ఫూర్తినిచ్చేది. భవిష్యత్ తరాలకు ప్రమాణాలు నెలకొల్పింది'' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అన్నాడు. 2016, 2023 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజయాల్లో ప్రధానపాత్ర పోషించిన వందన.. 2022 నేషన్స్ కప్ గెలుపులోనూ కీలకమైంది. హాకీలో వందన సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ (2022), అర్జున (2021) పురస్కారాలు దక్కాయి.

## పంత్ పై నెటిజన్లు ఫైర్

ఐపీఎల్-2025లో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్, లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ తన పేలవ ఫామ్ ను కొనసాగిస్తున్నాడు. వరుసగా మూడు మ్యాచ్ లోనూ పంత్ విఫలమయ్యాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా లక్నో వేదికగా పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్లో పంత్ దారుణ ప్రదర్శన కనబరిచాడు. కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన రిషబ్.. 5 బంతులు ఎదుర్కొని కేవలం రెండు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. గ్లెన్ మాక్స్ వెల్ బౌలింగ్ లో చాహల్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇప్పటివరకు ఈ సీజన్ లో మూడు మ్యాచ్ లు ఆడిన పంత్ కేవలం 15 పరుగులు మాత్రమే చేశాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ఖరీదైన ఆటగాడిగా నిలిచిన రిషబ్ పంత్ ఆట తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో పంత్ ను దారుణంగా ట్రోలు చేస్తున్నారు. నీకంటే రూ. 30 లక్షల తీసుకున్న యువ ఆటగాళ్లు ఎంతో బెటర్ అని పోస్టులు పెడుతున్నారు. కాగా గతేడాది జరిగిన మెగా వేలంలో రూ. 27 కోట్ల రికార్డు ధరకు పంత్ ను లక్నో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది.

# ఆలియాతో నాకు పోలికా?: రౌడి బ్యూటీ



బాలీవుడ్ నటి అలియాభట్తో తనని పోల్చి చూడటంపై నటి షాలినీ పాండే స్పందించారు. వేరే నటితో తనని పోల్చి చూడటం తనకు ఏమాత్రం నచ్చలేదన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ''ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్ తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటా. ఎన్నో విషయాలు నేర్చుకోవాలనుకుంటా. అయితే ఆమెతో పోల్చి చూస్తుంటే మాత్రం పెద్దగా నచ్చదు. నన్ను నాలా గుర్తిస్తే చాలు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం'' అని షాలినీ పాండే తెలిపారు. సినిమాల్లో రాణించాలనే ఉద్దేశంతో షాలినీ ఇంటినుంచి వచ్చేసిన విషయం తెలిసిందే. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ లో సినిమాలు, సిరీస్ లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్ సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా పరిశ్రమలోకి అడుగుపెట్టడం వల్ల కెరీర్ ఆరంభంలో తాను కూడా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. తొలినాళ్లలో ఓ దర్శకుడు తనతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడని తెలిపారు. అందరి ముందు అతడిపై కేకలు వేశానని వెల్లడించారు. అలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు ఎలా రియాక్ట్ కావాలో తాను తెలుసుకున్నానని చెప్పారు.



## 'విశ్వంభర' కోసం చాలా కాలం తర్వాత చిరు ఇలా?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా అలాగే మరింతమంది టాలెంటెడ్ నటీనటులు నటిస్తున్న అవైటెడ్ భారీ ఫాంటసీ చిత్రమే విశ్వంభర. మరి ఎన్నో అంచనాలు నెలకొల్పుకున్న ఈ చిత్రం కోసం మెగా అభిమానులు ఎప్పుడు నుంచో ఆసక్తిగా ఉన్నారు. మరి వాటికి తగ్గట్టుగానే మేకర్స్ గ్రాండ్ ప్లానింగ్స్ ఈ సినిమాకి చేస్తుండగా ఇపుడు ఓ సాలిడ్ అప్డేట్ కోసం అయితే మెగా అభిమానులు ఎదురు చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఒక ఇంట్రెస్టింగ్ టాక్ ఈ చిత్రంపై ఇపుడు వినిపిస్తుంది. దీనితో ఈ సినిమా కోసం చిరు గాయకునిగా మారనున్నారని తెలుస్తుంది. చిరు గతంలో పలు సినిమాలకి పాటలు పాడిన సంగతి తెలిసిందే. పాటలతో పాటుగా పాటల్లో కొన్ని కొన్ని డైలాగ్స్ తో మాట సాయం అందించిన సినిమాలు కూడా చాలానే కనిపించాయి.


మరి ఇపుడు విశ్వంభర కోసం చిరు మరో సారి ఈ స్టెప్ తీసుకోనున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## 'అఖండ 2'.. పక్కా ప్లానింగ్ ప్రకారం అంతా

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన హ్యాట్రిక్ సెన్సేషనల్ హిట్ చిత్రం అఖండ కోసం అందరికీ తెలిసిందే. తెలుగు సినిమా దగ్గర ఒక బిగ్గెస్ట్ హిట్ అయ్యిన సినిమాల్లో భారీ లాంగ్ రన్ ని ఈ చిత్రం చూసింది. అయితే దీనికి సీక్వెల్ గా మేకర్స్ అఖండ 2 తాండవంని ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే.

ఇక ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా ఓ ఇంట్రెస్టింగ్ టాక్ దీనిపై ఇపుడు వినిపిస్తుంది. దీని ప్రకారం అఖండ 2 షూటింగ్ ని మేకర్స్ పక్కా ప్లానింగ్ గా కంప్లెట్ చేస్తున్నారట. పార్ట్ 1 లో బాలయ్య డ్యూయల్ రోల్ లో చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఇవి పార్ట్ 2 లో కూడా కొనసాగనున్నాయి. అయితే మొదటిగా మేకర్స్ అఘోర గెటప్ లో టాకీ పార్ట్ మొత్తాన్ని కంప్లీట్ చేసేస్తున్నారట.

ఇక ఇది అయ్యాక బాలయ్య లోని మరో షేడ్ షూటింగ్ ని మొదలు పెట్టనున్నారట. ఈ షూటింగ్ తో జూన్ నాటికి మొత్తం సినిమాని పూర్తి చేసేయాలని మేకర్స్ టార్గెట్ పెట్టుకున్నట్టుగా తెలుస్తుంది. దీనితో అఖండ 2 మాత్రం అనుకున్నట్టు గానే సెప్టెంబర్ రిలీజ్ కి రానుందట. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తుండగా 14 రీల్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



## 'మ్యాడ్' స్టార్తో మెగా డాటర్ మూవీ

మ్యాడ్ చిత్రానికి టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ రెస్పాన్స్ దక్కిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్ గా 'మ్యాడ్ స్క్వేర్' రాగా, ఇది బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ వసూళ్లతో దూసుకెళ్తోంది. ఈ సినిమాను దర్శకుడు కల్యాణ్ డైరెక్ట్ చేశారు. కాగా, ఇందులోని కామెడీ ఎలిమెంట్స్, ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాయి. ఈ సినిమాలో హీరోలుగా నటించిన రామ్ నితిన్, నార్నె నితిన్, సంగీత్ శోభన్ తమ కామెడీ టైమింగ్తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు.

ఇక ఈ సినిమాలో నటించిన సంగీత్ శోభన్ ప్రస్తుతం ఓ కొత్త సినిమాను స్టార్ట్ చేశారు. మెగా డాటర్ నిహారిక ప్రొడక్షన్ కంపెనీ ది పింక్ ఎలిఫెంట్స్ బ్యానర్ లో సంగీత్ శోభన్ తన నెక్స్ట్ మూవీని స్టార్ట్ చేశారు. నిహారిక సరసన సంగీత్ శోభన్ నటిస్తుండటంతో ఈ కాంబినేషన్ ఎంతమేర అలరిస్తుందో చూడాలి. ఇక ఈ సినిమాను మానసా శర్మ డైరెక్ట్ చేయనున్నారు. మరి ఈ సినిమాలో నిహారిక, సంగీత్ శోభన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి. ఈ చిత్ర షూటింగ్ త్వరలో షూటింగ్ ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.